www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

స్వీచాఫ్.. నెట్‌వర్క్ బిజీ..!

'హలో'.. హలో' అంటుండగానే కట్ అవుతున్న కాల్!

సెల్ సిగ్నల్స్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు

మాట్లాడుతూ ఉండగానే కాల్ డ్రాప్.. జంప్

మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టని కంపెనీలు

సెల్ ఆపరేటర్లకు జరిమానాలు విధించే అవకాశం

అయినా.. పట్టించుకోని టెలికాం నియంత్రణ సంస్థ

12



సోమవారం | 4-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 127 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: దశమి ఉ.11:42 తదుపరి ఏకాదశి; నక్షత్రం: అనూరాధ ఉ.9:13 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: మ.3:18-5:03; దుర్ముహూర్తం: మ.12:46-1:37, మ.3:19-4:10; అమృతఘడియలు: రా.1:46-3:31; రాహుకాలం: ఉ.7:30-9:00; సూర్యోదయం: 5:59, సూర్యాస్తమయం: 6:43 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


కాళేశ్వరంపై సిట్?

అవకతవకలపై విచారణకు ప్రత్యేక బృందం.. అసెంబ్లీలో చర్చ

- మూడు రోజుల పాటు సభ.. సభ్యులందరికీ కమిషన్ నివేదిక.. సిట్ వేయడమా.. చర్యలకు ఉపక్రమించడమా?
- నేటి మంత్రివర్గ భేటీలో సుదీర్ఘంగా చర్చించి నిర్ణయం.. అన్ని పార్టీల ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరించే యోచన
- అసలేం జరిగిందో ప్రజలకు తెలిసేలా సభలో సమగ్ర చర్చ.. సచివాలయంలో భేటీ అయిన అధికారుల కమిటీ

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలపై ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించనుందని సమాచారం. ఇదే అంశంపై ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశాలను కూడా నిర్వహించాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. తెలంగాణకు వరంగా గత సర్కారు అభివర్ణించిన కాళేశ్వరం.. ప్రజాధనం వృథా చేసిన ప్రాజెక్టుగా మారిందంటూ విచారణ కమిషన్ చెప్పిన వివరాలను ప్రజలకు వివరించేందుకు సర్కారు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈ మొత్తం వ్యవహారంపై.. సోమవారం నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో చర్చించి, కీలక నిర్ణయం తీసుకోనుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కాళేశ్వరం అవకతవకలపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపైనే క్యాబినెట్ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. అలాగే.. ఈ ప్రాజెక్టు అవకతవకల వెనుక ఉన్న రాజకీయ నాయకులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అధికారులపై ఏ విధమైన చర్యలకు ఉపక్రమించాలనే విషయాలపైనా చర్చించనున్నారు. దాంతోపాటు.. శాసనసభ సమావేశాలు నిర్వహించి, సభ్యులందరికీ విచారణ కమిషన్ నివేదికను అందించి.. దానిపై చర్చ జరపాలనే యోచనలోనూ సర్కారు ఉన్నట్టు సమాచారం. దీంతో కాళేశ్వరం ప్రాజెక్టులో అసలేం జరిగిందనేది ప్రజలకు స్పష్టంగా తెలిసే అవకాశం ఉంటుందని భావిస్తోంది. కాగా కాళేశ్వరంపై విచారణ కోసం ఏర్పాటైన పీసీ ఘోష్ కమిషన్ అందించిన నివేదికపై అధ్యయనానికి.. సాధారణ పరిపాలన, న్యాయ, సాగునీటి పారుదల శాఖల ముఖ్యకార్యదర్శులతో

మిగతా 13వ పేజీలో...


సీఎం రేవంత్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన చిరంజీవి

నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

క్యాబినెట్ నోట్‌పై అధికారులతో మంత్రి ఉత్తమ్, సీఎస్ భేటీ 13

రేపు ఢిల్లీకి సీఎం రేవంత్.. మూడు రోజులపాటు అక్కడే మకాం!



సర్కారు నిర్ణయాలపై ఏం చేద్దాం..?

ఫాంహౌస్‌లో పార్టీ నేతలతో కేసీఆర్ భేటీ

కాళేశ్వరం కమిషన్ నివేదికపై ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందన్న దానిపై చర్చ

కవిత వ్యవహారం, బీసీ రిజర్వేషన్ల అంశంపైనా సమాలోచనలు 13

నేడు కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శనకు వెళ్లనున్న బీఆర్ఎస్ నేతలు

నాపై అనుచిత వ్యాఖ్యల వెనక

పెద్ద నాయకుడు!

ఇంటి ఆడబిడ్డనని చూడకుండా..

నా మీద నీచంగా వ్యాఖ్యలు చేయిస్తున్నారు

తాత్కాలికంగా శునకానందం పొందొచ్చు

అన్నీ వారికే తిరిగికొట్టే సమయం వస్తుంది

ఇంకో లిల్లీపుట్ నాయకుడు నా గురించి 'ఆమె ఎవరు' అంటూ మాట్లాడుతున్నారు

నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్‌ను నాశనం చేసిన ఆయన్ను ప్రోత్సహిస్తున్నదెవరో ఆలోచించాలి

మరోసారి ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు!

నేరుగా పేర్లు ప్రస్తావించకుండా కేటీఆర్, జగదీశ్‌రెడ్డిలపై తీవ్ర విమర్శలు?

మీడియా సమావేశంలో ఆవేదన

నేటి నుంచి 72గంటల నిరాహారదీక్ష చేస్తా: కవిత

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లోని పెద్ద నాయకుల తీరుపై కొన్ని నెలలుగా అసంతృప్తి వ్యక్తం చేస్తూ వస్తున్న ఆ పార్టీ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. నేరుగా పేర్లు ప్రస్తావించకుండా.. పరోక్షంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిలను ఉద్దేశించి తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఓ పెద్ద నాయకుడు ఇంటి ఆడబిడ్డనని కూడా చూడకుండా తనపై నీచంగా, అనుచిత వ్యాఖ్యలు చేయిస్తున్నారని ఆరోపించారు. పెద్ద నాయకుడి అండతో సొంత పార్టీ నేతలే తనను ఇబ్బంది పెడుతున్నారని.. ఇవన్నీ ఆషామాషీగా

మిగతా 13వ పేజీలో...

కేసీఆర్ బద్ధ శత్రువుల మాటలే ఆమె మాట్లాడుతున్నారు

నేను కనీసం గెలిచా.. కొందరు గెలవనేలేదు కదా!

ఎమ్మెల్సీ కవితపై జగదీశ్‌రెడ్డి విసుర్లు 13

బండరాయి పడి.. ఆరుగురు కూలీల మృతి


ప్రమాదం జరిగిన బల్లికురవలోని గ్రానైట్ క్వారీ

8 మందికి గాయాలు.. క్వారీలో ఘోరం

ఏపీలోని బాపట్ల జిల్లాలో ఘటన 3

మృతులు, క్షతగాత్రులంతా ఒడిసా వాసులే

సీఎం బాబు దిగ్ర్భాంతి.. విచారణకు ఆదేశం

పుట్టినరోజు వేడుకల్లో డ్రగ్స్ మత్తు

3

ఆరుగురు ఐటీ ఉద్యోగుల అరెస్టు

3 కార్లు, మద్యం బాటిళ్లు, డ్రగ్స్ స్వాధీనం

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఘటన

అసహజ మరణాల రికార్డులు ధ్వంసం

ధర్మస్థల కేసులో పోస్టుమార్టం నివేదికలు.. ఫొటోలూ మాయం 2

ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వెలుగులోకి

గుర్తుతెలియని బాలిక మృతదేహం ఖననంపై సిట్‌కు ఫిర్యాదు చేసిన కార్యకర్త

నిబంధనలన్నీ తుంగలో తొక్కారని ఆరోపణ

అవయవ దానంలో తెలంగాణ టాప్

నిరుడు 725 మందికి అవయవ మార్పిడి

జీవన్‌దాన్‌కు అవార్డు అందజేసిన కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా 12


'ఎల్బీనగర్-హయత్‌నగర్' ఎలివేటెడ్ కారిడార్ నమూనా

8 లేన్లతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్

విజయవాడ హైవేలో ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ రేడియో స్టేషన్ వరకు నిర్మాణం

5.5 కిలోమీటర్ల దూరం.. రూ.650 కోట్ల ఖర్చు

అనుమతుల కోసం 6న కేంద్ర మంత్రి గడ్కరీని కలుస్తా

ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్/మన్సూరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్-విజయవాడ నేషనల్ హైవేపై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఎల్బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు 5.5 కిలోమీటర్ల మేర 8వరుసలతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్(రోడ్డు)ను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకు రూ.650 కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేసింది. నాగ్‌పూర్‌లో నిర్మించిన ఓ డబుల్ డెక్కర్ కారిడార్ నమూనాలోనే ఇక్కడ కూడా

మిగతా 14వ పేజీలో...

స్కానింగ్ కేంద్రాలపై పర్యవేక్షణేది?

తూతూ మంత్రంగా పీసీపీఎన్‌డీటీ తనిఖీలు

సంఘటనలు జరిగితేనే హడావుడి.. రాష్ట్రంలో 4,180 కేంద్రాలు

వీటిలో నెలకు 10 శాతం కేంద్రాల్లో కూడా తనిఖీలు జరగట్లే

యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు చేసేస్తున్న వైనం

కేంద్రాల్లో అనుమతుల్లేకుండానే స్కానింగ్ యంత్రాలు



హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లింగ నిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఆస్పత్రుల్లో అనుమతుల్లేకుండా అల్ట్రా స్కానింగ్ యంత్రాలను ఏర్పాటు చేస్తూ.. ఇష్టారాజ్యంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్కానింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అదే సమయంలో.. స్కానింగ్ కేంద్రాలపై పర్యవేక్షణకు ఉద్దేశించిన ప్రీకాన్సెప్షన్ ప్రీనాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్(పీసీపీఎన్‌డీటీ) చట్టం-1994 పకడ్బందీగా

మిగతా 12వ పేజీలో...


నిర్మల్ జిల్లా భైంసాపూర్‌లో పాదయాత్రలో మహేశ్ గౌడ్, మీనాక్షి తదితరులు

తెలంగాణ కుల సర్వే చూసి
ముఖం చాటేసిన మోదీ

బీసీ రిజర్వేషన్లకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మోకాలడ్డు

దోచిన సొమ్ము పంచుకునేందుకే కేటీఆర్, కవిత పంచాయితీ

కాంగ్రెస్‌లో విభేదాలు బీఆర్ఎస్ మీడియా సృష్టే

ముఖ్యమంత్రి రేవంత్‌ది, నాది అన్నదమ్ముల అనుబంధం

జనహిత పాదయాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్

నిజామాబాద్, నిర్మల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాహుల్ గాంధీ ఆలోచన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో చేపట్టిన కుల సర్వేను చూసి ప్రధాని మోదీ ముఖం చాటేశారని, అమిత్ షా ఇంట్లో దాక్కున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. జనహిత పాదయాత్రలో భాగంగా

మిగతా 13వ పేజీలో...

బనకచర్లను అడ్డుకున్నాం

13

బీఆర్ఎస్ నేతలు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు

ప్రాణహిత-చేవెళ్ల, ఇచ్చంపల్లి ప్రాజెక్టులు నిర్మిస్తాం: ఉత్తమ్

రామగుండం ఎత్తిపోతల షురూ



వీళ్లకేం తక్కువని!?

అనేక మంది మాజీ ప్రజాప్రతినిధులకు డబుల్ పెన్షన్లు

ఒకే నేత ఎమ్మెల్యే, ఎంపీగా చేసి మాజీ అయితే జీవితాంతం రెండేసి పెన్షన్లు

విడివిడిగా ఇస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఒక్క రోజు ఎమ్మెల్యేగా చేసి మాజీ అయినా పెన్షన్

పదవిలో ఉండగా రూ.లక్షల్లో జీత భత్యాలు.. ఉద్యోగులకు లేని వెసులుబాటు వీరికెందుకు?

ఆయన ఓ బడా పారిశ్రామికవేత్త! వందలకోట్ల ఆస్తిపరుడు! ఒకసారి ఎమ్మెల్యేగా పని చేశారు. మరోసారి ఎంపీ అయ్యారు. ప్రస్తుతం 'మాజీ' మాత్రమే! కానీ... ఆయనకు మాజీ ఎమ్మెల్యేగా ఒక పింఛను, మాజీ ఎంపీ హోదాలో మరో పింఛనూ ఇస్తున్నారు. ఈ 'డబుల్ ధమాకా' ఎందుకు?

ఒకప్పుడు అత్యంత సాధారణ జీవితం గడుపుతూ, ఆర్టీసీ బస్సుల్లోనే తిరిగే నేతలు ఎమ్మెల్యేలు అయ్యేవారు. ఇప్పుడు.. ఎన్నికల్లో రూ.30 కోట్లు ఖర్చుకూ వెనుకాడకుండా ఎమ్మెల్యేలు అవుతున్న వారే ఎక్కువగా కనిపిస్తున్నారు. మాజీలు అయ్యాక రూ.30వేల పింఛను తీసుకుంటేగానీ వీరికి రోజు గడవదా?

... ఇవి సామాన్యులు సంధిస్తున్న ప్రశ్నలు!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒక వ్యక్తి తన ఉద్యోగ జీవితంలో ఎన్ని పోస్టులు చేసినా... రిటైర్ అయిన తర్వాత ఒకటే పెన్షన్!

ఉద్యోగులకు పదవీ విరమణ తర్వాతే పెన్షన్ వస్తుంది. అయితే... నిర్దిష్ట సర్వీసు పూర్తి చేసుకోకుండా రాజీనామా చేస్తే ఫుల్ పెన్షన్ రాదు. అందులో కోత పడుతుంది!

సామాజిక పింఛను దగ్గరికే వద్దాం! దంపతులు ఇద్దరూ వృద్ధులే అయినా... వారిలో ఒకరికి మాత్రమే వృద్ధాప్య పింఛను వస్తుంది!

అలాగే ఇవ్వాలని ప్రజాప్రతినిధులు చట్టాలు చేశారు! కానీ... ఘనత వహించిన మన నేతల విషయంలో ఏం జరుగుతోందో తెలుసా? ఒకేఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచి... ఏదైనా

మాజీల పింఛను పద్ధతిపై జనంలో చర్చ

కారణాలవల్ల నెలకో, రెండు నెలలకో 'మాజీ' అయినా జీవితాంతం పింఛను పొందవచ్చు. అదే నేత... ఎంపీగా గెలిస్తే, మాజీ అయిన తర్వాత ఆ హోదాలో మరో పింఛను ఇస్తారు. మాజీ ఎమ్మెల్యేగా రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేలు పింఛను ఇస్తే... మాజీ ఎంపీలకు కేంద్ర ప్రభుత్వం రూ.31వేలు జీవితాంతం చెల్లిస్తుంది. ఇలా ఒకే వ్యక్తికి రెండేసి పింఛన్లు ఇవ్వడంలో హేతుబద్ధత ఏమిటో ఎవరికీ అర్థం కాదు. పార్లమెంటు చట్టం ప్రకారం మాజీ ఎంపీలకు, రాష్ట్ర శాసనసభ చట్టాల ప్రకారం మాజీ ఎమ్మెల్యేలకు

మిగతా 13వ పేజీలో...



నేటి నుంచి షూటింగ్స్ బంద్

ఫిల్మ్ చాంబర్‌తో చర్చలు విఫలమవడంతో ఫెడరేషన్ నిర్ణయం 10

వేతనాలు పెంచని సినిమాల షూటింగ్‌కు వెళ్లకూడదని తీర్మానం

దిగొచ్చిన కేంద్రం

రాష్ట్రానికి ఈ నెలలో 65 వేల టన్నుల యూరియా సరఫరా 14

ఆర్ఎఫ్‌సీఎల్‌కు ఎరువుల శాఖ ఆదేశం

58 రోజుల షట్‌డౌన్‌తో తగ్గిన ఉత్పత్తి

బీమా లేని వాహనాలపై కొరడా!


భారీ జరిమానా విధించాలని కేంద్రం ప్రతిపాదన

న్యూఢిల్లీ, ఆగస్టు 3: రహదారులపై వేగ పరిమితుల్లో మార్పులతోపాటు ఇన్సూరెన్స్ లేని వాహనాల కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మోటారు వాహనాల చట్టంలో కొత్త సవరణలను ప్రతిపాదించింది. బీమా లేని వాహనాలను రోడ్డుమీద తిప్పితే.. భారీగా జరిమానా విధించాలని ఈ ప్రతిపా దనల్లో పేర్కొంది. ప్రస్తుతం బీమా లేకుండా వాహనాలు నడిపితే.. తొలిసారి ఈ నేరానికి పాల్పడిన వారికి రూ.2వేలు, మళ్లీ మళ్లీ ఇదే నేరానికి పాల్పడితే రూ.4వేలు జరిమానా విధిస్తున్నారు. అయితే తాజా ప్రతిపాదనల ప్రకారం మొదటిసారి ఇన్సూరెన్స్ లేకుండా పట్టుబడితే ప్రాథమిక బీమా ప్రీమియంకు మూడు రెట్లు, తదుపరి ఉల్లంఘనలకు ఐదు రెట్లు జరిమానా విధించాలని నిర్ణయించారు. ఇది అమలులోకి వస్తే బీమా లేని కార్లకు భారీ జరిమానా పడే అవకాశం ఉంది. భారత్‌లో బీమా లేని కార్లు, వాహనాలు యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు కేంద్రం ఈ తరహా చర్యలకు ఉపక్రమించనుంది. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ పునరు ద్ధరణలో కూడా కొన్ని కఠిన నిబంధనలు విధించాలని ప్రతిపాదించింది. అతివేగం లేదా మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారికి తప్పనిసరిగా డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించాలని సూచించింది. అంతేకాకుండా డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ సమయంలో 55 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్న వారికి మళ్లీ డ్రైవింగ్ టెస్ట్ నిర్వహించాలని పేర్కొంది. అలాగే.. ప్రస్తుతం కేంద్రం నిర్ణయించిన వేగ పరిమితులు, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయిస్తున్న వేగ పరిమితులకు మధ్య తేడా ఉంటోంది. దీనివల్ల డ్రైవర్లు గందరగోళానికి గురవుతూ.. తమకు తెలియకుండానే వేగ పరిమితులను ఉల్లంఘిస్తున్నారు. ఈ నేపథ్యంలో వేగ పరిమితుల్లో సవరణ చేయాలని కేంద్రం నిర్ణయించింది.

రాష్ట్రపతిని వేర్వేరుగా కలిసిన మోదీ, అమిత్ షా

న్యూఢిల్లీ, ఆగస్టు 3: రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ఆదివారం ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా వేర్వేరుగా సమావేశమయ్యారు. వీరిద్దరూ రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి ముర్ముతో భేటీ అయినట్లు రాష్ట్రపతి భవన్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఆపరేషన్ సిందూర్‌పై చర్చ మినహా ఎలాంటి కార్యకలాపాలు జరగలేదు. వాయిదాల పర్వం కొనసాగుతోంది. మరోవైపు, మణిపూర్‌లో మరో ఆరు నెలలు రాష్ట్రపతి పాలన కొనసాగింపుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రధాని, హోం మంత్రి కొన్ని గంటల వ్యవధిలో రాష్ట్రపతితో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

లోకం తీరు



వంద ఫిర్యాదులొచ్చినా దర్యాప్తు చేస్తాం

» ప్రజ్వల్ వివాదంలో 'సిట్' చీఫ్ బిజయ్ కుమార్ వెల్లడి

బెంగళూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దాడికి సంబంధించి వంద ఫిర్యాదులు వచ్చినా దర్యాప్తు చేస్తామని 'సిట్' చీఫ్ ఏడీజీపీ బిజయ్‌కుమార్ సింగ్ తెలిపారు. ప్రజ్వల్ రేవణ్ణకు ప్రజాప్రతినిధుల కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. ఫిర్యాదు చేసిన బాధితురాలు ఏడాదిగా న్యాయం కోసం గట్టిగా నిలబడ్డారన్నారు. కీలకమైన కేసులో శిక్ష పడడం పోలీసు శాఖకు గర్వకారణమన్నారు. బాధితులు ఎంతమంది ఉన్నా.. ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామన్నారు. హాసన్ జిల్లాలో లైంగిక దాడులకు సంబంధించి ఐదు కేసుల్లో సిట్ విచారణ చేసిందని, ఇందులో కేఆర్ నగర్ తాలూకా బాధితురాలికి సంబంధించిన అత్యాచారం కేసులోనే కోర్టు తీర్పు ఇచ్చిందని అన్నారు. మరో రెండు కేసులు విచారణ దశలో ఉన్నాయన్నారు. కాగా.. పెన్ డ్రైవ్ పంపిణీకి సంబంధించి దర్యాప్తు దాదాపు పూర్తయిందని, రెండు వారాల్లో చార్జిషీట్ సమర్పిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా, ప్రజ్వల్ రేవణ్ణను పరప్పన అగ్రహార జైలుకు తరలించారు. జైలులో అతడికి ప్రత్యేక దుస్తులతోపాటు ఖైదీ నంబరు 15528 కేటాయించారు.

నువ్వు 'ఫూల్'.. నువ్వే 'రాస్కెల్'..!

» తమిళనాడులో డీఎంకే ఎంపీ, ఎమ్మెల్యే మధ్య తిట్ల దండకం

చెన్నై, ఆగస్టు 3: తమిళనాడులోని అధికార పార్టీ డీఎంకేకు చెందిన ఓ ఎంపీ, ఓ ఎమ్మెల్యే పోటీపడి మరీ బహిరంగ వేదికపై తిట్టేసుకున్నారు. నువ్వు ఒక 'ఫూల్', కాదు నువ్వే 'రాస్కెల్'.. అంటూ ఒకరిపై ఒకరు మాటల వాగ్వాదానికి దిగారు. వీరిద్దరి మధ్య తిట్ల దండకానికి థేని జిల్లాలో జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమం వేదికైంది. సీఎం స్టాలిన్ శనివారం 'నలం కాకుమ్ స్టాలిన్' అనే ఆరోగ్య పథకాన్ని చెన్నై నుంచి ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ తంగ తమిళ్‌సెల్వన్, ఎమ్మెల్యే మహారాజన్ మధ్య మాటల యుద్ధం జరిగింది. స్టేజీపై ఎమ్మెల్యే లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తుండగా, తాను కూడా ఆ పంపిణీలో పాల్గొనేందుకు ఎంపీ ప్రయత్నించారు. మహారాజన్ చిరాకు పడ్డాడు. సర్టిఫికెట్‌ను లాక్కొని.. ఎంపీని పట్టించుకోలేదు. దీంతో చిర్రెత్తిపోయిన ఎంపీ తమిళ్‌సెల్వన్.. ఎమ్మెల్యే మహారాజన్‌ను 'ఫూల్' అంటూ తిట్టాడు. దీనికి తీవ్రంగా స్పందించిన ఎమ్మెల్యే ఆయన్ను 'రాస్కెల్' అంటూ వాగ్వాదానికి దిగారు.

'నీట్' రద్దు చేయాలి: కమల్ హాసన్

చెన్నై, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)ను రద్దు చేయాలని అగ్రనటుడు, రాజ్యసభ సభ్యుడు, ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్ హాసన్ డిమాండ్ చేశారు. హీరో సూర్య సారథ్యంలోని అగరం ఫౌండేషన్ 15వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం చెన్నైలో జరిగాయి. ఈసందర్భంగా జరిగిన సభలో కమల్ ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ, అగరం ఫౌండేషన్‌లో విద్యాభ్యాసం చేసిన అనేక మంది విద్యార్థులు డాక్టర్లుగా, వివిధ హోదాల్లో కొనసాగుతున్నారని, అయితే 2017 నుంచి దీన్ని కొనసాగించడం కష్టసాధ్యంగా మారిందన్నారు. దీనికి కారణం నీట్ పరీక్ష ప్రధాన కారణమన్నారు. 2017 నుంచి ఈ రోజు వరకు అలాంటి విద్యావకాశాలు లేకుండా చేసింది నీట్ చట్టమన్నారు. ఆ చట్టం ఇపుడు ఎలాంటి ఆయుధం లేకుండా దేశాన్ని ధ్వంసం చేస్తోందని ఆరోపించారు.

కేరళలో 'రెండు రూపాయల డాక్టర్' కన్నుమూత


గోపాల్ (ఫైల్)

తిరువనంతపురం, ఆగస్టు 3: 'రెండు రూపాయల డాక్టర్' అని కేరళ ప్రజలు ఆప్యాయంగా పిలుచుకొనే డాక్టర్ ఏకే రైరు గోపాల్(80) ఆదివారం కన్నుమూశారు. వైద్యం ఖరీదైన వ్యవహారంగా మారిన ఈ రోజుల్లో కన్నూర్‌కు చెందిన ఆయన నిరుపేదలు, అనాథల నుంచి కేవలం రూ.2 నామమాత్రపు రుసుము తీసుకుని 50ఏళ్లకు పైగా నిస్వార్థంగా వైద్య సేవలు అందించారు. తెల్లవారుజామున 3.30గంటల నుంచే రోగులను చూడటం ప్రారంభించేవారు. ఆయన ఇంటి ముందు నిత్యం వందలాది మంది పేషెంట్లు క్యూలో నిలబడేవారు. రోజుకు 300మందిని పైగా పరీక్షించేరు.

హెచ్ఎంను బదిలీ చేయించాలని ట్యాంకులో విషం

బెంగళూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రధానోపాధ్యాయుని బదిలీ చేయించాలని కుట్రపన్ని విద్యార్థులు తాగే తాగునీటి ట్యాంకులో విషం కలిపారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురిని కర్ణాటక పోలీసులు అరెస్టు చేశారు. సవదత్తి తాలూకా హూళికట్టి ప్రభుత్వ పాఠశాలలో 13 ఏళ్లుగా హెచ్ఎంగా కొనసాగుతున్న సులేమాన్‌ను బదిలీ చేయించాలని సాగర్ పాటిల్, నాగనగౌడ పాటిల్, కృష్ణ మాదర కుట్ర పన్నారు. హెచ్ఎంకు చెడ్డపేరు వస్తే ఉన్నతాధికారులు బదిలీ చేస్తారని వీరు భావించారు జూలై 14న ట్యాంకులో విషం కలిపారు. ఆ నీటిని తాగి 11 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు.

అమెరికాలో అదృశ్యమైన వృద్ధుల మృతి

వాషింగ్టన్, ఆగస్టు 3: అమెరికాలో భారత సంతతికి చెందిన నలుగురు వృద్ధులు అదృశ్యమైన ఘటన విషాదంగా ముగిసింది. అమెరికాలో బఫెలో నగరం నుంచి వెస్ట్ వర్జీనియాలోని ఓ ఆధ్యాత్మిక ప్రదేశానికి ఇటీవల కారులో బయలుదేరిన వీరు కనిపించకుండా పోయారు. వీరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు మార్షల్ కౌంటీ షెరిఫ్ కార్యాలయం ఆదివారం ప్రకటించింది. ఈ వృద్ధులు ప్రయాణించిన కారు ఓ ఎత్తైన రోడ్డులో అదుపు తప్పి ప్రమాదానికి గురైనట్లు గుర్తించారు. మృతి చెందిన వారిని ఆశ దివాన్(85), కిషోర్ దివాన్(89), శైలేష్ దివాన్(86), గీత దివాన్(84)గా గుర్తించారు. జూలై 31 నుంచి వీరి నుంచి ఎటువంటి సమాచారం లేకుండా పోయిందని మార్షల్ కౌంటీ షెరిఫ్ డార్శీ తెలిపారు.

నా సమాధిని తవ్వుకుంటున్నా

» హమాస్ బంకర్‌లో ఇజ్రాయెల్ పౌరుడి ఆవేదన



టెల్‌అవీవ్, ఆగస్టు 3: "నా సమాధిని నేనే తవ్వుకుంటున్నాను. రోజురోజుకూ బలహీనపడుతున్నాను. నా వాళ్లను తిరిగి కలిసే పరిస్థితులు కనిపించడం లేదు" అంటూ తమ చెరలో ఉన్న 24 ఏళ్ల వయసున్న ఇజ్రాయెలీ యువకుడు ఎవ్యాటార్ డేవిడ్ ఆవేదన వ్యక్తం చేస్తున్న వీడియోను హమాస్ విడుదల చేసింది. హమాస్ బంకర్‌లో ఉన్న డేవిడ్ శరీరం బాగా బలహీనంగా మారినట్లు ఆ వీడియో స్పష్టం చేస్తోంది. గడిచిన 48 గంటల్లో బందీలకు సంబంధించి ఇది రెండో వీడియో. ఇంతకు ముందు రోమ్ బ్రస్లవ్‌స్కీ అనే 21 ఏళ్ల జర్మన్-ఇజ్రాయెలీ వీడియో విడుదలైంది. అతను కూడా చాలా బలహీనంగా కనిపించాడు. ఈ వీడియోల్లో "కాల్పుల విరమణతోనే బందీల విడుదల" అంటూ హమాస్ సందేశాన్ని పంపింది.

ఉత్తరప్రదేశ్‌లో వరదలు!

రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపిలేని వానలు.. 17 జిల్లాలు జలమయం

» ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్న పలు నదులు
» నీట మునిగిన వందలాది గ్రామాలు
» ప్రయాగ్‌రాజ్‌లో 15 వేల ఇళ్లలోకి నీరు
» కొనసాగుతున్న సహాయక చర్యలు


ప్రయాగ్‌రాజ్‌లో పసిపాపను పైకి ఎత్తి పట్టుకొని వరదనీటిని దాటుతున్న ఓ తండ్రి


వరద ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను పడవల సాయంతో తరలిస్తున్న దృశ్యం

లఖ్‌నవూ, ఆగస్టు 3: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ఉత్తరప్రదేశ్‌లోని పలు జిల్లాలను వరదలు ముంచెత్తాయి. వందలాది గ్రామాలు, కొన్ని నగరాలు పూర్తిగా నీట మునిగాయి. జనజీవనం స్తంభించిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు, సహాయక సిబ్బంది రంగంలోకి దిగి లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాన్పూర్‌నగర్, లఖింపూర్ ఖేరీ, ఆగ్రా, ఔరారియా, చిత్రకూట్, బల్లియా, బండా, ఘాజీపూర్, మీర్జాపూర్, ప్రయాగ్‌రాజ్, వారాణసీ, చందౌలీ సహా 17 జిల్లాలను వరదలు ప్రభావితం చేశాయి. గంగా, యమునా, రామగంగా, గోమతి సహా పలు నదులు ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. ప్రయాగ్‌రాజ్, వారాణసీ నగరాలు పూర్తిగా నీట మునిగాయి. ఒక్క ప్రయాగ్‌రాజ్‌లోనే 15 వేల ఇళ్లలోకి వరద నీరు చేరింది. పలు ప్రాంతాల్లో పీకల్లోతు వరద నీటిలో సురక్షిత ప్రాంతాలకు చేరేందుకు అక్కడి జనం పడుతున్న ఇబ్బందుల తాలుకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 'వరదలతో 37 తహసీళ్లలోని 402 గ్రామాలకు చెందిన 84,392 మంది ప్రజలు ప్రభావితమయ్యారు. 47 వేలకు పైగా మందికి తక్షణ సాయం అందించాం. క్షేత్రస్థాయిలో సహాయక బృందాలు పనిచేస్తున్నాయి. 493 పడవలు, బోట్ల ద్వారా ఆహారం ప్యాకెట్లు, అవసరమైన సామగ్రిని పంపిణీ చేస్తున్నాం' అని విపత్తు నిర్వహణ కమిషనర్ భానుచంద్ర గోస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రి స్వతంత్రదేవ్ సింగ్ హమీర్‌పూర్‌లోని వర ద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. సహాయక శిబిరాలను సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. ఇక రాబోయే 24 గంట ల్లో పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు ప్రకటించారు. వరదల నేపథ్యంలో సర్కారుపై ప్రతిపక్ష నేత, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టును బీజేపీ అపహాస్యం చేసిందని విమర్శించారు. 'ప్రయాగ్‌రాజ్‌లో రూ.20 వేల కోట్లు ఖర్చు చేసినా అక్కడి ప్రజలకు వరద ముంపు కష్టాలు తప్పలేదు. బీజేపీ నేతల అవినీతిని అక్కడి నీటి గుంతలే స్పష్టం చేస్తున్నాయి. స్మార్ట్ సిటీ భావనపై నీళ్లు చల్లిన కాషాయ పార్టీ నేతలు తమ పడవల్లో ఎక్కడికో అదృశ్యమయ్యారు?' అంటూ 'ఎక్స్'లో ఎద్దేవా చేశారు.

యూపీలో కాలువలోకి కారు.. 11 మంది మృతి

గోండా, ఆగస్టు 3: ఉత్తరప్రదేశ్‌లోని గోండా జిల్లాలో ఆదివారం ఘోర ప్రమాదం జరిగింది. పృథ్వీనాథ్ ఆలయ దర్శనం కోసం భక్తులతో బయలుదేరిన ఓ బొలేరో వాహనం అదుపుతప్పి కాలువలో పడిపోయింది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మందితో సహా పదకొండు మంది మృతి చెందారు. మరో నలుగురు గాయపడ్డారు. పృథ్వీనాథ్ ఆలయానికి 15 మంది బొలేరో వాహనంలో బయలుదేరారు. మార్గం మధ్యలో కారు అదుపుతప్పి సరయు కాలువలో పడిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులు, రెస్క్యూ బృందాలతో కలిసి మృతదేహాలను వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుల్లో ఆరుగురు మహిళలు, ఇద్దరు పురుషులు, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు పేర్కొన్నారు. గాయపడిన వారికి స్థానిక ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

ఆ గ్రంథాలయంలో మనుషులే పుస్తకాలు

» ఐఐటీ పాలక్కడ్ క్యాంపస్‌లో ప్రయోగం

పాలక్కడ్, ఆగస్టు 3: అనుభవజ్ఞుడైన వ్యక్తితో కొద్ది సమయం గడిపినా బోలెడన్ని పుస్తకాలు చదివినంత జ్ఞానం లభిస్తుందని పెద్దలు చెబుతుంటారు. ఇదే తరహాలో భిన్నంగా ఆలోచించిన కేరళలోని ఐఐటీ పాలక్కడ్ ప్రొఫెసర్లు తమ క్యాంపస్‌లో పుస్తకాలు లేని హ్యూమన్ లైబ్రరీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ మనుషులే పుస్తకాల్లా వ్యవహరిస్తారు. తమ అనుభవాలను సందర్శకులకు వివరిస్తారు. దీనికి సంబంధించి డెన్మార్క్‌కు చెందిన ఓ సంస్థతో ఐఐటీ పాలక్కడ్ ఒప్పందం కుదుర్చుకుంది. చాలా ఏళ్ల క్రితమే డెన్మార్క్‌లో హ్యూమన్ లైబ్రరీ ఉద్యమం కొనసాగడంతో అక్కడి సంస్థతో అవగాహన కుదుర్చుకున్నారు. వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో హ్యూమన్ లైబ్రరీని పాలక్కడ క్యాంపస్‌లో చేపడతారు. ఈ హ్యూమన్ లైబ్రరీలో తమ జీవిత అనుభవాలను వివరించే అవకాశం 12 మందికి మాత్రమే దక్కుతుంది. వీరికి ఎలాంటి వేతనాలు చెల్లించరు. ఐఐటీ పాలక్కడ్ నిపుణుల బృందం వీరిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తుంది. ముఖ్యంగా సమాజంలో వివక్షకు గురైన వారికి అవకాశం కల్పించాలని నిర్ణయించారు. సందర్శకులు అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు ఆకట్టుకునేలా చెప్పేలా వారిని తీర్చిదిద్దుతారు. ఈ హ్యూమన్ లైబ్రరీలో తమకు అవకాశం ఇవ్వాలంటూ ఇప్పటికే సమాజంలో విభిన్న వర్గాల నుంచి మెయిల్స్ వస్తున్నాయని ఐఐటీ పాలక్కడ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుదర్శన్ తెలిపారు. ఓ దివ్యాంగుడు, ఓ ట్రాన్స్‌జెండర్ డాక్టర్ సహా మొత్తం ఏడుగురు తమను ఇప్పటికే సంప్రదించారని ఆయన చెప్పారు. వీరి అనుభవాలను నేరుగా వినడం ద్వారా సమాజంలో క్రమంగా మార్పునకు అవకాశం ఉంటుందన్నారు.



అదనపు లగేజీ విషయంలో గొడవ..

స్పైస్‌జెట్ సిబ్బందిపై సైనికాధికారి దాడి

శ్రీనగర్, ఆగస్టు 3: స్పైస్‌జెట్ సిబ్బందిపై ఓ సైనికాధికారి దాడి చేసిన ఘటన శ్రీనగర్ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. అదనపు లగేజీ విషయమై జరిగిన వివాదం కాస్తా ముదరడంతో ఆర్మీ అధికారి విమానయాన సిబ్బంది నలుగురిపై దాడి చేశారు. జులై 26న జరిగిన ఈ ఘటనలో ఓ ఉద్యోగికి వెన్నెముకకు తీవ్ర గాయమైంది. ఈ మేరకు స్పైస్‌జెట్ సంస్థ ఓ ప్రకటనలో వివరాలను వెల్లడించింది. శ్రీనగర్ నుంచి ఢిల్లీకి వెళ్తున్న స్పైస్‌జెట్ విమానంలో ప్రయాణించేందుకు ఆర్మీ అధికారి రితేశ్‌కుమార్ సింగ్ 16 కిలోల లగేజీతో వచ్చినట్లు తెలిపింది. అయితే, 7 కిలోల వరకే ఉచితమని, మిగిలిన లగేజీకి రుసుము చెల్లించాలని సిబ్బంది కోరారు. తిరస్కరించిన ఆయన.. బోర్డింగ్ ప్రక్రియను పూర్తి చేయకుండానే బలవంతంగా ఏరోబ్రిడ్జి వద్దకు వెళ్లారు. సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఆయన్ను వెనక్కి తీసుకొచ్చారు. అక్కడికి వచ్చిన ఆయన స్పైస్‌జెట్ సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిడిగుద్దులు గుద్దడంతో పాటు, కింద పడిన ఓ ఉద్యోగిని బలంగా తన్నారు. దీంతో అతని వెన్నెముకలో ఎముక విరిగింది. అలాగే ఓ బోర్డు తీసుకొని బలంగా కొట్టారు. మరో ఉద్యోగి దవడకు తీవ్ర గాయమైంది. ఇంకొకరికి ముక్కులో నుంచి రక్తం వచ్చింది. తీవ్రగాయాలైన ఉద్యోగులు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ వ్యవహారంలో ఆర్మీ అధికారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

భార్యను 'రికార్డుల్లో' చంపేసిన భర్త!

తాను పోయాక వితంతు పింఛన్ అందకూడదనే

పట్నా, ఆగస్టు 3: తాను చనిపోతే భార్యకు వితంతు పింఛను రాకూడదన్న ఉద్దేశంతో ఓ వ్యక్తి ఆమెను రికార్డుల్లో చంపేశాడు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సమయంలో ఈ విషయం బయటపడింది. ఓటర్ల జాబితా సవరణ కోసం అధికారులు పట్నా రూరల్ నియోజకవర్గం ధనరువా గ్రామంలోని శివరంజన్ కుమార్ ఇంటికి వెళ్లగా అక్కడ ఆయన భార్య నిషా కుమారి కనిపించింది. కానీ, 3 నెలల క్రితం చనిపోయినట్టు ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. డెత్ సర్టిఫికెట్ కూడా జారీ అయింది. అధికారులు ఈ విషయమే ఆమెతో చెప్పారు. దీంతో, తన డెత్ సర్టిఫికెట్ కోసం ఎవరు దరఖాస్తు చేశారో వివరాలు వెల్లడించాలంటూ నిషా కుమారి బీడీఓకు అప్లికేషన్ సమర్పించారు. భర్త శివరంజన్ కుమారే అలా చేశాడని తేలింది. ఎందుకని ప్రశ్నిస్తే.. "నా భార్యకు నాకు పడట్లేదు. నేను చనిపోతే పెన్షన్ రావొద్దనే అలా చేశాను" అని శివరంజన్ సమాధానం ఇచ్చాడు.

అసహజ మరణాల రికార్డులు ధ్వంసం

ధర్మస్థళ కేసులో పోస్టుమార్టం నివేదికలు, ఫొటోలూ మాయం

» ఆర్టీఐ దరఖాస్తు ద్వారా షాకింగ్ విషయాలు వెలుగులోకి
» సిట్‌ను ఆశ్రయించిన సమాచార హక్కు కార్యకర్త జయంత్


జయంత్

బెంగళూరు, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ధర్మస్థళలో అనేకమంది మహిళలు, బాలికల మృతదేహాలను చట్టవిరుద్ధంగా ఖననం చేసిన కేసులో మరో కొత్త విషయం వెలుగులోకి వచ్చింది. 2000 సంవత్సరం నుంచి 2015 సంవత్సరం వరకు నమోదైన అసహజ మరణాల రికార్డులు మాయమవడం తాజాగా కలకలం రేపుతోంది. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కార్యకర్త జయంత్ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా ఈ విషయాలను వెలుగులోకి తెచ్చారు. ఆ 15 సంవత్సరాల కాలంలో జరిగిన అసహజ మరణాలకు సంబంధించిన రికార్డులు కావాలంటూ జయంత్ ఆర్టీఐ దరఖాస్తు ద్వారా కోరగా, 2000-2015 మధ్య యూడీఆర్(అసహజ మరణాల రిజిస్టర్)లో నమోదైన మరణాలకు సంబంధించిన అన్ని పత్రాలు, పోస్టుమార్టం నివేదికలు, వాల్‌పోస్టర్లు, నోటీసులు, గుర్తుతెలియని మృతదేహాల గుర్తింపు కోసం తీసిన ఫొటోలను సాధారణ పరిపాలన పరమైన ఆదేశాల మేరకు ధ్వంసం చేశామని బెల్తంగాడి పోలీసులు సమాధానం ఇచ్చినట్టు జయంత్ తెలిపారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆ సమాచారాన్నంతటినీ డిజిటలైజ్ చేయకుండా ఎలా ధ్వంసం చేస్తారని జయంత్ ప్రశ్నిస్తున్నారు. ధర్మస్థళలో పలు హత్యలు జరిగాయనీ, వాటికి సంబంధించి తాను గతంలోనే ఆరోపణలు చేశాననీ, పలు వేదికలపై ప్రస్తావించానని, అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. ఇక్కడ నెలకొన్న భయంకర పరిస్థితుల కారణంగా ఎవరూ వాస్తవాలు చెప్పడం లేదని, తానూ భయపడిన వ్యక్తినే అని తెలిపారు. హత్యలు జరిగినపుడు కొందరు మధ్యవర్తులు తెరపైకి వచ్చి రాజీలు కుదిర్చారన్నారు. హత్యలు ఎవరు చేశారనేది తెలియదని చెప్పారు. సోమవారం సిట్ ముందుకు వెళ్లి సమగ్ర సమాచారం ఇస్తానన్నారు. కాగా, గుర్తుతెలియని ఒక బాలిక మృతదేహాన్ని ఖననం చేయడంలో చట్టపరమైన నిబంధనలన్నింటికీ అధికారులు నీళ్లొదిలారని, అందుకు తానే ప్రత్యక్ష సాక్షినని జయంత్ పేర్కొన్నారు. ఆ ఘటనలో అధికారుల తీరు ఏదో ఒక కుక్క కళేబరాన్ని పాతిపెట్టేసినట్టు ఉందని విమర్శించారు. ఆ ఘటన ఇప్పటికీ తన కళ్లలో మెదులుతూనే ఉందని, అందుకే ఆదివారం సిట్(ప్రత్యేక దర్యాప్తు బృందం)కు ఫిర్యాదు చేశానని చెప్పారు. ఖననం సందర్భంగా అక్కడ ఉన్న అధికారులందరి పేర్లూ ఫిర్యాదులో పేర్కొన్నానన్నారు.

తేజస్వికి ఈసీ నోటీసు



» ఓటర్ల జాబితా నుంచి పేరును తొలగించారంటూ మీరు చూపించిన ఓటరు కార్డు మేం జారీచేసింది కాదు
» అసలు కార్డును అప్పగించండి: ఈసీ

పట్నా/న్యూఢిల్లీ, ఆగస్టు 3: బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌కు ఎన్నికల కమిషన్ (ఈసీ) నోటీసు జారీచేసింది. ఆయన శనివారం చూపిన ఓటరు గుర్తింపు కార్డు అధికారికంగా జారీచేసింది కాదని.. దర్యాప్తు జరపడానికి వీలుగా దాని ఒరిజినల్ కార్డును తమకు అప్పగించాలని కోరింది. ఈ మేరకు పట్నా సదర్ సబ్‌డివిజినల్ మేజిస్ట్రేట్, దీఘా అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజస్ట్రేషన్ అధికారి ఆయనకు ఆదివారం నోటీసు పంపారు. శనివారం బిహార్లో విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తన పేరు తొలగించారంటూ తేజస్వి పాత ఓటరు కార్డును మీడియా సమక్షంలో చూపారు. అయితే జిల్లా మేజిస్ట్రేట్ ఎస్ఎం త్యాగరాజ వెంటనే దీనిని ఖండించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో తేజస్వి తన అఫిడవిట్‌లో పొందుపరచిన ఎపిక్ నంబరు అది కాదని.. ఆయన వద్ద రెండో ఓటరు కార్డు గనుక ఉంటే.. ఇది విచారణ జరపాల్సిన అంశమని తెలిపారు. అందుకు అనుగుణంగా నియోజకవర్గ ఎన్నిల అధికారి స్పందించారు. 'ఓటరు జాబితాలో మీ పేరు 204వ పోలింగ్ బూత్‌లో సీరియల్ నంబరు 416గా నమోదై ఉంది. దాని ఎపిక్ నంబరు ఆర్ఏబీ0456228. కానీ మీడియా సమావేశంలో మీరు చూపించిన ఎపిక్ నంబరు ఆర్ఏబీ2916120. అసలీ నంబరు మేం అధికారికంగా జారీచేసింది కాదని మా ప్రాథమిక విచారణలో తేలింది' అని తెలిపారు. ఇదిలా ఉండగా, తమిళనాడులో 6.5 లక్షల మంది వలస కార్మికులను ఓటర్లుగా చేర్చారని కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం ఆరోపించారు. ఇది ఆందోళనకర, చట్టవిరుద్ధమైన చర్య అని అభివర్ణించారు. కానీ, చిదంబరం ఆరోపణలను ఈసీ ఖండించింది. తమిళనాడులో ఇంకా ఎస్ఐఆర్ అమలు చేయలేదని, 6.5 లక్షల ఓట్లను చేర్చారనడం అబద్ధమని పేర్కొంది.

8న ఈసీ వద్దకు ఇండీ కూటమి ర్యాలీ

బిహార్‌లో ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ప్రతిపక్ష ఇండీ కూటమి నేతలు ఈ నెల 7న రాత్రి సమావేశం కానున్నారని సమాచారం. ఈసీ వైఖరికి నిరసనగా ఈ నెల 8న ఆ సంస్థ కార్యాలయానికి ర్యాలీ నిర్వహించాలని కూటమి పక్షాల నేతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాగా, ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎవరన్న దానిపైన కూడా 7న చర్చ జరుగుతుందని పలువురు ఇండీ కూటమి నేతలు సంకేతాలిచ్చారు.

రష్యాలో మరో భారీ భూకంపం

» స్వల్పస్థాయి సునామీ హెచ్చరికలు

మాస్కో, ఆగస్టు 3: రష్యా తూర్పు ప్రాంతాన్ని మరో భారీ భూకంపం కుదిపేసింది. ఇటీవల 8.8 తీవ్రతతో భారీ భూకంపం వచ్చిన కమ్చాట్కా ద్వీపకల్పానికి దక్షిణంగా ఉన్న కురిల్ దీవుల్లో ఆదివారం మధ్యాహ్నం 7.0 మ్యాగ్నిట్యూడ్ తీవ్రతతో ఈ భూకంపం వచ్చింది. తర్వాత 5, 6 తీవ్రతతో మరిన్ని ప్రకంపనలు వచ్చాయి. దీనితో కురిల్ దీవులతోపాటు కమ్చాట్కా ద్వీపకల్పంలోని పలు నగరాలు ఊగిపోయినట్టు రష్యా అత్యవసర వ్యవహారాల శాఖ ప్రకటించింది. పలు ప్రాంతాల్లో స్వల్ప స్థాయిలో సునామీలు రావొచ్చని హెచ్చరించింది. ఇక ఈ వరుస భూకంపాల ధాటికి కమ్చాట్కా ద్వీపకల్పంలో దాదాపు 6 వందల ఏళ్లుగా నిద్రాణంగా ఉన్న 'క్రషెనిన్నికోవ్' అగ్నిపర్వతం బద్దలైంది. సుమారు ఆరు కిలోమీటర్ల ఎత్తున దట్టమైన పొగలు, బూడిదను వెదజల్లింది. భారీగా లావా వెలువడుతోంది. వారం రోజుల క్రితం 8.8 తీవ్రతతో వచ్చిన భూకంపంతో బద్దలైన 'క్ల్యుచెవ్‌స్కోయ్' అగ్నిపర్వతానికి సుమారు 160 కిలోమీటర్ల దూరంలోనే ఈ 'క్రషెనిన్నికోవ్' అగ్నిపర్వతం ఉండటం గమనార్హం.

సౌదీలో ఒకే రోజు 8 మందికి ఉరిశిక్ష

రియాద్, ఆగస్టు 3: సౌదీ అరేబియా ఆదివారం ఒక్క రోజే నేరం రుజువైన ఎనిమిది మంది ఖైదీలకు ఉరిశిక్షను అమలు చేసింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో అరెస్టయిన సోమాలియాకు చెందిన నలుగురికి, ముగ్గురు ఇథియోపియన్లకు, తన తల్లిని చంపిన సౌదీకే చెందిన ఓ ఖైదీకి మరణశిక్ష విధించింది. ఈ ఎనిమిది మందితో కలిపి ఈ ఏడాది మొత్తం మీద 230 మందికి ఆ దేశం మరణశిక్షను విధించింది. వీరిలో 154 మంది మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తూ చిక్కిన వారే ఉన్నట్లు సౌదీ ప్రెస్ ఏజెన్సీ పేర్కొంది. 2023 నుంచి మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పట్ల సౌదీ కఠినంగా వ్యవహరిస్తోంది.

జిహ్వాకో రుచి.. మనిషికో షెఫ్

సంపన్న వర్గాల ఇళ్లల్లో నయా ట్రెండ్.. పర్సనలైజ్డ్ షెఫ్.. ఇళ్లకు వచ్చి వండుతున్న 'స్టార్' హోటల్ షెఫ్‌లు

- విభిన్న అవసరాలకు తగినట్లుగా మెనూల రూపకల్పన
- డైటీషియన్, వైద్యుల సూచనలతో ప్రత్యేక వంటకాలు
- ఒక్కో షెఫ్‌కు నెలకు రూ.3 లక్షల పైనే ఖర్చు
- ఎగువ మధ్యతరగతి ఇళ్లల్లో వేడుకల్లోనూ షెఫ్‌ల సేవలు
- ప్లేటుకు రూ.4,500 నుంచి రూ.7,500 దాకా వసూలు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఓ సుప్రసిద్ధ నిర్మాత తన కుమారుడిని హీరోగా పెట్టి వచ్చే సంవత్సరం ఓ సినిమా తీయబోతున్నారు. సిక్స్ ప్యాక్ కోసం న్యూట్రిషియన్లు డైట్ చార్ట్ ఇచ్చారు. కానీ, తమ ఇంట్లో వంటకాలతో ఆ డైట్ సాధ్యమయ్యేలా అనిపించలేదు. ఏం చేయాలి.. ఆ డైట్‌ను వండిపెట్టడానికి సుప్రసిద్ధ షెఫ్‌ను నియమించుకున్నారు.

హైదరాబాద్‌లో సుప్రసిద్ధ రియల్టర్ ఆయన. త్వరలోనే పిల్లలను కనాలనుకుంటున్నారు. అందుకే ఇప్పటి నుంచే తాము తీసుకునే ఆహారపరంగా పూర్తి శ్రద్ధ కనబరిచే క్రమంలో ఓ షెఫ్‌ను నియమించుకున్నారు. ఉదయం అల్పాహారం మొదలు రాత్రి డిన్నర్ వరకూ ఆ షెఫ్ నిపుణులు సూచించిన వంటలు చేస్తాడు. గతంలో ఓ స్టార్ హోటల్‌లో పనిచేసిన ఆ షెఫ్.. ఇప్పుడు పూర్తి సమయం ఈ రియల్టర్ ఇంట్లోనే ఉంటున్నారు.

> "చాలామందికి పర్సనలైజ్డ్ షెఫ్ అనే భావనే కొత్తగా ఉంటుంది. ఇప్పటికీ వంట చేస్తే వంటోడే అంతే! కానీ, వారికి, పర్సనలైజ్డ్ షెఫ్‌లకు చాలా తేడా ఉంటుంది. ఆహార తయారీ, వ్యక్తిగతమైన మెనూలు, ప్లేట్ అలంకరణ వీటన్నింటిల్లో వైవిధ్యం కనిపిస్తుంది. దాన్ని గుర్తించగలిగినవాళ్లకే మేం సేవలనందిస్తుంటాం" అని షెఫ్ వికాస్ చెప్పారు. "కొంతమంది సినీతారలతో పాటుగా వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకుల ఇళ్లలో వంటవాళ్లున్నారు. వారు తమకు తోచిన, లేదంటే ఇంటి యజమాని చెప్పిన వంట చేసేస్తుంటారు. అయితే ఇంటిల్లిపాదికీ ఆ వంట నచ్చాలని లేదు. ఇలాంటి వారిప్పుడు పర్సనలైజ్డ్ షెఫ్‌ల వైపు చూస్తున్నారు" అని వివరించారు.

వంటవాళ్లకు.. షెఫ్‌లకు చాలా తేడా ఉంది

అత్యంత సంపన్న వర్గాల ఇళ్లల్లో ఇటీవలి కాలంలో 'పర్సనలైజ్డ్ షెఫ్'ల ట్రెండ్ పెరుగుతోంది. ఒకప్పుడు మా వంటతను/వంటామె అని చెప్పడం కనిపించేది. 'మా పర్సనల్ షెఫ్' అని సగర్వంగా పరిచయం చేస్తుండటం ధనవంతుల్లో ఇప్పుడు కనిపిస్తున్న నయా ధోరణి. కోరుకున్నదే తడవుగా ఇండియన్, ఇటాలియన్, చైనీస్, కాంటినెంటల్ రుచులతో ఆహారాన్ని వండి వడ్డించే ఈ షెఫ్‌లు, వ్యక్తుల ఆరోగ్య అవసరాలకు తగినట్లుగా ప్రత్యేకమైన మెనూలను సృష్టిస్తున్నారు. హోమ్ షెఫ్, పర్సనలైజ్డ్ షెఫ్‌ల ధోరణి హైదరాబాద్‌లో క్రమేపీ విస్తరిస్తోంది. అప్పుడప్పుడు షెఫ్‌ల సేవలను వినియోగించుకుని ఆనందపడిపోయే వారు మాత్రమే కాదు, తమ వ్యక్తిగత అవసరాల కోసం ఆ షెఫ్‌లను తమ ఇంటిలో ఒక సభ్యునిగా మార్చుకుంటున్నవారూ ఎక్కువగానే కనబడుతున్నారు. ఈ షెఫ్‌ల సేవలను నిబద్ధతతో అందించేందుకంటూ ప్రత్యేకంగా కన్సల్టెన్సీలూ హైదరాబాద్‌లో ఎక్కువగానే కనిపిస్తున్నాయి. ఈ తరహా సేవలను అందిస్తున్న కలినరీ లాంజ్ సీఈవో గోపి బైలుప్పల మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో తాము అత్యంత సంపన్న వర్గానికి చెందిన 50కి పైగా కుటుంబాలకు సేవలనందిస్తున్నామన్నారు. "ఓ షెఫ్ కావాలని ఎవరైనా అడిగితే మేము ముందుగా వారి అవసరాలను చూస్తాము. వారికి ఎలాంటి అలెర్జీలు ఉన్నాయో తెలుసుకుంటాము. వైద్యుల నివేదికలు, డైటీషియన్ సలహాలు తీసుకుంటాము. అవన్నీ పరిశీలించి వారి కోసం ప్రత్యేక మెనూను రూపొందిస్తాం" అని చెప్పారు. పిల్లలను ప్లాన్ చేసుకుంటున్నామనే వారు అది చెబితే, దానికి తగినట్లుగా మెనూ అందించడమూ తమ సేవలలో భాగమేనని తెలిపారు. కొవిడ్ తర్వాత ఆహార అలవాట్లపై శ్రద్ధ పెరిగిందని, తద్వారా ఈ తరహా సేవలకు డిమాండ్ పెరిగిందని గోపి వివరించారు.

వేడుకల్లోనూ షెఫ్‌ల సేవలు

ఓ పర్సనలైజ్డ్ షెఫ్‌కు కనీసం నెలకు రూ.3లక్షలు చెల్లించాల్సి ఉంటుందని ఈ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. వంటకు ఉపయోగించే వస్తువులు, పదార్థాలకు అదనంగా చెల్లించాలి. ఇంట్లో ఏదైనా చిన్న పార్టీ జరిగినా, లేదంటే కుటుంబసభ్యులతో వేరే ప్రాంతాలకు వెళ్లి అక్కడ వంట చేయాల్సి వచ్చినా అదనంగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. అయితే, అంత మొత్తం చెల్లించి షెఫ్‌లను నియమించుకోలేం అనుకునే ఎగువమతి మధ్య తరగతి వాళ్లు, తమ ఇళ్లల్లో ఏదైనా బర్త్‌డే, మ్యారేజ్ డే లాంటి వేడుకలు జరిగినప్పుడు షెఫ్‌లతో వైవిధ్యమైన వంటలు చేయించుకుంటున్నారు. షెఫ్‌లు 20-30 మంది కోసం వంట చేస్తారు. వంటల్లో వాడే ఆహార పదార్థాలను దాదాపుగా వారే తీసుకువస్తారు. ఇందుకోసం ప్లేట్‌కు రూ.4,500 నుంచి రూ.7,500వరకు చెల్లించాల్సి ఉంటుందని షెఫ్‌లను సరఫరా చేసే సంస్థలు చెప్తున్నాయి. ఇటీవల ఇలాంటి సేవలను అడుగుతున్న వారి సంఖ్య బాగా పెరిగిందని పేర్కొన్నాయి.

షెఫ్ సేవలు ప్రీమియం కాదు.. లగ్జరీ!



పర్సనలైజ్డ్ షెఫ్ సేవలు ప్రీమియం కాదు.. లగ్జరీనే. షెఫ్‌లను పనివాళ్లలా చూస్తామంటే కుదరదు. వారూ మన ఇంటిలోని మనిషే అన్నట్లుగా ఉండాలి. షెఫ్‌లు ఎక్కడికి పడితే అక్కడికి, ఎవరికి పడితే వారికి వచ్చి వంట చేయరు. తాము తమ ప్రొఫైల్‌లో ఫలానా వారికి వండామని చెప్పుకోవడానికి ఇష్టపడతారు. అలాంటి వారికే తమ సేవలను అందించడానికి ప్రయత్నిస్తారు. పారిశ్రామికవేత్తలు, సినీతారలు, రియల్టర్లు లాంటి వారితో పాటుగా కఠినమైన డైట్ అనుసరించే వారికి షెఫ్‌ల అవసరం పడుతుంది. ఇటీవలనే ఓ క్లయింట్ గర్భవతి అయితే ఆదిలాబాద్ నుంచి గిరిజన షెఫ్‌లను తీసుకువచ్చి మహువా(ఇప్పపువ్వు) లాంటివి అందించాం. మహువాతో సత్తువ రావడంతో పాటు కాళ్ల నొప్పులు లాంటివి తగ్గుతాయి. మా షెఫ్‌లలో గ్రామీణ రుచులను అందించే వారి నుంచి బ్యాంకాంక్‌లో మిషెలిన్ షెఫ్‌ల వరకూ ఉన్నారు.

- గోపి బైలుప్పల, సీఈవో, కలినరీ లాంజ్



హైస్పీడ్‌లో.. ఎలక్ట్రిక్ వాహనాలు

- రాష్ట్రంలో పెరిగిన కార్లు, ద్విచక్ర వాహనాల కొనుగోళ్లు
- రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజుల మినహాయింపుతో ఊతం
- నిర్వహణ వ్యయం తక్కువగా ఉండటంతో ఆ వైపు మొగ్గు
- ఏడు నెలల్లో రోడ్డెక్కిన కొత్త ఎలక్ట్రిక్ వాహనాలు 50 వేలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లపై విద్యుత్ వాహనాలు రయ్యిన దూసుకెళుతున్నాయి. విద్యుత్ వాహనాల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ఎలక్ట్రిక్ కార్లు కొనేవారి సంఖ్య ఏటేటా పెరుగుతున్నట్టు రవాణా శాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల కొనుగోళ్లు కూడా అంతకంతకు దూసుకెళుతున్నాయి. గత ఏడు నెలల్లో రాష్ట్రంలో 50 వేలకుపైగా విద్యుత్ వాహనాలు కొత్తగా రోడ్డెక్కాయి. ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ ట్యాక్స్ రిజిస్ట్రేషన్ ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం మినహాయించడంతో కొనుగోళ్లు పెరుగుతున్నాయని.. ఇప్పటివరకు రూ.369.27 కోట్ల మేర పన్ను మినహాయింపు లభించిందని రవాణాశాఖ వర్గాలు తెలిపాయి.

పన్ను మినహాయింపులతో తగ్గిన 'ఆన్ రోడ్' ధరలు

పర్యావరణహిత హైదరాబాద్ లక్ష్యంగా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ రుసుము మినహాయింపు నిర్ణయం తీసుకుంది. 2024 నవంబరు 16వ తేదీ నుంచి ఇది అమల్లోకి వచ్చింది. దీనితో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల్లో పెరుగుదల కనిపిస్తోంది. సాధారణంగా కేటగిరీని బట్టి వాహనం ధరలో 12 శాతం నుంచి 20 శాతం వరకు రోడ్ ట్యాక్స్ (లైఫ్ ట్యాక్స్)గా చెల్లించాలి. వాణిజ్యేతర వాహన కేటగిరీలో ఎక్స్ షోరూం ధర రూ.5లక్షల్లోపు ఉన్న కార్లకు రోడ్ ట్యాక్స్ 13 శాతం, రూ5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ధర ఉంటే 14 శాతం, రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల్లోపు వాహనాలకు 17 శాతం, రూ.20 లక్షల కంటే ఎక్కువ ధర ఉండే వాహనాలకు 18 శాతం రోడ్ ట్యాక్స్ వసూలు చేస్తారు. తాత్కాలిక, శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం కార్లకు రూ.2500 నుంచి రూ.5 వేల వరకు.. ద్విచక్ర వాహనాలకు రూ.500-800 వరకు చార్జీ ఉంటుంది. ఈ క్రమంలో రోడ్ ట్యాక్స్ రిజిస్ట్రేషన్ చార్జీల మినహాయింపుతో.. ఒక్కో కారుపై కనిష్ఠంగా రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు 'ఆన్ రోడ్' ధర తగ్గుతోంది. కొత్త సాంకేతికతలతో వస్తున్న విద్యుత్ వాహనాల మైలేజీ ఎక్కువగా ఉంటోంది. ఒక్కసారి చార్జింగ్ చేస్తే 250 కిలోమీటర్ల నుంచి 600 కిలోమీటర్ల వరకు ప్రయాణించే కార్లు.. 40 కిలోమీటర్ల నుంచి 200 కిలోమీటర్ల వరకు ప్రయాణించగల ద్విచక్రవాహనాలు అందుబాటులోకి వచ్చాయి. విద్యుత్ చార్జింగ్‌తో నడవడం, ఇతర నిర్వహణ వ్యయాలు పెద్దగా ఉండకపోవడం కూడా ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరగడానికి కారణమవుతోంది.

50 వేల వాహనాలు.. 369.27 కోట్ల మినహాయింపు..

నవంబరు 16 నుంచి జూన్ 30 వరకు ఏడున్నర నెలల్లో రాష్ట్రంలో అన్ని కేటగిరీల విద్యుత్ వాహనాలు కలిపి 50 వేలకుపైగా రిజిస్ట్రేషన్ జరిగాయి. వీటన్నింటికీ కలిపి రూ.369.27 కోట్ల మేర పన్ను మినహాయింపు లభించింది. అందులో 9,058 వ్యక్తిగత (నాన్ ట్రాన్స్‌పోర్ట్) విద్యుత్ కార్లకు సంబంధించి రూ.302.12 కోట్ల పన్ను, రుసుముల మినహాయింపు లభించింది. ఇది మొత్తం మినహాయింపులలో 82 శాతం కావడం గమనార్హం. '2017 నుంచి 2024 వరకు ఈ స్థాయిలో విద్యుత్ కార్ల రిజిస్ట్రేషన్ జరగడం ఇదే ప్రథమం. అది కూడా ఏడు నెలల్లోనే జరిగాయి' అని రవాణా శాఖ అధికారి ఒకరు పేర్కొన్నారు. ఇక 37 వేల విద్యుత్ ద్విచక్ర వాహనాలకు సంబంధించి రూ.43.82 కోట్లు పన్ను, రుసుము మినహాయింపు దక్కింది. వాణిజ్య పరంగా వినియోగించే విద్యుత్ కార్లు, ఆటోలు, సరుకు రవాణా వాహనాలు, బస్సుల రిజిస్ట్రేషన్లు కూడా గతంతో పోలిస్తే పెరిగాయి.

ఆరుగురిని మింగిన గ్రానైట్ క్వారీ

- బండరాయి పడి వలస కూలీల మృతి.. ఏపీలో ఘోరం

బాపట్ల, బల్లికురవ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): వారంతా ఒడిశా నుంచి వచ్చిన వలస కూలీలు.. రెక్కాడితే కాని డొక్కాడని బతుకులు. రాష్ట్రం కాని రాష్ట్రానికి వలస వచ్చిన ఆ పేద బతుకుల్ని గ్రానైట్ రాయి మింగేసింది. ఒకరిద్దరు కాదు ఏకంగా ఆరుగురు ఒకే బండ కింద నలిగిపోయారు. ఏపీలోని బాపట్ల జిల్లా బల్లికురవ సమీపంలోని సత్యకృష్ణ గ్రానైట్స్‌లో ఆదివారం ఉదయం ఈ ఘోరం చోటుచేసుకుంది. శనివారం రాత్రి కురిసిన వర్షానికి క్వారీలో ఉన్న గ్రానైట్ రాళ్ల మధ్య సీపేజ్ ఏర్పడిందని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. వర్షం నీటికి మధ్యలో ఉన్న మట్టి కొంచెంకొంచెంగా కరిగి తొలగిపోయింది. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం కార్మికులు పనికి వెళ్లారు. దాదాపు పదిన్నర సమయంలో క్వారీ అంచు ఒక్కసారిగా విరిగిపడడంతో అక్కడికక్కడే నలుగురు కూలీలు మృతి చెందారు. గాయడిన వారిని నరసరావుపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు ప్రాణాలొదిలారు. మృతులు ఒడిశాకు చెందిన దండా బడత్యా(48), టుకునదలాయ్(37), బనమల చెహ్రా(30), భాస్కర్ బిషోయ్(40), సైంతోష్‌గౌడ(36), ముస్సాజన(43)గా గుర్తించారు. మరో 8 మంది చికిత్స పొందుతుండగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. కాగా, మూడు నెలలకోసారి క్వారీల్లో భద్రతా ప్రమాణాలను తనిఖీ చేయాల్సిన వ్యవస్థలు నిద్రావస్థలో ఉండడం కూడా ఈ దారుణ ఘటనకు కారణంగా కనబడుతోంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే కేంద్రం విభాగాలే ఈ తనిఖీలు చేపట్టాలని మైనింగ్‌శాఖ చెబుతోంది. భద్రతా లోపాల గురించి సదరు విభాగం ఏవైనా రిఫర్ చేస్తే తప్ప తమకు చర్యలు తీసుకునే అధికారం లేదని మైనింగ్ విభాగం సెలవిస్తోంది. గతేడాది అక్టోబరులోనే చివరి సారిగా క్వారీల్లో భద్రతా ప్రమాణాల తనిఖీలు జరిపారని, ఆ తర్వాత వాటి ఊసే లేదని సమాచారం. ఇవన్నీ ఒక ఎత్తయితే లేబర్ చట్టాన్ని ఉల్లంఘించి ఆదివారం రోజు కార్మికుల చేత పని ఎలా చేయిస్తారనే దానికి షిఫ్టుల వారీ పనివిధానం ఇక్కడ అమలవుతుందనే పొంతన లేని సమాధానాలు వస్తున్నాయి.

విచారణకు సీఎం ఆదేశాలు

వలస కూలీల మృతి విషయం తెలిసి ఏపీ సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కలెక్టర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడడంతో పాటు ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరపాలని ఆదేశించారు. క్వారీలో ఆరుగురు చనిపోవడం కలచివేసిందని మంత్రి లోకేశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, బాధితులు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఫోన్ నుంచే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు!

నమోదు, సవరణ, డౌన్‌లోడ్‌కు అవకాశం.. నకిలీలకు చెక్.. పారదర్శకంగా సేవలు

- కొత్త విధానంపై జీహెచ్ఎంసీ కసరత్తు
- కేంద్ర ప్రభుత్వ సీఆర్ఎస్-ఓఆర్‌జీఐ అనుసంధానానికి ప్రతిపాదనలు
- సర్కారు ఆమోదిస్తే అందుబాటులోకి..



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అవకతవకలకు ఆస్కారం లేని, పారదర్శకంగా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసే నూతన విధానం అమలుకు జీహెచ్ఎంసీ కసరత్తు వేగవంతం చేసింది. మీ సేవా కేంద్రాలకు వెళ్లకుండా మొబైల్, వెబ్ ద్వారా పౌరులు నేరుగా సర్టిఫికెట్ల కోసం నమోదు, సవరణకు దరఖాస్తు, డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం కల్పించేలా అధునాతన సాంకేతికతను అందుబాటులోకి తీసుకువస్తోంది. నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీకి చెక్ పెట్టడంతో పాటు సంబంధిత అధికారి పరిశీలన అనంతరమే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం భారత రిజిస్ట్రార్ జనరల్ కార్యాలయం (ఓఆర్‌జీఐ) పరిధిలోని సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్)లోకి మారాలని భావిస్తున్నారు. ఈ ప్రతిపాదనకు ఇప్పటికే పురపాలక శాఖ ఆమోదం తెలుపగా సర్కారు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంది. ఈ ఫైల్ డైరెక్టర్ హెల్త్ (డీహెచ్) నుంచి వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి వెళ్లిందని, అక్కడి నుంచి సర్కారుకు పంపాల్సి ఉంటుందని ఓ అధికారి తెలిపారు. ఏటా జీహెచ్ఎంసీ పరిధిలో 2 లక్షల వరకు జననాలు, 60 వేల నుంచి 70 వేల వరకు మరణాలు నమోదవుతున్నాయి. మెరుగైన పౌరసేవల కోసమంటూ గతంలో తక్షణ ఆమోదం అవకాశాన్ని కల్పించారు. దీన్ని కొన్ని మీ సేవా కేంద్రాల నిర్వాహకులు, జీహెచ్ఎంసీ ఉద్యోగులు దుర్వినియోగం చేశారు. సుమారు 26 వేల నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. ఈ తరహా అక్రమాలకు చెక్ పెట్టేలా కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌తో అనుసంధానం కావాలని రెండున్నరేళ్లుగా జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తోంది. గత ప్రభుత్వం అంగీకరించకపోవడంతో కాంగ్రెస్ సర్కారు వచ్చాక ప్రతిపాదన తిరిగి తెరపైకి వచ్చింది. జనన, మరణాల నమోదుకు ఓఆర్‌జీఐ దేశమంతటా ఏకీకృత సాఫ్ట్‌వేర్ వినియోగిస్తోంది. ఇప్పటికే దీనిని ఆంధ్రప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ అమలు చేస్తున్నాయి. ప్రస్తుతం జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ కోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సాంకేతిక సేవలు అందిస్తోంది. ఆ సంస్థకు జీహెచ్ఎంసీ ఏటా రూ.5 కోట్ల వరకు చెల్లిస్తోంది. సీఎస్ఆర్-ఓఆర్‌జీఐ సాంకేతిక సేవలను ఉచితంగా వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

ఇవీ ప్రయోజనాలు

- పౌరులు మొబైల్, వెబ్ ద్వారా జనన, మరణాల నమోదు, సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చు. సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం.
- మీ సేవా కేంద్రాలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు.
- ఆధార్ నంబర్ ఆధారంగా నకిలీ జనన పత్రాల జారీని నిరోధించవచ్చు.
- సెంట్రలైజ్డ్ డ్యాష్ బోర్డు ద్వారా రియల్ టైం ట్రాకింగ్‌కు అవకాశం. దరఖాస్తు ఎవరి వద్ద ఉందనేది పౌరులు తెలుసుకోవచ్చు.
- సర్వీస్ కమిషన్లు, క్రీడా విభాగాలు వయస్సు నిర్ధారణ కోసం సీఎస్ఆర్-ఓఆర్‌జీఐలోని డేటాను పరిశీలించే వెసులుబాటు.
- పాస్‌పోర్టు, ఉద్యోగాలు, పాఠశాలల అడ్మిషన్లు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల సమయంలోనూ సర్టిఫికెట్లు వినియోగం/పరిశీలనకు అవకాశం.

పుట్టినరోజు వేడుకల్లో డ్రగ్స్ మత్తు

- ఆరుగురు ఐటీ ఉద్యోగుల అరెస్టు

మొయినాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని ఓ ఫాంహౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో డ్రగ్స్ తీసుకున్న ఆరుగురు ఐటీ ఉద్యోగులను అరెస్టు చేశారు. హైదరాబాద్‌కు చెందిన అభిజిత్ అనే ఐటీ ఉద్యోగి తన పుట్టినరోజు వేడుకల కోసం మేడిపల్లి రెవెన్యూలోని ఓ ఫాం హౌస్‌ను బుక్ చేసుకున్నాడు. శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ పార్టీకి అతడి మిత్రులు హాజరయ్యారు. వీరంతా కలిసి మద్యం, డ్రగ్స్‌తో విందు చేసుకుంటున్నారని సమాచారం అందుకున్న పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేశారు. ఈ దాడుల్లో అభిజిత్‌తో పాటు పార్టీలో పాల్గొన్న సిమ్‌సన్, పార్థు, గోయల్, యశ్వంత్, సివోడెనీస్ అనే మరో ఐదుగురు ఐటీ ఉద్యోగులను అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు ఫాంహౌస్ యజమానిపైనా కేసు నమోదు చేసినట్లు చేవెళ్ల ఎక్సైజ్ సీఐ శ్రీలత తెలిపారు. ఘటనా స్థలంలో 0.05 గ్రాముల ఎల్ఎస్‌డీ, 2.21 గ్రాముల హాషీష్, మద్యం బాటిళ్లు, మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పారిపోయినట్లు సీఐ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ లీక్.. చెలరేగిన మంటలు

- ఒకే కుటుంబంలో ఏడుగురికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం.. ఆదిలాబాద్ జిల్లాలో ఘటన

బోథ్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పిప్పిల్‌దరి గ్రామంలో వంటగ్యాస్ సిలిండర్ లీకయ్యి మంటలు చెలరేగడంతో ఏడుగురు గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గ్రామానికి చెందిన తొడసం సోనేరావు అనే వ్యక్తి భార్య ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పైపు లీక్ అయింది. పైపును సరిచేసే క్రమంలో మంటలు చెలరేగి సోనేరావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇది చూసిన ఆయన కుమారుడు గంగాప్రసాద్, తమ్ముడు బాబురావు ఇంట్లోకి వెళ్లగా.. వారికీ మంటలు అంటుకున్నాయి. అలాగే సోనేరావు భార్య లక్ష్మి, మరో తమ్ముడు లక్ష్మణ్, కుమారుడు శేఖర్‌లు సాయం చేయడానికి ప్రయత్నించగా వారికీ మంటలు అంటుకున్నాయి. ఇంటి పక్కన ఉన్న మహేశ్ కూడా వీరిని కాపాడే ప్రయత్నంలో స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారందరినీ గ్రామస్థులు వెంటనే బోథ్ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం, తీవ్ర గాయాలపాలైన సోనేరావు, గంగాప్రసాద్, బాపురావులను మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటనపై స్థానిక ఎస్సై శ్రీసాయి ఆరా తీశారు.

విత్తన ధ్రువీకరణ సంస్థలో 20 కోట్లకు తేలని లెక్కలు

ఏజీ ఆడిట్‌లో బయటపడ్డ లొసుగులపై వివరణ ఇవ్వని అథారిటీ

- స్టార్ హోటళ్లలో ప్రైవేటు సంస్థల సదస్సులకు ప్రభుత్వ సొమ్ము
- నిబంధనలకు విరుద్ధంగా ఈవెంట్ కంపెనీకి రూ. 2 కోట్లు బదిలీ
- కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన భవనాలు, ల్యాబ్‌లు నిరుపయోగం
- 3 లక్షల నుంచి లక్ష ఎకరాలకు పడిపోయిన ధ్రువీకరణ విస్తీర్ణం

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కేవీవై) పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ (సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ)కి మంజూరుచేసిన రూ.20 కోట్ల నిధుల వినియోగంపై లెక్కలు తేలటంలేదు. విత్తన నాణ్యత తనిఖీ, ధ్రువీకరణకు వినియోగించాల్సిన నిధులను దారి మళ్లించినట్లు 'ఏజీ ఆడిట్'తో వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు ఏజీ కార్యాలయం నుంచి సంస్థ ఎండీ వివరణ కోరుతూ రెండుసార్లు లేఖలు రాయగా వాటిని బుట్టదాఖలు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం రూ.13.74 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ.6.54 కోట్లు కలిపి రూ.20.28 కోట్లు విత్తన ధ్రువీకరణ సంస్థకు మంజూరు చేస్తే.. వాటిని విచ్చలవిడిగా ఖర్చు చేసినట్లు ఏజీ ఆడిట్‌లో తేలింది. రైతు సమన్వయ సమితికి కోటి రూపాయలు అప్పనంగా ఇచ్చేశారు. వరంగల్‌లో ధ్రువీకరణ సంస్థ భవనం నిర్మించకముందే కాంట్రాక్టర్ ఖాతాకు రూ.95 లక్షల నగదు బదిలీ చేశారు. అధికారుల సొంత వాహనాల కోసం రూ.12 లక్షలు ఖర్చు చేశారు. రూ.28 లక్షలు పెట్టి కొన్న విత్తన రథం బస్సు (స్వరాజ్ మజ్దా) మూలనపడింది. 'ఇస్టా కాంగ్రెస్' (ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్) అనే ఒక ప్రైవేటు సంస్థ సదస్సుకు ప్రభుత్వ సొమ్ము ఖర్చు, ఎలాంటి టెండర్లు పిలవకుండా 'ఎగ్జోటిక్ ఈవెంట్స్ కంపెనీ'కి రూ.2 కోట్లు బదిలీ చేసిన అంశాలపై ఏజీ ఆడిట్ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. గడిచిన పదేళ్లలో రాష్ట్ర రాజధానిలోని పేరెన్నిక గల స్టార్ హోటళ్లలో 14 సదస్సులు నిర్వహించారు. కాగా, విత్తన ధ్రువీకరణ విస్తీర్ణం 2014-15లో 2.80 లక్షల ఎకరాలు ఉంటే 2023-24కు వచ్చేసరికి లక్ష ఎకరాలకు పడిపోయింది. రోజు రోజుకు విత్తన ధ్రువీకరణ విస్తీర్ణం తగ్గిపోతుంటే అవసరంలేకపోయినా సూర్యాపేట, వనపర్తి, సిద్దిపేటలో రూ.5.20 కోట్లతో డివిజన్ కార్యాలయాల కోసం భవనాలు నిర్మించారు. ఇప్పుడవి నిరుపయోగంగా ఉన్నాయి. ఒక్క అధికారిని కేటాయించకపోగా ఒక్క ఎకరానికి కూడా ఇంతవరకు సీడ్ సర్టిఫికేషన్ ఇవ్వలేదని తనిఖీలో తేలింది. కరీంనగర్‌లో కోటి రూపాయలతో నిర్మించిన విత్తన పరీక్షల ల్యాబ్ మూతపడింది. రాజేంద్రనగర్‌లో రూ.10 కోట్లతో నెలకొల్పిన అంతర్జాతీయ ఇస్టా విత్తన పరీక్ష ల్యాబ్ కూడా సాధారణ పరీక్షలకే పరిమితమైనట్లు ఏజీ ఆడిట్‌లో తేటతెల్లమైంది. గతంలో ప్రైవేటు వ్యక్తులతో ఆడిట్ చేయించి కప్పి పెట్టిన విషయాలు... ఏజీ ఆడిట్‌లో బహిర్గతమయ్యాయి. సీడ్ కార్పొరేషన్‌తో పాటు ప్రైవేటు విత్తన కంపెనీలు ఉత్పత్తి చేసే విత్తనాల నాణ్యతను తనిఖీ చేసి, ధ్రువీకరించి రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించటంలో కీలకపాత్ర పోషించాల్సిన విత్తన ధ్రువీకరణ సంస్థలో పలు అవకతవకలు వెలుగుచూడటం చర్చనీయాంశంగా మారింది.

మార్కెట్ సెస్ రూ.40 కోట్లు ఎగవేత

- టెండరు ధాన్యంపై మార్కెటింగ్ శాఖ ఆదాయానికి గండి
- రైస్ మిల్లర్లు, టెండరు ఏజెన్సీల మధ్య తెగని పంచాయితీ

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): టెండరు ధాన్యం విక్రయాలతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. ధాన్యం విలువపై మార్కెటింగ్ శాఖకు రావాల్సిన ఒక శాతం పన్ను ఇంత వరకు వసూలు కాలేదు. టెండరు ఏజెన్సీలే మార్కెట్ సెస్ చెల్లించాలని రైస్ మిల్లర్లు మొండికేస్తుండగా.. ప్రభుత్వం సెస్ రద్దుచేయాలని, లేకపోతే రైస్‌మిల్లర్లే సెస్ చెల్లించాలని ఏజెన్సీలు పేచీ పెట్టాయి. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ కమిషనర్ సురేంద్రమోహన్‌కు టెండరు ఏజెన్సీలు లేఖ రాసి.. మార్కెట్ సెస్ మినహాయించాలని ఒత్తిడి చేస్తున్నాయి. ఇదే జరిగితే రూ.40 కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం నష్టపోవాల్సి వస్తుంది. ఏడాదిన్నరగా నయాపైసా చెల్లించకపోవటంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. యాసంగి 2022-23 సీజన్‌కు చెందిన 38 లక్షల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం వేలంలో విక్రయించింది. ఇప్పటి వరకు 19 లక్షల టన్నుల పైచిలుకు ధాన్యం లిఫ్టింగ్ పూర్తికాగా.. పౌర సరఫరాల సంస్థకు రూ.4వేల కోట్ల ఆదాయం వచ్చింది. ఈ టర్నోవర్‌పై మార్కెట్ సెస్ కింద ఒక శాతం(రూ.40 కోట్లు) ఆదాయం మార్కెటింగ్ శాఖకు రావాల్సి ఉంది. టెండరు నిబంధనల ప్రకారం.. ప్రభుత్వం నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసిన ఏజెన్సీలే మార్కెట్ సెస్ చెల్లించాలి. కానీ ఏడాదిన్నరలో టెండరు ఏజెన్సీలు పైసా చెల్లించలేదు. పైగా, ఇప్పుడు మార్కెట్ సెస్ ఎత్తివేయాలని ఒత్తిడి చేస్తున్నాయి. వాస్తవానికి టెండరు ఏజెన్సీలు ధాన్యం ఎత్తకుండా.. కాగితాలపైనే లావాదేవీలు నిర్వహించాయి. రైస్‌మిల్లర్ల నుంచి డబ్బులు తీసుకొని.. ధాన్యాన్ని వారికే అంటగట్టాయి. దీంతో టెండరు ఏజెన్సీల నుంచి రైస్ మిల్లర్లు, ఇతర కంపెనీలు ధాన్యం కొనుగోలు చేసినట్లేనని, ధాన్యం కొనుగోలు చేసిన వారే సెస్ చెల్లించాలని టెండరు ఏజెన్సీలు మెలిక పెట్టాయి. మరోవైపు, ఇదంతా ప్రభుత్వానికి, టెండరు ఏజెన్సీలకు మధ్య వ్యవహారమని, మార్కెట్ సెస్‌తో తమకు సంబంధంలేదని మిల్లర్లు వాదిస్తున్నారు. అయితే ఎత్తిన ధాన్యం విలువపై ఒక శాతం సెస్ చెల్లించాలని మార్కెటింగ్ శాఖ నుంచి మిల్లర్లకు నోటీసులు జారీ అయ్యాయి. దీనిపై మిల్లర్లు స్పందించటంలేదని తెలిసింది.



తుమ్మెద రెక్కల మీద ముద్వన్నెవిల్లుల ఆకాశం

1. ఏ పాలపుంతల్ని దాటొచ్చావో కాని-
ఇంతకుముందెన్నడూ మేమెరుగని
పిల్లనగ్రోవులపంటవు నువ్వు..
లోకం వెంట లోకాన్ని దించి
మాకు పల్లకీలు కట్టించిన
మెరుపులచెండువు నువ్వు...
మడతలు విప్పుకున్న పద్యాలుగా
మమ్ము విప్పార్చిన
మొగలీసంపెంగల మహోత్సవానివి కదూ నువ్వు

2. ఆ అనిమేష వీక్షణాల నిండా
విరగబూచే తీగ సంపెంగల పందిరి పరిచి
ఆ పందిళ్ల నిండా
నన్నొక చిన్నిచిన్ని పిట్టలగుంపును చేసి-
తీరొక్కరాగాల కోలాటాలాడించి
పాడడమే ఎరుగని
నన్నెంత మహాగాయకుణ్ణి చేసి
ఆహో.. ఎన్ని కచేరీలు చేయిస్తున్నావో

3. నీ ఆ పెదవి అంచున విరుపులో
దోగాడే పసిసిగ్గున
వేలవేల కలువరాయళ్లను దూసిపోస్తూ
ఆకాశాల్ని అరచేతికందిస్తుంటే
కొత్తపాటల్ని కట్టుకుంటూ
ఎన్నిసార్లు కొత్తమొదళ్లమైపోతున్నా
ఇంకేదో వెలితిలో-
ఈ చిన్నిగుండెల్ని జోలెలుగా పట్టి
నీ కనురెప్పలవాకిట
భిక్షకులం కావడం
ఎంతటి మహదానందంగా ఉందో

4. నువ్వే దేవభాషను
మాట్లాడుతుంటావో తెలీదుకానీ,
నీతో సంభాషించడానికి
మా వర్ణమాలనంతా మరచిపోయి
లిపికందని ఏదో మధురభాషతో
నీతో పోటీపడుతున్నా-
నీ కేరింతలు, ఉంగా, ఊ లతో
దేహాన్నంతా చిత్రభాషగా మలచి
చిత్తుగా ఓడించేస్తుంటే
మనసును చెంగుపట్టి
రోజూ వంద ఓటముల్ని
ఎత్తుకోవడానికైనా మేం తయారే.

5. ఈ ప్రపంచమింకా
బతికుందనడానికి
ఈ నేల ఇంకా
నవ్వుతూనే ఉందనడానికి
ఈ గాలి ఇంకా
కలల తొక్కిసలాటలో
పండుతూనే ఉందనడానికి
కాలం ఇంకా మమ్మల్ని
పలకరిస్తూనే ఉందనడానికి
ఒకే ఒక్క నిదర్శనం-
చివుళ్లుతొడిగే కొత్తలోకాల్ని
కుక్కి కుక్కి మోసుకొచ్చిన
ను.. వ్వే.. గా.

6. మేమూ, కాలం
అదిగో ఆ రైలుపట్టాల్లా
ఎప్పుడూ ఎడమొడమే
అదిగో అక్కడెక్కడో మలుపులో
మా దూరాల్ని బద్ధలుకొడుతున్నట్లున్న
ఆ దవ్వుల్లో- ఇప్పటికైతే-
మా జుగల్‌బందీకి
వేదికా నువ్వే, వాద్యమూ నువ్వే
గాత్రమూ నువ్వే, గానమూ నువ్వే
ముగింపన్నదే లేని కచేరీ నువ్వే

7. ఇసుకకొండల్లా ఎండకాగుతున్న
మమ్మల్ని మళ్లీ నదుల్ని చేసిన
చిలుకపాటల చిరుజలపాతం లాంటి
నీ జలతారునవ్వులు,
నేరుగా చందమామలోంచి రాలి
సెలయేళ్లలో ఈత కొట్టొచ్చిన
సమీరాల్లాంటి నీ తేనెచూపులు
తుంచిపోస్తున్న కాశ్మీరాల్లో తూలీ, సోలీ
చుక్కల్ని కోసుకున్న ఝైకంలో-
ఓ కొండపల్లిబొమ్మా..
నీకెంత కవిత్వాన్ని బాకీ పడిపోతున్నానో!

■ యార్లగడ్డ రాఘవేంద్రరావు
✆ 99854 11099

ధీరజ్ కోట్ల కథా సాహిత్య పురస్కారాలు

ధీరజ్ కోట్ల సాహిత్య పురస్కారాల కోసం 2023, 2024, 2025లలో ప్రచురితమైన కథా సంపుటాలను ఆగస్టు 31 లోగా ఒక కాపీ పంపాలి. మొదటి బహుమతి రూ.10వేలు. అలాగే రూ.1,116 చొప్పున నాలుగు బహుమతులతోపాటు, ఎంపిక కాని పుస్తకాల ధర వెనక్కి చెల్లిస్తాము. చిరునామా: పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఇంటి నెం: 15-31, పుట్టంరాజు వారి వీధి, ఇందిరా నగర్, అద్దంకి (పోస్ట్ & మండలం), బాపట్ల జిల్లా - 523201. ఫోన్: 81796 36617.

పుట్టంరాజు బుల్లెయ్య

కాశీభట్ల వేణుగోపాల్ స్మరణ సభ

అక్షరం లిటరరీ ట్రస్ట్, కర్నూలు తరఫున కాశీభట్ల వేణుగోపాల్ స్మరణ సభ ఆగష్టు 10 ఆదివారం ఉ.10.30కు కెమిస్ట్ భవన్, కర్నూలులో జరుగుతుంది. ఆ సందర్భంగా కాశీభట్ల స్మరణ సంచిక 'నిహితం'ను వంశీకృష్ణ ఆవిష్కరిస్తారు. అదే సభలో 'అక్షరం - సాహిత్య పురస్కారం - 2025'ను కవి తెలుగు వెంకటేష్ స్వీకరిస్తారు.

జి. వెంకటకృష్ణ

తెలుగు భాషోత్సవాలు

నెల్లూరులో తెలుగు భాషోత్సవాలు 'సేవ' (తెలుగు భాషా సాహితీ సాంస్కృతిక సంస్థ) ఆధ్వర్యంలో నెల్లూరు టౌన్ హాలులో 2025 ఆగస్టు 29, 30, 31 తేదీలలో జరుగనున్నాయి. ఈ సందర్భంగా పాతికేళ్లుగా తెలుగు భాషా సాహితీ రంగాల్లో సేవలందించిన మూడు వందల మంది కవులకు, రచయితలకు సేవ పురస్కారములు అందజేస్తున్నాం. ఈ ఉత్సవాల్లో ప్రాచీన, ఆధునిక, అస్తిత్వవాద సాహిత్యాలు, బాల సాహిత్యం, యువ సాహిత్యం, రాష్ట్రేతర ప్రాంతాల తెలుగు భాషా, సాహిత్యాలు, అవధానం, బోధనా భాషగా తెలుగు, ప్రచురణ, ప్రసార, సాంఘిక మాధ్యమాలు, కథ, నవల, నాటకం సినీ సాహిత్య సదస్సులు, కవి సమ్మేళనములుంటాయి. వివరాలకు: 94926 66660.

కంచర్ల సుబ్బానాయుడు

పద్య కావ్యాలకు ఆహ్వానం


రచన సాహిత్య వేదిక (కడప) ఆధ్వర్యంలో గడియారం వేంకట శేషశాస్త్రి అవార్డు కోసం పద్యకావ్యాలకు ఆహ్వానం. 2022, 2023, 2024 సంవత్సరాల్లో ప్రథమ ముద్రణ పొందిన పద్యకావ్యాలను పంపాలి. ఎంపికైన కావ్యకర్తకు రూ.10వేల నగదు, ప్రశంసా పత్రం అందజేస్తాం. కావ్యాలు 3 ప్రతులను ఆగస్ట్ 30లోగా చిరునామా: భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, రచన సాహిత్య వేదిక, 1/2349-1, 'కృష్ణవేణీ సదన్', హౌసింగ్‌బోర్డు కాలనీ, కడప - 516004కు పంపాలి. వివరాలకు: 9966624276.

భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి

'తెరవని తలుపుల' వెనుక దాగిన చీకట్లు

తెలుగు నవల వెలువడిన తొలి రోజుల్లో నవలాకారులు పాత్రల బాహ్య సంఘర్షణకు ఇచ్చిన ప్రాధాన్యతను అంతరంగ సంఘర్షణకు ఇచ్చేవారు కాదు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత తెలుగు నవలాసాహిత్యంపై పడిన ముఖ్యమైన ప్రభావాల్లో మనోవిశ్లేషణవాదం, అస్తిత్వవాద సిద్ధాంతం ముఖ్యమైనవి. ఫ్రాయిడ్ సిద్ధాంతాలు, ముఖ్యంగా అచేతన మనస్సు (Unconscious Mind), రిప్రెషన్ (Repression), లిబిడో (Libido), ఒడిపస్ కాంప్లెక్స్ వంటి భావనలు, తెలుగు సాహిత్యంలో కొంతమంది రచయితల రచనల్లో స్పష్టంగా లేదా అంతర్లీనంగా కనిపిస్తాయి.

ఫ్రాయిడ్ మనోవిశ్లేషణవాద దృక్పథంతో రచనలో మనోవిశ్లేషణ చేసిన నవలాకారుల్లో త్రిపురనేని గోపీచంద్ ప్రముఖులు. ఆయన రాసిన 'అసమర్థుని జీవయాత్ర', 'మెరుపుల మరకలు', 'పిల్ల తెమ్మెర', 'గడియ పడని తలుపులు' మొదలైన నవలల్లో మనస్తత్వ విశ్లేషణ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. బుచ్చిబాబు 'చివరకు మిగిలేది' నవల, వడ్డెర చండీదాస్ 'హిమజ్వాల', ఆర్.ఎస్.ఎస్. సుదర్శనం 'సంసార వృక్షం', శీలా వీర్రాజు 'మైనా', భాస్కరభట్ల కృష్ణారావు 'వెల్లువలో పూచిక పుల్లలు', కోడూరు రామమూర్తి 'నీటిలో నీడలు'... మొదలైన నవలలు ఈ కోవలోనివే. చలం రచనలు ముఖ్యంగా



'మైదానం', 'సావిత్రి' వంటివి లైంగిక సంఘర్షణలు, సామాజిక నిషేధాలు, వ్యక్తిగత స్వేచ్ఛ కోసం పోరాటాన్ని చిత్రీకరించాయి. విశ్వనాథ సత్యనారాయణ 'ఏకవీర' నవలలో కూడా ఈ సిద్ధాంతానికు సంబంధించిన అవగాహన కనపడుతుంది.

ఇటీవల తెలుగులో వచ్చిన నవలల్లో మనస్తత్వ విశ్లేషణ గురించి ప్రస్తావించేటప్పుడు కాశీభట్ల వేణుగోపాల్ రాసిన 'నేను చీకటి', 'తపన' మొదలైన అన్ని నవలల గురించీ పేర్కొనాలి. ఈ నవలల్లో పాత్రల అంతరంగ సంఘర్షణలను ఆవిష్కరించడం కోసం కాశీభట్ల వేణుగోపాల్ చైతన్యస్రవంతి విధానాన్ని విస్తృతంగా ఉపయోగించారు. 'నేను చీకటి' నవల ఒక మనో వైజ్ఞానిక నవల చేసే పనే గాక సామాజిక స్పృహతో రాసిన నవల చేసే పనిని కూడా సమర్థవంతంగా నిర్వహిస్తుంది.

మనిషి మనసులోని చీకటికోణాల ఆవిష్కరణకు చైతన్య ప్రవంతి శైలి ఉపయోగపడుతుందని భావించి తాను ఆ శైలిని ఉపయోగిస్తున్నట్లు కాశీభట్ల చెప్పుకొన్నారు. ఆయన 'తెరవని తలుపులు' నవల మనసులోని సంఘర్షణను, తెలియని భయాలను, అణచివేయబడిన ఆలోచనలను, సామాజిక ఒత్తిడుల మధ్య సంఘర్షణలను చిత్రీకరిస్తుంది. 'తెరవని తలుపులు' శీర్షికే మనసులో బంధించబడిన భావాలను, తెరవడానికి ధైర్యం లేని రహస్యాలను సూచిస్తుంది. ఈ నవలలో చైతన్య ప్రవంతి శైలి విరివిగా కనిపిస్తుంది. ఈ వాక్యాలను ఒకసారి పరిశీలించండి: "ఫాంటేస్టైడ్... ర్యాండ్... వియ్డ లవింగ్... లివింగ్... జీవితం... తంత్రం.. కుతంత్రం... మంత్రం... పుష్పమంత్రం... మంత్ర పుష్పం... పుష్పం? శష్పం... సుసరభేత్... కామ నిలయా ఘూటరోమాటవీ సముత్పాటనా పరిపాటికై పాటల గంధులు దీనిని పాటింతురు...".

ఫణిహారం వల్లభాచార్య- ఈ నవలను మనస్తత్వశాస్త్రంతో ఎంతగానో విశ్లేషించవచ్చనీ, అస్తిత్వవాదంతో దీని లోతులకు ఈదుకుంటూ వెళ్ళవచ్చనీ, అయాన్ రాండ్ 'ద వర్చ్యూ ఆఫ్ సెల్ఫిష్‌నెస్' పుస్తకం మొత్తాన్నీ దీనికి అన్వయించవచ్చనీ అంటారు. కాశీభట్ల వేణుగోపాల్ 'తెరవని తలుపులు' నవలను సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతం, ఎరిక్సన్ మనోసాంఘిక విశ్లేషణ సిద్ధాంతాలను పరిగణనలోకి తీసుకొని విశ్లేషించవచ్చు.

ఈ నవలలలోని కథానాయకుడు ఆధునిక జీవితం అందించిన సౌఖ్యాలు పొందిన బ్రాహ్మణుడు, తాగుబోతు, చైన్ స్మోకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్. అతడి భార్య లెక్చరర్. కొడుకు అమెరికాలో చదువుకోవాలి అనుకొంటూ ఉంటాడు. ఆర్థికంగా స్థిరంగా ఉన్నప్పటికీ కథానాయకుడి మానసిక జీవితం ఒంటరితనంతో, అస్తిత్వ శూన్యతతో నిండి ఉంది. స్మోకింగ్ వల్ల కాళ్ళు కోల్పోయే స్థితిలో, ఆపరేషన్‌కు ముందు నిద్రమాత్రలతో జీవితాన్ని ముగిస్తాడు.

ఫ్రాయిడ్ నిర్వచించిన 'ఇడ్', 'ఈగో', 'సూపర్-ఈగో' భావనలను ఈ కథకు అన్వయించవచ్చు. నవలలోని కథానాయకుడి పాత్రలోని 'ఇడ్' సమాజం ఆమోదించని, అసంగతమైన కోరికలను జనింపజేస్తుంది. ఉదాహరణకు కథానాయకుడు తన కుటుంబ సభ్యుల గురించి ఇలా అనుకొంటాడు: "నేను విడిపోతే వీళ్ళకు దారి సుగమం అవుతుంది. అట్లా కావడం నాకు ఇష్టం లేదు. కలిసుండాలి. వాళ్ళని హింసించాలి. వాళ్ళు సుఖాలు అనుకొంటున్నవాటికి నేను అడ్డం పడాలి". తన కుటుంబం పట్ల అతని ఈ భావనలను సమాజం హర్షించదు. సమాజ ఆమోదం లేని ఇలాంటి అనేక ఆలోచనలు కథానాయకుడి మస్తిష్కంలోకి వస్తూంటాయి. అతని పాత్ర అంతరంగాన్ని 'ఇడ్' ఎంత డామినేట్ చేసినప్పటికీ కొన్ని విషయాల్లో 'ఈగో' ప్రభావంచేత అతడి ప్రవర్తన సమాజ ఆమోదయోగ్యంగా మారుతుంది. ఉదాహరణకు ఒకచోట కథానాయకుడు

మనిషి మనసులోని చీకటికోణాల ఆవిష్కరణకు చైతన్య ప్రవంతి శైలి ఉపయోగపడుతుందని భావించి తాను ఆ శైలిని ఉపయోగిస్తున్నట్లు కాశీభట్ల చెప్పుకొన్నారు. ఆయన 'తెరవని తలుపులు' నవల మనసులోని సంఘర్షణను, తెలియని భయాలను, అణచివేయబడిన ఆలోచనలను, సామాజిక ఒత్తిడుల మధ్య సంఘర్షణలను చిత్రీకరిస్తుంది. 'తెరవని తలుపులు' శీర్షికే మనసులో బంధించబడిన భావాలను, తెరవడానికి ధైర్యం లేని రహస్యాలను సూచిస్తుంది.



"ఆ పెద్దావిడ సంభాషణ ఎక్కడికి దారితీస్తుందో నాకు తెలుసు. మీ ముందు ఆమెను తిట్టలేను కదా... అందుకే... ఏం చెయ్యమంటావు నన్ను చెప్పు?" అంటాడు. తిట్టాలని ఉన్నా పెద్దావిడను అందరిముందు తిట్టడం తప్పు అనే ఆలోచనకు ఫ్రాయిడ్ ప్రకారం మనిషిలో ఉన్న ఈగో కారణం. ఇక ఆదర్శవంతమైన ప్రవర్తనకు కారణం 'సూపర్ ఈగో'. ఈ నవలలోని ప్రధాన కథానాయకుడి పాత్ర అనేక ఒత్తిడుల వల్ల తన నిజమైన ఆలోచనలను దాచుకోవడం చేత అవి 'తెరవని తలుపులు'గా మిగిలిపోతాయి.

మనిషి తన మానసిక సంఘర్షణలను అధిగమించడానికి పలురకాల రక్షకతంత్రాలను (డిఫెన్స్ మెకానిజమ్స్) అనుసరిస్తాడని ఫ్రాయిడ్ ప్రతిపాదిస్తారు. ఈ నవలలోని అనేక పాత్రలు ఈ తరహా రక్షక తంత్రాలను అనుసరిస్తూ ఉంటాయి. ఉదాహరణకు 'నిరాకరణం' (డినైయల్) అనే రక్షక తంత్రాన్ని కథానాయకుడు అనుసరించే సందర్భం మనకు నవలలో కనిపిస్తుంది. "నాకు ఏ రోగం లేదు. ఏదో రోగముందేమో అనుకొనే రోగం. హైపోకాండ్రియా అనే రోగం" అని కథానాయకుడు అంతరంగంలో అనుకొంటాడు. అలాగే నార్సిజమ్‌కు సంబంధించిన భావనలూ నవలలో ఉన్నాయి. కథానాయకుడు అంతరంగంలో, "మనుషులు ఎవరిని వారు ప్రేమించుకుంటారన్న భావన నాలో తీవ్రంగా ఉంది. నేనూ అంతే గదా! నన్ను నేను నార్సిస్టిక్‌గా ప్రేమించుకొంటాను" అనుకొంటాడు.

ఎరిక్సన్ అనే మనోవిజ్ఞాన శాస్త్రవేత్త తన సాంఘిక మనోవికాస సిద్ధాంతంలో వ్యక్తి అహం ఎనిమిది సాంఘిక దశల ద్వారా పయనిస్తూ వికసిస్తుందని చెబుతారు. ఆ ఎనిమిది దశల్లో ఆరవ దశ అయిన 'సన్నిహితం - ఏకాంతం' అతిముఖ్యమైనది. ఈ దశలోని వ్యక్తులు ఏ కారణం చేతనైనా తమ ఆశలు, సిద్ధాంతాలు, ఆలోచనలను సరిగ్గా ఏర్పరచుకోలేక పోయినప్పుడు ఇతరులతో కలవలేక ఏకాంతంగా గడిపే ప్రయత్నం చేస్తారు. ఈ నవలలోని కథానాయకుడు ఈ తరహాకు చెందినవాడే.

సార్త్ర్ అస్తిత్వవాద అంశాలు కూడా నవలలో కనిపిస్తాయి. ఉదాహరణకు: "సిగరెట్‌కు ఉన్న అస్తిత్వం నీ ఆలోచనల్లో ఉంది. సిగరెట్కై సిగరెట్‌కు అస్తిత్వం లేదు. నీకు అది ఉంది. దానికి నీవు లేవు. సార్త్ర్... మెల్లకన్ను సార్త్ర్... బీఇంగ్ అండ్ నథింగ్ నెస్... అస్తిత్వమూ అస్తిత్వ రాహిత్యమూ.. రాహిత్యం... నా రాహిత్యం... నేన్లేకపోతే నాయీ ప్రపంచం నాకు లేదు...".

'తెరవని తలుపులు' నవల కాశీభట్ల వేణుగోపాల్ సాహిత్య ప్రతిభకు నిదర్శనం. మనోవిశ్లేషణాత్మక దృక్కోణం నుంచి ఈ నవలను చూసినప్పుడు ఇది మనిషి మనస్సులోని సంక్లిష్టతలను, అస్తిత్వ సంక్షోభాన్ని, సామాజిక ఒత్తిడులను అద్భుతంగా చిత్రీకరిస్తుంది. ఫ్రాయిడ్, ఎరిక్సన్, సార్త్ర్ వంటి సిద్ధాంతకర్తల దృక్కోణాల ద్వారా ఈ నవలను పరిశీలించడం వల్ల పాత్రల్లోని అంతర్గత సంఘర్షణలు స్పష్టమవుతాయి. ఈ నవల తెలుగు సాహిత్యంలో మైలురాయిగా నిలిచిపోతుంది.

■ మారుతి పౌరోహితం
✆ 94402 05303

సోమవారం 4 ఆగష్టు 2025

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

గరిక పూలు



1
వెంటాడడంలో
నీడకీ
జ్ఞాపకానికీ
పోటీ పెడితే,

ఓటమెప్పుడూ
నీడదే!



2
పూలతోటలోకి
నీ ప్రవేశాన్ని
నిషేధిస్తున్నాను!

ఏది పువ్వో
ఏది నువ్వో
తెల్సుకోలేక!



3
అతను,
ఆమె
ఆత్మహత్య చేసుకున్నారు!

ఒకరి ఫోన్లో ఒకరు
మారుపేర్లతో
మిగిలిపోయారు!



4
నువ్వెంత ఇష్టం అంటే
నీతో కలిసి నడిచిన దారుల్లో
ఒక్కణ్ణే
తిరగలేనంత!



5
జీవితం
పుల్లవస్ బండి లాంటిది!
దాని వెనకాలే పరిగెత్తే
పిల్లలం
మనం!



6
కూలిన
చెట్టుకింద..

నీడ
ముక్కలైన
శబ్దం!



7
నా మనసు
లోతట్టు ప్రాంతంలో ఉందో ఏమో

తరచూ నీ జ్ఞాపకాలముంపుకి
గురౌతూనే ఉంటుంది!



8
ఆటబొమ్మలు
దిగాలుగా
చూస్తున్నాయి

జ్వరం వచ్చిన
పాపాయిని!

■ భాస్కరభట్ల
bbpoet@gmail.com

భావోద్వేగాల్లో అవిభక్త కవలల్లాంటి వాళ్లం, కాబట్టే మేం కలిసి ఈ నవల రాయగలిగాం!

పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ సంస్థ ఈ మధ్య ప్రచురించిన 'రెక్కచాటు ఆకాశం' నవల అనేక అంశాల రీత్యా ప్రత్యేకమైనది. ఇప్పటితరం స్త్రీల జీవితాల్లోని అనేక పార్శ్వాలను క్రమపద్ధతిలో చర్చలోకి తీసుకురావడం అందులో మొదటిది. ఇద్దరు రచయిత్రులు కలిసి దాదాపు మూడువందల యాభై పేజీల నవలని నిర్వహించడం మరొకటి. భిన్న శైలీ ప్రత్యేకతలు కలిగిన వీరు 'సిస్టర్‌హుడ్' భావన పట్ల ప్రేమతో అల్లిన కలనేత ఈ నవల. ఈ సందర్భంగా తొలి జంట నవలా రచయిత్రులు సుజాత వేల్పూరి, ఉమా నూతక్కిలతో ముఖాముఖి.

జంటగా ఇంత పెద్ద నవల రాయడానికి మీ ఇద్దరినీ కలిపిన అంశాలు ఏమిటి?

'రెక్కచాటు ఆకాశం' నవలని మేమిద్దరం కలిసి రాయాలనే ఆలోచన అసంకల్పితంగా మొదలైంది. ఆ తర్వాత ప్రయత్నపూర్వకంగా ముందుకు సాగింది. మా ఇద్దరిలో బలంగా ఉన్న జెండర్ కాన్షస్‌నెస్, అణచివేయబడి నిశ్శబ్దమైపోతున్న నిస్సహాయ అనుభవాలకి గొంతుకనివ్వాలనే కాంక్ష బహుశా ఈ రచనకి పురికొల్పాయని అనుకుంటున్నాము. స్పష్టంగా చెప్పాలంటే నవల ఇతివృత్తం మమ్మల్ని కలిపిన ప్రధానాంశం. 'రెక్కచాటు ఆకాశం' కేవలం ఒక కథ కాదు- ఆత్మగౌరవ పతాక, ధిక్కార ప్రకటన. స్త్రీత్వం చుట్టూ సాలెగూడులా అల్లుకున్న పితృస్వామ్య భావజాలం, బయటికి హింసగా కనపడని వేధింపులు, మనసు మీద నిఘా, స్వేచ్ఛని అణచివేసే ప్రయత్నాలు, వేచివేచి వాటిమీద విరుచుకుపడిన ఆక్రోశం, ఇవన్నీ నవల్లో చర్చకు వస్తాయి. కథాంశపు తీవ్రత, మా ఏకీకృత స్త్రీవాద దృక్పథం, ఆలోచనల్లో సమన్వయం- ఇవన్నీ కలిసే 'రెక్కచాటు ఆకాశం' నవల సృజనకి మమ్మల్ని పురికొల్పిన అంశాలు.

జమిలి రచనలోని సాధకబాధకాలు?

సహజంగా మా ఆలోచనా ధోరణి కొంతవరకూ ఒకేలా ఉంటుంది కాబట్టి, నవల సాఫీగా సాగిపోతుందనే అనుకున్నాం. నవల్లో ఒకటికి మించి ప్రధానపాత్రలు ఉన్నపుడు సాధారణంగా దేనికీ ప్రత్యేకత లేకుండా మిగిలిపోయే ప్రమాదం ఉంది. అటువంటి ప్రమాదంలో పడకుండా, ప్రతి పాత్రనూ వైవిధ్యంగా తీర్చిదిద్దడ మన్నది జమిలి రచన వల్లే సాధ్యమైంది. ఒకరు మొదలు పెట్టిన దాన్ని మరొకరు అందిపుచ్చుకుని సమర్థవంతంగా నెరుపుతూ ముందుకు తీసుకువెళ్ళగలిగే ప్రేరణ జమిలి రచన వల్లే సాధ్యమైంది.

సవాళ్ల విషయానికి వస్తే, ఇద్దరు కలిసి ఒక కథను రాస్తున్నపుడు, ఒకరి వ్యక్తీకరణ మరొకరికి అతిగానో, అనవసరంగానో అనిపించే అవకాశం ఉంది. అటువంటి సందర్భంలో జంటస్వరాల మధ్య గందరగోళం పాఠకులకి కూడా అందే అవకాశం ఉంది. అయితే భావోద్వేగాల పరంగా మేం అవిభక్త కవలల వంటివాళ్లం కాబట్టి దాన్ని సులభంగానే దాటేశాం. కథ, కథనం కల్లోకం కాకుండా కాచింది అదే. ప్రతి రచయితకూ ఒక స్వరం, ఒక దృష్టికోణం ఉంటాయి. ఇద్దరు కలిసి రాస్తున్నపుడు, సహ రచయిత మీద నమ్మకం, రచన లక్ష్యంమీద ఉమ్మడి నిబద్ధత ఉండటం, ఆ స్వరాన్నీ దృష్టినీ సమర్థవంతంగా మరొక స్వరంతో దృష్టితో ఏకీకృతం చేయడానికి సహకరిస్తాయి. మా విషయంలోనూ అదే జరిగి 'రెక్క చాటు ఆకాశం' రూపుదిద్దుకుంది.



సుజాత వేల్పూరి



ఉమా నూతక్కి

నవలా వస్తువు కొత్తగా చెపుతున్నది ఏమిటి?

'పెళ్లి', ముఖ్యంగా 'మాతృత్వం' వంటి వ్యక్తిగత అంశాలని సామాజికం చేసి, సాధారణీకరించి వాటికి 'పవిత్రత' పేరిట పలుపుతాళ్లు, గుదిబండలూ విధించడాన్ని ఈ నవల ప్రశ్నిస్తుంది. సన్నిహిత సంబంధాలలో కూడా అధికార నిర్మాణాలు చొచ్చుకుపోయి విధ్వంసక ధోరణులకు ఎలా దారితీస్తాయో వివరిస్తుంది. ఒక స్త్రీ సెక్సువాలిటీని ఆమె బలహీనతగా భావించి, ఆమెను పాతాళానికి తొక్కేయాలనుకుంటే, ఆమె రెట్టింపు శక్తితో అగ్నిపర్వతంలా ఎగిసిపడి అటువంటి శక్తుల అంతు చూడగలదనేది ఈ నవలలో కొత్తగా మేము చెప్పిన అంశం. ఇటువంటి కథాంశంతో ఇంతకు ముందు నవల ఏదీ రాలేదని చెప్పగలం. ఈ నవల గాయాల ప్రదర్శన ఎంతమాత్రం కాదు. గాయాల పునరుక్తికి కారణమౌతున్న అణచివేత వ్యవస్థలకు వ్యతిరేకంగా తిరుగుబాటు స్వరంతో సవాలును విసురుతుందీ నవల. వ్యక్తిగత విషాదాలను ఈదటం నుంచి, సామూహిక సాధికారత దిశగా కొద్దిమంది స్త్రీలనైనా ఈ నవల ఆలోచింప చేస్తుందని ఆశిస్తున్నాం.



ఇద్దరు కలిసి రాస్తున్నపుడు, సహ రచయిత మీద నమ్మకం, రచన లక్ష్యం మీద ఉమ్మడి నిబద్ధత ఉండటం, ఆ స్వరాన్నీ దృష్టినీ సమర్థవంతంగా మరొక స్వరంతో దృష్టితో ఏకీకృతం చేయడానికి సహకరిస్తాయి. మా విషయంలోనూ అదే జరిగి 'రెక్క చాటు ఆకాశం' రూపుదిద్దుకుంది.

ఈ నవల ఎటువంటి పాఠకుల కోసం?

ఈ నవల జెండర్‌కి అతీతంగా, స్త్రీ పురుష సీరియస్ పాఠకుల కోసం. హాపిలీ ఎవర్ ఆఫ్టర్ ఎండింగ్‌లూ, ఫీల్ గుడ్ ఫాక్టర్ల కోసమూ కాక, పుస్తకం మూశాక, ఒక్క క్షణం కూచుని ఈ నవలలో ఏదో ఒక అంశాన్ని గురించి కాసేపు ఆలోచించగలిగే పాఠకుల కోసం. చదువుకుని సంపాదిస్తూ తమ కాళ్ళ మీద తాము నిలబడిన స్త్రీలంతా భద్రలోకంలో ఉన్నారనుకునే వారు కూడా ఈ నవలను చదవాలి. లింగ సమానత, స్త్రీల జీవితాల చుట్టూ అల్లుకున్న అనేక రాజకీయాలు, వంటి లోతైన అంశాల మీద ఆసక్తిని, ఆలోచనలను రేకెత్తించే సాహిత్యాన్ని ఇష్టపడేవారి కోసం ఈ నవల. స్వీయనిర్ణయాధికారం కోసం, తమదైన ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాటం చేసే స్త్రీలను అభిమానించే పాఠకుల కోసమే మా 'రెక్కచాటు ఆకాశం' నవల. స్త్రీలను సాటి స్త్రీల కంటే ఎవరూ లోతుగా అర్థం చేసుకోలేరని, సిస్టర్‌హుడ్‌తో స్త్రీలు మాత్రమే ఒకరి బాధల్ని సంతోషాల్ని మరొకరు embrace చేసుకోగలరని నమ్మే పాఠకుల కోసం ఈ నవల.

ఇంటర్వ్యూ ■ కె.ఎన్. మల్లీశ్వరి


వరంగల్ బస్‌స్టాండ్ పనులను పరిశీలిస్తున్న కుడా చైర్మన్, వైస్ చైర్‌పర్సన్

'కుడా' అభివృద్ధి పనుల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వరంగల్ కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్‌లు ఆదివారం పరిశీలించారు. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం, హంటర్‌రోడ్డులోని కుడా ల్యాండ్, కాకతీయ మ్యూజికల్ గార్డెన్, వరంగల్ బస్‌స్టేషన్‌లో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, నూతన పనులపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ ఇనగాల మాట్లాడుతూ.. కుడా నిధులతో వరంగల్ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావుతో పాటు కుడా అధికారులు పాల్గొన్నారు.

విద్యలో అంతరాలు తొలగించాలి

ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ప్రైవేటీకరణ మొదలవడంతో అంతరాలు ప్రారంభం అయ్యాయని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. హనుమకొండ లా కాలేజీ ఆడిటోరియంలో చర్చాగోష్టి జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థలు ప్రధానంగా ప్రాథమిక, మాధ్యమిక విద్యాలయాలు దిక్కులేని వారి బడుగులుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యావిధానంలో ప్రస్తుతం ఉన్న అంతరాలకు మూలకారణం విద్యా వ్యాపార సరుకుగా మారటమేనని, 80 దశకం నుంచి ఇది ప్రారంభమై పరాకాష్టకు చేరుతోందని చెప్పారు. ఈ అంతరాలు పోవాలంటే తెలంగాణ పౌరస్పందన వేదికతోపాటు అన్ని సంఘాలు, సంస్థలు, పౌరసమాజం కలిసి ఒక ఐక్యవేదికగా ముందుగా సాగాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధే శ్యామ్, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటనారాయణ, లక్ష్మారెడ్డి, రాంమూర్తి, శ్రీధర్‌గౌడ్, విజయ్ కుమార్, డాక్టర్ రామస్వామి, ప్రొఫెసర్ రాజిరెడ్డి, పెండెం రాజు, శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

డీడీఎన్ ఎవరికో!?

త్వరలో ఎంపికైన ఆలయాల జాబితా ప్రకటన

7

కదలరు.. వదలరు..



బదిలీ అయినా వెళ్లని డిప్యూటేషన్ సిబ్బంది

- జీడబ్ల్యూఎంసీలో 31 మందికి ఆదేశాలు జారీ
- ట్రాన్స్‌ఫర్ నిలిపివేతకు సంఘాల నేతల వసూళ్లు
- కార్పొరేషన్‌లో సీడీఎంఏ ఆదేశాలు బేఖాతరు
- వెళ్లాల్సిందేనన్న కమిషనర్.. నోట్‌ఫైల్ సిద్ధం..
- ఒకటి, రెండు రోజుల్లో తిరిగి వెళ్లాలని ఉత్తర్వులు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర పాలక సంస్థలో వివిధ శాఖలలో పని చేస్తూ బదిలీపై వెళ్లి డిప్యూటేషన్‌పై వచ్చిన సిబ్బంది తిరిగి యథాస్థానాలకు వెళ్లాలని రాష్ట్ర సీడీఎంఏ నుంచి ఆదేశాలు వచ్చి వారం గడుస్తున్నా ఇక్కడి నుంచి రిలీవ్ కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. కొద్దిరోజులు కమిషనర్, మేయర్ అందుబాటులో లేకపోవడంతో వీరిని పంపించలేదు. కానీ డిప్యూటేషన్ రద్దు అని సీడీఎంఏ నుంచి కచ్చితమైన ఆదేశాలు వెలువడినా బేఖాతరు చేస్తూ ఎవరి కార్యాలయంలో వారు పనిచేస్తున్నారు. ఇక్కడి నుంచి వెళ్లమని భీష్మించుకుకూర్చున్నారు. కానీ వెళ్లకతప్పదని ఇక్కడి అధికారులు అన్ని ఏర్పాటు చేస్తూ కమిషనర్ సంతకం కోసం నోట్‌ఫైల్ సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఏళ్ల తరబడి ఒకే చోట..

గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థలో పనిచేసిన సిబ్బంది ఎక్కువ కాలం ఒకేచోట విధులు నిర్వర్తించడంతో వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి ఇతర మునిసిపాలిటీలకు బదిలీ చేశారు. ప్రధానంగా పరకాల, ఖమ్మం, డోర్నకల్, కేసముద్రం, మహబూబాబాద్, కరీంనగర్, హుజూరాబాద్ ప్రాంతాలకు బదిలీ చేశారు. కానీ ఇక్కడ అన్నిరకాల సౌకర్యాలతోపాటు అదనంగా డబ్బులు వస్తుండడంతో కొందరు ఉద్యోగులు పైరవీలు, పలుకుబడి ఉపయోగించి నెల రోజుల్లోనే వరంగల్ కార్పొరేషన్‌కు వచ్చారు. ఇక్కడకు వచ్చిన వారు కోరుకున్న వింగ్‌లలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే డిప్యూటేషన్‌పై జీడబ్ల్యూఎంసీకి వచ్చిన సిబ్బంది ఎవరిస్థానాలకు వారు వెళ్లి విధులు నిర్వర్తించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు గత నెల 25న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు వరంగల్ మునిసిపల్ పరిధిలో పనిచేస్తున్న 31మంది యథాస్థానాలకు వెళ్లాలని రాష్ట్ర మునిసిపల్ డైరెక్టర్ టీకే శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. విషయం తెలుసుకున్న డిప్యూటేషన్ ఉద్యోగులు కంగుతిన్నారు. తమకు ఆరోగ్యం బాగా లేదని కొందరు.. తమ కుటుంబ సభ్యులకు జబ్బుచేసిందని మరికొందరు.. తన రిటైర్‌మెంట్ దగ్గర పడిందని ఇంకొందరు.. వ్యాధులు ఉన్నాయని పలురు రిపోర్టులతో కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మేయర్ చాంబర్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కానీ మునిసిపల్ రాష్ట్ర డైరెక్టర్ ఆదేశాలు తోసిపుచ్చలేమని కమిషనర్ చెప్పి పంపించినట్లు విశ్వసనీయ సమాచారం.

పరకాల ఎమ్మెల్యే ఫిర్యాదు

వరంగల్ నగర పాలక సంస్థ నుంచి పరకాల మునిసిపాలిటీకి బదిలీ అయిన ఉద్యోగులు నెల రోజుల్లోనే తిరిగి జీడబ్ల్యూఎంసీకి వచ్చి విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో పరకాల మునిసిపాలిటీ శానిటేషన్, ఇంజనీరింగ్‌తో పాటు పలు విభాగాల్లో అభివృద్ధి వెనుకబడింది. దీనిపై అక్కడి ప్రజలు స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఫిర్యాదు చేయడంతో ఆయన హైదరాబాద్ పురపాలక శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన మునిసిపల్ డైరెక్టర్.. జీడబ్ల్యూఎంసీలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్న 31 మందిని వెనక్కి వెళ్లి రిపోర్టు చేయాలని జూలై 25 రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే 31 మంది డిప్యూటేషన్ సిబ్బందిని పరకాలకు పంపించకుండా ఆపేందుకు సంఘాల నేతలు ఖర్చులకు తలా రూ.3,500 మొత్తంగా రూ.1.12లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. బదిలీ తప్పదని తెలిసి తిరిగి తమ డబ్బులు తమకు తిరిగి ఇవ్వాలని నిలదీసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా వుండగా, జీడబ్ల్యూఎంసీలో డిప్యూటేషన్ పద్ధతిలో విధులు నిర్వర్తించే సిబ్బంది సోమవారం వరకు రిలీవ్ అవుతాని జీడబ్ల్యూఎంసీ ఆఫీస్ వర్గాలు చెప్పుకొస్తున్నారు.

31 మంది సిబ్బంది వెనక్కి వెళ్లాల్సిందే..

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ నుంచి పరకాలకు 31 మంది సిబ్బంది తిరిగి వెళ్లాల్సిందేనని మునిసిపల్ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరకాలకు వెళ్లే వారిలో.. సీహెచ్ గిరిబాబు, పి. సురేష్ (శానిటరీ ఇన్‌స్పెక్టర్లు) పి.శ్రవన్‌కుమార్ (జూనియర్ అసిస్టెంట్) ఎంఏ అజీజ్, బుచ్చిరాజు, ఈ.స్వర్ణలత (వార్డ్ ఆఫీసర్) రమేష్ వంగ, సురేష్ (పంప్ ఆపీసర్లు) ఆర్.నర్సింగరావు (లైన్‌మెన్) కృష్ణస్వామి, సీహెచ్ రవీందర్, ఎన్.ఆనందం (శానిటరీ జవాన్) మోరె రమేష్, భాగ్యలక్ష్మి, లన్వర్ బేగ్, టి.శేఖర్, కుమారస్వామి, ఎన్.జయరాజు (అటెండర్) మంద విజయ, ఎన్.సారయ్య, మేకల రాజయ్య, తల్ల బాబు, ఎల్.సుదర్శన్, పేర్ల బిక్షపతి, జి.జశ్వ, సల్లూరి చేరాలు, పి.చందర్, ఎం.దేవయ్య, ఏనిగల మల్లయ్య, ఎం.రాజశేఖర్, ఎం.యాదగిరి పబ్లిక్ హెల్త్ (పీహెచ్) వర్కర్లు ఉన్నారు.

ఇష్టం లేని కోర్సు చదవలేక..

- ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం
- తరగతి గదిలో ఆత్మహత్య


శివాని (ఫైల్)

వరంగల్ క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అర్థం కాని చదువుతో సతమతం అవుతున్నానని, ఈ చదువు తనతోకాదని, చెల్లినైనా నచ్చిన కోర్సులో జాయిన్ చేయించి మంచిగా చదవించండంటూ తల్లితండ్రులకు సూసైడ్ నోట్ రాసి ఇంటర్ విద్యార్థిని తరగతి గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన ఆదివారం హనుమకొండలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో చోటు చేసుకుంది. హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన మిట్టపల్లి కుమార్- కవిత దంపతులు.. వారి పెద్ద కూతురు శివాని(16)ని హనుమకొండలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఎంపీసీ ప్రథమ సంవత్సరం జేఈఈ బ్యాచ్‌లో జాయిన్ చేశారు. అయితే శివానికి మాత్రం ఎంసెట్ బ్యాచ్‌లో కొనసాగాలని ఉన్నప్పటికీ తల్లితండ్రుల కోరిక మేరకు జేఈఈ మెయిన్స్ కోర్సులో జాయిన్ అయింది. ఆమెకు జేఈఈ తరగతులు అర్థం కాకపోవడంతో ఆదివారం ఉదయం కళాశాల మూడో అంతస్థులోని తరగతి గదిలో ఫ్యాన్ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన సహచర విద్యార్థిని.. కళాశాల యాజమాన్యానికి సమాచారం చేరవేయడంతో హుటాహుటిన ఎంజీఎంకు తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. కాగా, ఇష్టం లేని కోర్సులో ఇమడలేకపోతున్నానని, ఇక చావే దిక్కు.. అని, చెల్లినైనా మంచి చదివించండంటూ రాసుకున్న సూసైడ్ నోట్ మృతురాలి లాకర్‌లో లభ్యమైంది. తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం..


అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణులు

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- జేఎన్ఎస్‌లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ప్రారంభం
- 33 జిల్లాల నుంచి 1400మంది అథ్లెట్లు హాజరు

వివరాలు : 7 లో..

నేడు కాళేశ్వరానికి బీఆర్ఎస్ నేతల రాక

- కన్నెపల్లి పంప్‌హౌస్ సందర్శన

మహదేవపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కన్నెపల్లి పంప్‌హౌస్‌ను బీఆర్ఎస్ ముఖ్య నేతలు సోమవారం సందర్శించనున్నారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వర్యంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్యేలు కోరికంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, వొడితెల సతీష్‌బాబు, సుంకె రవి శంకర్, భూపాలపల్లి జడ్పీ మాజీ చైర్‌పర్సన్ చైర్మన్ జక్కు శ్రీహర్షిణీ పర్యటించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి స్థితిగతులను పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. అనంతరం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మాట్లాడతారని సమాచారం.

నేడు జీడబ్ల్యూఎంసీలో ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతీ వారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు గ్రేటర్ మునిసిపల్ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆమె వెల్లడించారు.

177మంది బాలకార్మికులకు విముక్తి

- పకడ్బందీగా 'ఆపరేషన్ ముస్కాన్'
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ ముస్కాన్ 11వ విడతలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో వివిధ ప్రాంతాల్లో పని చేస్తోన్న 177 మంది కార్మికులకు విముక్తి కల్పించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూలై 1వ తేదీ నుంచి బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ లైన్, కార్మిక శాఖతో కలిసి హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాల్లో నిర్వహించిన తనిఖీల్లో బడి మానేసిన 149 మంది బాలలు, 28 మంది బాలికలను గుర్తించి బాలల సంరక్షణ గృహానికి తరలించామన్నారు. ఇందులో 97 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన చిన్నారులు ఉన్నట్లుగా గుర్తించామని, అనంతరం అందరిని వారి తల్లితండ్రులకు అప్పగించామన్నారు. చిన్నారులతో వెట్టిచాకిరీ చేయించుకునే యాజమానులపై బాలల న్యాయం చట్టం అనుసరించి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.50వేల జరిమానా విధిస్తామని సీపీ హెచ్చరించారు.

ఎమ్మెల్యే పదవికి కడియం రాజీనామా చేయాలి

మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ధర్మసాగర్, జూలై 3 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే పదవికి కడియం శ్రీహరి రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ధర్మసాగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు ఓ సంచలన నిర్ణయం అన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు 1985లో 52వ రాజ్యాంగ సవరణ చేసి షెడ్యూల్‌లో దీన్ని పొందు పర్చారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో కష్టపడి కడియం శ్రీహరిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే, తన కూతురు ఎంపీ సీటు కోసం కాంగ్రెస్ పార్టీకి కడియం అమ్ముడుపోయాడని విమర్శించారు. కడియంకు నైతిక విలువ ఉంటే బీఆర్ఎస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాజీనామా చేసే వరకు వెంటాడుతామని ఆయన చెప్పారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై మూడునెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్పీకర్ నిర్ణయం తీసుకోకుంటే కోర్టు ధిక్కారం కింద చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ మండల అధికార ప్రతినిధిగా ఎల్కతుర్తికి చెందిన బేరే మధుకర్‌ను, ధర్మసాగర్ గ్రామ కన్వీనర్‌గా బొడ్డు ప్రతాప్‌ను నియమించినట్లు రాజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రభుదాస్, సోమిరెడ్డి, మాజీ సర్పంచ్ రవీందర్, కమలేష్, మండల నాయకులు సుదర్శన్, విజయ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి పాలన అట్టర్‌ఫ్లాప్

- ఆయన సీఎం కావడం తెలంగాణ ప్రజల దురదృష్టం
- మంత్రులు, ఎమ్మెల్యే అందినకాడికి దోచేస్తున్నారు..
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి
- ఐనవోలులో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఐనవోలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తెలంగాణ ప్రజల దురదృష్టకరమని, ఆయన పాలన అట్టర్‌ఫ్లాప్ అయిందని, మాజీ మంత్రి, వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. ఐనవోలు మండల బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం, బీఆర్ఎస్ పార్టీలో చేరికలు, ఎంపీటీసీ క్లస్టర్ల సన్నాహక సమావేశం ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్లో మండల కన్వీనర్ తంపుల మోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని దయాకర్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ కోసం ఏ రోజు ఉద్యమించలేదన్నారు. తాను టీడీపీలో ఉన్నప్పుడు చంద్రబాబునాయుడు వద్ద 15 మంది ఎమ్మెల్యేలతో కలిసి కొట్లాడి తెలంగాణ కోసం తీర్మానం చేయించామన్నారు. మూడుసార్లు గెలిచిన రేవంత్‌రెడ్డి.. కుట్రలు, కుతంత్రాలు చేసి ముఖ్యమంత్రి అయ్యాడని అన్నారు. నిజాయితీని నమ్ముకున్న తాను ఏడు సార్లు గెలిచినా ఇలానే ఉండిపోయానన్నారు. తనపై ఎలాంటి అవినీతి, అక్రమ కేసులు లేవవన్నారు. రాష్ట్రంలో మార్పు మొదలైందని, 10 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు వస్తే వారి పరిస్థితి ఏమిటో తెలుస్తుందని, ఏ ఒక్క స్థానంలో కాంగ్రెస్ గెలువదని జోస్యం చెప్పారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు ఏం ముఖం పెట్టుకొని వస్తారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులను గ్రామాల్లో నిలదీయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఒకే ఒక సారి రైతు భరోసా నిధులు ఇచ్చిందని, రైతు రుణమాఫీ, సన్నవడ్లకు బోనస్, తులం బంగారం, మహాలక్ష్మి ద్వారా మహిళలకు నెలకు రూ.2500 రైతు కూలీలకు రూ.12 వేలు, ఆసరా పింఛన్లు రూ.4వేలు ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోయిందని

(మిగతా 8వ పేజీలో...)

విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

» పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : విశ్రాంత ఉద్యోగులు ఆర్యోగంపై శ్రద్ధ చూపాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘ కాలంగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్సై వీవీఎల్ఎన్.మూర్తి, హెడ్ కానిస్టేబుల్ జె.కేశవ్, కానిస్టేబుల్ ఎం.ఎల్లయ్య, నాలుగో తరగతి ఉద్యోగి కె.యాదయ్యలను సీపీ జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. మీ సేవలు నేటితరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు డీసీపీ శ్రీనివాస్, ఆర్ఐ సతీష్, ఆర్ఎస్సై శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

327 అసోసియేషన్ ట్రాన్స్‌కో యూనిట్ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

రాంనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(327) ట్రాన్స్‌కో యూనిట్ రాష్ట్ర కార్యవర్గాన్ని ఆదివారం హనుమకొండలోని పల్లా రవీందర్‌రెడ్డి భవన్‌లో రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. ట్రాన్స్‌కో అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయ మారియా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కళ్యాణ్ మురళి, ఎం.శ్రీనివాస్ యాదవ్, వైస్ ప్రెసిడెంట్స్‌గా ఈ.మధుకర్, టి.అశోక్, కె.శ్రీధర్, పి.మల్లేశ్, రాఘవేంద్ర, ఎ.రాజు సెక్రటరీగా ఆర్.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీస్‌గా టి.శ్రీనివాస్, మైస రాజు, శివ, ఇమ్మానియేల్, ఆర్గనైజేషన్ సెక్రటరీస్‌గా జి.రజిత, ఎం.రాజు, జె.శ్రీనివాస్, నీల రవికుమార్, షర్మిల, ట్రెజరర్‌గా సంగోజు రామకృష్ణ, ఆఫీస్ సెక్రటరీగా కవితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేశ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ చింతలపూడి సతీష్ పాల్గొన్నారు.

మేడారంలో భక్తుల సందడి



గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మల దేవస్థానంలో ఆదివారం భక్తుల కోలాహలం కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మేడారానికి తరలివచ్చి తల్లుల గద్దెలకు పూజలు చేశారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె సారె కొబ్బరికాయలు, ఎత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గద్దెల ప్రాంగణంలో గంటల పాటు సేద తీరుతూ కోరిన కోరికలు తీరాలని తల్లులను వేడుకున్నారు. అనంతరం దేవస్థానం సమీపంలోని దుకాణాల్లో వస్తువులు కొనుగోలు చేస్తూ సందడి చేశారు. పరిసరాల్లోని చెట్ల కింద బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు.

అమ్మపాలు అమృతం

వర్ధన్నపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మాతృత్వ స్పర్శకు ప్రతీ మహిళ పరితపిస్తుంది. పుట్టిన బిడ్డ ప్రేమను ఆస్వాదించాలని ఆరాట పడుతోంది. ఆ సమయంలో తల్లిపాలు పసికందుకు సంజీవనిలా పనిచేస్తుందని అనేకసార్లు వైద్య నిపుణులు నొక్కి చెప్పారు. అప్పుడే జన్మించిన శిశువుకు తల్లిపాలు అమృతంతో సమానం. అవి బిడ్డకు ఆరోగ్యంతో పాటు రోగనిరోధక శక్తిని, శరీర, మానసిక ఎదుగుదలకు తోడ్పడతాయి. ఇంత గొప్పతనం ఉన్న తల్లిపాలు ఉరుకుల, పరుగుల జీవనంలో బిడ్డకు అందడం లేదు. పాశ్చాత్య పోకడలకు పోయి స్వచ్ఛమైన అమ్మపాలను కొందరు ఆవిరి చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితులకు అడ్డుకట్ట వేసి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వైద్య సిబ్బంది కలిసి ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల ప్రాధాన్యం అనే అంశంతో వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. సంపూర్ణ ఆరోగ్యవంతులైన శిశువులే దేశానికి సంపద. అలాంటి శిశువులకు జన్మనివ్వాలంటే గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలి. గర్భిణి తీసుకునే ఆహారంతోనే గర్భంలోని శిశువు ఎదుగుతుంది. అందుకే గర్భిణి రోజూ సాధారణం కన్నా రెండింతలు సమతుల పోషకాహారం తీసుకోవాలి. లేకపోతే పుట్టబోయే బిడ్డ బలహీనంగా, బుద్ధి మాంద్యానికి, అనారోగ్యానికి గురయ్యే అవకాశముంది. తొలి ఆరు నెలలు శిశువుకు తల్లి పాలివ్వాలి. ఆ పాలు సంపూర్ణ ఆహారం, చనుపాల ఉత్పత్తి బిడ్డ పాలు తాగడంపై ఆధారపడి ఉంటుంది. తల్లి నుంచి బిడ్డ ఎంత ఎక్కువగా పాలు తాగగలిగితే అన్ని పాలు ఉత్పత్తి అవుతాయి. ఆరు నెలల వరకు తల్లి పాలు తాగడం వల్ల శిశు మరణాలు తగ్గుతాయి. పిల్లలు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారు. తల్లిపాలతో కలిగే ప్రయోజనాలపై అవగాహన లేకపోవడంతో ఇప్పటికీ కొంత మంది ముర్రుపాలు, తల్లిపాలు తాగించడం లేదని గుర్తించారు.

పుట్టిన గంటకు ఇచ్చే ముర్రుపాలతో సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాల ప్రాముఖ్యత..

- తల్లిపాలతో బిడ్డలకు అవసరమైన విటమిన్లు పుష్కలంగా అందుతాయి.
- తల్లిపాలు శిశువుకు తేలిగ్గా జీర్ణమవుతాయి. తల్లీబిడ్డల మధ్య బంధం పెంపొందుతుంది.
- తల్లిపాలు ఎలాంటి క్రిములు లేకుండా శుభ్రంగా ఉండటం వలన శిశువులు శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల బారిన పడకుండా ఉంటారు.
- బిడ్డ మానసిక, శారీరక వికాసానికి అవసరమైన పోషకాలు అందిస్తాయి.
- శిశువు ప్రేగులను శుభ్రం చేసి మొదటి మల విసర్జనకు తోడ్పడతాయి.
- ముర్రుపాలు ఇవ్వడం వలన బిడ్డకు వ్యాధులు దరిచేరవు.
- చనుబాలు ఇవ్వడం వల్ల గర్భదారణ తర్వాత రక్తస్రావ ప్రమాదం తగ్గి తల్లి త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఉంటారు.
- బిడ్డకు పాలు పట్టించడం వల్ల రొమ్ము, గర్భ క్యాన్సర్లు రావు.
- బిడ్డ మెదడుకు వికాసాన్ని ఇవ్వడంతో పాటు అంటువ్యాధులు, రక్తహీనత నుంచి కాపాడుతాయి.
- డయేరియా, న్యూమోనియా వంటి ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు. అలర్జీ, ఆస్తమా అంటువ్యాధులు దరిచేరవు.

తల్లికి కలిగే ప్రయోజనాలు..

- శరీరం సాధారణ ఆకృతికి వస్తుంది. రొమ్ము, అండాశయ క్యాన్సర్లు రావు.
- తల్లి గర్భసంచి సాధారణ స్థితికి రావడానికి తోడ్పడుతూ తల్లిని రక్తహీనత నుంచి కాపాడుతుంది.
- ప్రకృతి సిద్ధమైన కుటుంబ నియంత్రణ సాధనంగా ఉపయోగపడుతుంది.
- పాలు ఇవ్వడంలో తల్లికి ప్రశాంతత, సంతోషం లభిస్తుంది.
- బిడ్డను పెంచే క్రమంలో చక్కటి సర్దుబాటు మనస్తత్వం కలిగి ఉంటారు.

పాటించాల్సిన జాగ్రత్తలు..

- శిశువును పడుకోబెట్టి, నిలబెట్టి పాలు ఇవ్వకూడదు.
- రోజుకు 8 నుంచి 10 సార్లు శిశువుకు పాలు ఇవ్వాలి.
- ఆరు నెలల తర్వాత బిడ్డకు తల్లిపాలతో పాటు పోషక ఆహారం ఇవ్వాలి.
- రెండేళ్ల వరకు క్రమం తప్పకుండా బిడ్డకు పాలు ఇవ్వాల్సి ఉంటుంది.
- పాలు ఇచ్చే సమయంలో కెఫిన్ అధికంగా ఉండే పదార్థాలు, శీతలపానీయాలు తీసుకోకూడదు. ఇది బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది.
- పాలు, చేపలు, గుడ్లు వంటి పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం వలన తల్లి పాలు పుష్కలంగా వస్తాయి.
- ముర్రుపాలలో మాంసకృత్తులు, విటమన్-ఏ ఉంటాయి.
- తల్లికి, శిశువుకు జ్వరం వచ్చినప్పుడు, టీకాలు ఇచ్చినప్పుడు సైతం పాలు పట్టించవచ్చు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : గీసుగొండ మండలం గొర్రెకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2007-08 ఎస్ఎస్‌సీ బ్యాచ్ క్లాస్‌మేట్స్ ఫ్రెండ్‌షిప్ డే రోజు మృతి చెందిన తన మిత్రుడి కుటుంబానికి భరోసా నింపారు. ఇటీవల గొర్రెకుంటకు చెందిన కొల్లూరి సతీశ్ మృతి చెందడంతో ఆ కుటుంబానికి రూ.25వేల ఆర్థిక సహకారాన్ని అందించి అండగా నిలిచారు. కేయూ ఉద్యోగి పిండి వేణు నేతృత్వంలో క్లాస్‌మేట్స్ అందరిని సహకారంతో భరోసా నింపారు. ఈ కార్యక్రమంలో పల్లకొండ రాజశేఖర్, పోగాకు అర్జున్, కట్కూరి శ్రీకాంత్, మంద క్రాంతి, సతీశ్, అరుణ్, ఎ.రాజు, సాయికుమార్, మట్టెవాడ శివ పాల్గొన్నారు.

30 క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఓ మినీ ట్రక్‌లో అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల నల్లబెల్లంతోపాటు 5 క్వింటాళ్ల పటికను పట్టుకున్నట్లు ఎస్సై ఖాదర్‌పాషా ఆదివారం తెలిపారు. డోర్నకల్ మండలం ముల్కలపల్లి నుంచి తోడేళ్లగూడెం వైపు అశోక్ లేలాండ్ మినీట్రక్ వాహనంలో తరలిస్తుండగా తోడేళ్లగూడెం శివారు సబ్‌స్టేషన్ వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. బెల్లం, పట్టికను తరలిస్తున్న మినీట్రక్‌ను స్వాధీనం చేసుకుని తమిళనాడుకు చెందిన డ్రైవర్ ఎస్‌కె.రాజ్, మహబూబాబాద్‌కు చెందిన భూక్య సురేష్, తేజావత్ ఉదయ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

టీఎస్‌సీ-2025 పరిశోధన పత్రాల గడువు పొడిగింపు

కేయూ క్యాంపస్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఆగస్టు 19, 20, 21 తేదీల్లో కాకతీయ యూనివర్సిటీ వేదికగా నిర్వహిస్తున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సుకు పరిశోధన పత్రాల అబ్‌స్ట్రాక్ట్‌లను పంపుకునే గడువును ఆగస్టు 5 వరకు పొడగించినట్లు సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి వెల్లడించారు. ఇతర వివరాలకు ఫిజిక్స్ విభాగంలో సంప్రదించాలని వెల్లడించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తుల గడువు 18

కేయూ క్యాంపస్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ నేతృత్వంలో టెన్త్, ఇంటర్ చదువుకునేందుకు ఎలాంటి విద్యార్హతలు లేకున్నా.. దరఖాస్తులు చేసుకోవాలని వరంగల్ క్రిష్టియన్ కాలనీ యూనిక్ స్కూల్ ఎ1 కోఆర్డినేటర్ సమీ ఉల్లబేగ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆగస్టు 18 వరకు దరఖాస్తులకు గడువుందని పేర్కొన్నారు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ మీడియంలో కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. టెన్త్, ఇంటర్ మధ్యలో అపేసిన వారు వన్ సిట్టింగ్‌లో కోర్సులు పూర్తి చేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తామని వివరించారు. ఓపెన్‌లో ఉత్తీర్ణత సాధించిన వారందరూ ఉన్నత చదవులు, ప్రభుత్వ ఉద్యోగాలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సెల్ 73961-35390 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సందడిగా జిల్లా స్థాయి చెస్ టోర్నీ



చెస్ పోటీల్లో తలపడుతున్న చిన్నారులు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి చెస్ పోటీలు ఆదివారం సందడిగా ప్రారంభమయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో ఓపెన్ టు ఆల్ విభాగంలో నిర్వహించిన చెస్ పోటీల్లో 50మంది బాలబాలికలు పాల్గొన్నారని క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్న తెలిపారు. రెండు రోజుల నిర్వహణలో భాగంగా తొలిరోజు నిర్వహించిన మొదటి మూడు రౌండ్ల ముగిసేసరికి షేక్ రియాజ్, అభినవ్ సాయి, యశ్వంత్, రామ రిషిత్‌కుమార్ ముందజంలో ఉన్నట్లు కన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్లు, సీనియక్ క్రీడాకారులు పాల్గొన్నారు.

వరంగల్‌కు వచ్చినప్పుడు రుద్రేశ్వరుడిని దర్శించుకుంటా..

● రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా



ఆలయంలో అర్చకులచే ఆశీర్వచనం అందుకుంటున్న సౌమ్యమిశ్రా

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వరంగల్ నగరానికి ఎప్పుడు వచ్చినా వేయిస్తంభాల రుద్రేశ్వరాలయాన్ని దర్శించుకుంటానని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా అన్నారు. పోలీస్ అధికారిగా వరంగల్‌లో పని చేసినప్పుడు పలుమార్లు రుద్రేశ్వరుడిని దర్శించుకొని అభిషేకించుకోవడం వల్ల మానసిక ప్రశాంతత ఏర్పడేదన్నారు. పోలీస్ స్పోర్ట్స్ మీట్ సందర్భంగా నగరానికి చేరుకున్న రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా ఆదివారం ఉదయం వేయిస్తంభాల రుద్రేశ్వరాలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో ఆలయ ఈవో అనిల్‌కుమార్ అపూర్వంగా స్వాగతించారు.రుద్రేశ్వరాలయంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహింపజేసి మారేడు దళార్చన చేయించారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో స్వామి వారి తీర్థ ప్రసాదాలు డీజీపీ సౌమ్య మిశ్రాకు అందజేసి వేద ఆశీర్వచనం, శేష వస్త్రాలు బహూకరించారు.

ఉన్న రోడ్డును తీశారు.. కొత్త రోడ్డును మరిచారు!

● కంకరపోసి సంవత్సరం దాటినా వేయని బీటీ

● అవస్థలు పడుతున్న ప్రయాణికులు, విద్యార్థులు



గీసుగొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): టెక్స్‌టైల్ పార్కుకు బైపాస్ డబుల్ రోడ్డు అంటూ... ఉన్న సింగిల్ రోడ్డును తొలగించారు. డబుల్ రోడ్డును వేయడం మరిచారు. మొదట్లో రోడ్డు మెటల్‌రోడ్డు పనులు చురుకుగా సాగినా బీటీరోడ్డు వేయటంలో అలసత్వం వహించారు. కంకరపోసి చదునుచేసి వదిలి వేశారు. దీంతో కంకర తేలి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పతున్నారు. యేడాది కిందట స్థభంపల్లి నుంచి శాయంపేట కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కు వరకు 6కి.మీ.ల మేర రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. అయితే యేడాది దాటినా పనులు పూర్తి కాకపోవడంతో ఆ దారి గుండా వెళ్లే ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నట్లువాపోతున్నారు. ఈదారిగుండానే సంగెం, శాయంపేట, వంచనగిరి, రాయనికుంట ప్రజలు నిత్యం వరంగల్‌కు వెళుతుంటారు. కంకరతేలి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డు గుండా స్థంభంపల్లి, ఖిలా వరంగల్, వసంతాపూర్, జాన్‌పాకల నుంచి విద్యార్థులు వంచనగిరిలోని మోడల్ స్కూల్‌కు వందల మంది ప్రతి రోజు వస్తుంటారు. ఈ దారిగుండా విద్యార్థులు సైకిళ్లమీద వెళ్లే సమయంలో పక్కన వాహనాలు వచ్చి కంకర రాళ్లు వచ్చి తాకుతున్నట్లు చెపుతున్నారు. ఇదిలా ఉంటే వంచనగిరి నుంచి వరంగల్- నర్సంపేట రోడ్డు కోటగండి వద్దకు వెళ్లే మార్గంలో రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టి రెండేళ్లు దాటినా పూర్తి కాలేదు. దీంతో కస్తూర్బా బాలికా విద్యాలయానికి, మోడల్ స్కూల్‌కు వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నట్లు చెపుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు, బ్రిడ్జి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా పద్మశాలి వధూవరుల వివాహ పరిచయ వేదిక



కార్యక్రమంలో మాట్లాడుతున్న పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

హనుమకొండ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో 9వ రాష్ట్ర స్థాయి పద్మశాలి వధూవరుల వివాహ పరిచయ వేదిక ఆదివారం విజయవంతంగా జరిగింది. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని వరంగల్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోసుమారు 400మంది వధూవరులు, వారి తల్లిదండ్రులు, పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగులసంఘం జిల్లా అధ్యక్షుడు కోడం రవి ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన ఈ పరిచయ వేదిక కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పద్మశాలి వధూవరుల వివాహ సంబంధాలు కుదుర్చుకోవడంలో పడుతున్న ఇబ్బందులను, మధ్యవర్తి మోసాలను గుర్తించి కులబాంధవుల సౌకర్యార్థం యేటా ఈ వధూవరుల పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వధూవరుల తల్లిదండ్రులు వధూవరుల పూర్తి వివరాలతో పాటు వారికి కావలసిన అర్హతలు కూడా వివరించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండబత్తుల రాజమౌళి, పిట్ట ఉమాదేవి, దేవులపల్లి సాయిరాజ్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సభ్యులు చిందం లింగమూర్తి, బూర తిరుపతయ్య, కుడికాల సత్యనారాయణ, కందగట్ల ప్రసాద్, గోరంట్ల అశోక్, ఆడెపు నాగరాజు, ముల్కా శ్రీనివాస్, సిరిపురం శేఖర్, కోదారి రమేష్, కొండా శ్రీనివాస్, మాచెర్ల శివప్రసాద్, బూర్ల క్రిష్ణప్రసాద్, సామల జోగేందర్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పొన్నం మల్లయ్య, పెద్దపల్లి నుంచి కొలిపాక నగేష్ తదితరులు పాల్గొన్నారు.

6న కేయూ జర్నలిజం విద్యార్థులకు అవగాహన సదస్సు

కేయూ క్యాంపస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 6న బుధవారం కేయూ జర్నలిజం విభాగం విద్యార్థులకు బీబీసీ తెలుగు ఔట్‌రిచ్ ప్రత్యేక ఇంట్రాక్షన్ సెషన్‌ను నిర్వహిస్తున్నట్లు కేయూ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు కేయూ దూరవిద్య కేంద్రం న్యూ సెమినార్ హాల్‌లో సదస్సు జరుగుతుందని వెల్లడించారు. బీబీసీ భారతీయ భాషల కార్యకలపాలు, కలెక్టివ్ న్యూస్ రూమ్ (సీఎస్ఆర్) సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుంది. జర్నలిజం విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలు, ఇంటర్నషిప్ అవకాశాలపై విలువైన సమాచారం ఇవ్వనుంది. బీబీసీతెలుగు ప్రతినిధులు పాల్గొని జర్నలిజం రంగంలో తాజా పరిణామాలు, విద్యార్థులకు వృత్తి అవకాశాలు, శిక్షణ అంశాలను వెల్లడిస్తారు. జర్నలిజం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

బొగత వద్ద కోలాహలం



ఈత కొలనులో జలకాలాడుతున్న పర్యాటకులు

వాజేడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నయాగరా బొగత జలపాతం ఆదివారం జనసంద్రమైంది. వారాంతపు సెలవు కావడంతో సందర్శకులు భారీగా తరలివచ్చారు. జలపాతం పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. హైదరబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, భద్రాచలం, ములుగు, జనగాం తదితర పట్టణాల నుంచి సందర్శకులు తరలివచ్చి జలపాతం అందాలను వీక్షించి మురిసిపోయారు. జలపాతం వద్ద ఉన్న ఈత కొలను జలకాలాడుతూ సందడి చేశారు. 3వేల మందికి పైగా సందర్శకులు వచ్చారు. ఈఏడాది ఇంత భారీ స్థాయిలో పర్యాటకులు తరలిరావడం ఇదే ప్రథమం. పర్యాటకుల వాహనాలతో పార్కింగ్ ప్రదేశం నిండిపోయింది.

1979 పూర్వ కానిస్టేబుళ్ల అపూర్వ సమ్మేళనం



1979 పూర్వ కానిస్టేబుళ్ల అపూర్వ కలయిక

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా 1979 కానిస్టేబుళ్ల అపూర్వ కలయిక ఆదివారం హనుమకొండలో జరిగింది. పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు సీఐలుగా, ఎస్ఐలుగా, ఏఎస్ఐలుగా, హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతులు పొంది ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత మాజీ కానిస్టేబుళ్లు 46ఏళ్ల తర్వాత కలిసి ఆత్మీయతను పంచుకున్నారు. బ్యాచ్‌లో 20 మంది కానిస్టేబుళ్లు కాగా, అనారోగ్యంతో 7గురు మరిణించారు. మిగతా 22 మందిలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లుగా, ఇద్దరు 13 మంది ఎస్ఐలుగా, 14 మంది ఏఎస్ఐలుగా, హెడ్‌కానిస్టేబుళ్లుగా ఉద్యోగ విరమణ చేశారు. కాగా, ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళ కార్యక్రమంలో బ్యాచ్‌మేట్స్ కలిసి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ బ్యాచ్‌కి చెందిన రాధాపు సంజీవరెడ్డి ప్రస్తుతం రాష్ట్ర పోలీసు సంఘంలో ఉపాధ్యక్షుడిగా కొనసాగుతూ పోలీసు హక్కుల కోసం కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. విశ్రాంత పోలీసు అధికారులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం అందరినీ శాలువా, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఇన్‌స్పెక్టర్లు ఆంజనేయులు, నర్సింహారెడ్డితో పాటు విశ్రాంత పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డి, మల్లిఖార్జున్, నర్సయ్యలతో పాటు విశ్రాంత పోలీసు అధికారులు పాల్గొన్నారు.

డీడీఎన్ ఎవరికో!?

హనుమకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో నిత్య ధూప, దీప నైవేద్యం (డీడీఎన్) పథకం కోసం దేవాదాయ, ధర్మాదాయ శాఖకు వచ్చిన దరఖాస్తులు ఒక కొలిక్కివచ్చాయి. ఆ శాఖ అధికారులు వాటిని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ మే 24తో ముగిసింది. అర్హత సాధించిన వారి దరఖాస్తులను వెంటనే కంప్యూటరీకరణ చేశారు. అర్హమైనవిగా భావించిన దరఖాస్తుల జాబితాను దేవాదాయ శాఖ కమిషనర్‌కు పంపించారు. డీడీఎన్ కోసం వచ్చిన మొత్తం 282 దరఖాస్తుల్లో 110 అర్హమైనవిగా తేల్చారు. ప్రస్తుతం ఇవి కమిషనర్ పరిశీలనలో ఉన్నాయి. వీటిలో ఎన్ని ఎంపిక అవుతాయనేది త్వరలోనే తేలనున్నది. దసరా నాటికి ఎంపిక ప్రక్రియ పూర్తిచేసి డీడీఎన్ కిందకు వచ్చే గుళ్ల జాబితాను ప్రకటించ వచ్చునని తెలుస్తోంది.



- దేవాలయాల దరఖాస్తుల పరిశీలన పూర్తి
- ప్రత్యేక కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలన
- 110 దరఖాస్తులు అర్హమైనవిగా గుర్తింపు
- త్వరలో ఎంపికైన ఆలయాల జాబితా ప్రకటన
- దసరా నాటికి ఈ గుళ్లలో ధూప, దీప, నైవేద్యం

క్షేత్రస్థాయిలో పరిశీలన

రాష్ట్ర దేవాదాయ శాఖ డీడీఎన్ పథకానికి సంబంధించి ఎంపిక చేసే గుడుల అర్హతలు పక్కాగా ఉండాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. ఆలయానికి 15 ఏళ్ల చరిత్ర ఉండాలి. ప్రాచీన దేవాలయాలకు తొలి ప్రాధాన్యం కల్పిస్తారు. దేవాదాయ శాఖలో ఆలయం నమోదై ఉండాలి. దేవాలయాలకు ఎలాంటి ఆస్తులు ఉండకూడదు. దరఖాస్తుదారుడు 18-65 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలి. పూజారికి మంత్రోచ్చరణలతో కూడిన పూజా విధానం సంపూర్ణంగా, ఆగమశాస్త్రం ప్రకారం తెలిసి ఉండాలి. కేవలం జాతర సమయాల్లో తెలిచే ఆలయాలకు ఈ పథకం వర్తించదు. ఒక అర్చకుడికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఒకే ప్రాంగణంలో ఉన్న ఉప, అనుబంధ ఆలయాలకు ఈ పథకం వర్తించదు.

చిన్న దేవాలయాల్లో..

గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో ఎలాంటి ఆదరణకు నోచుకోని చిన్న దేవాలయాల్లో ప్రతీ రోజు ధూప, దీప, నైవేద్యం నిర్వహించేందుకు డీడీఎన్ పథకం కోసం దేవాదాయ, ధర్మాదాయ శాఖ అర్చకుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. జిల్లా కేంద్రంలోని దేవాదాయ, ధర్మదాయ సహాయ కమిషనరు కార్యాలయానికి ఉమ్మడి జిల్లా నుంచి 282 దరఖాస్తులు వచ్చాయి. వాటిని నియోజకవర్గాల వారీగా విభజించేందుకు సిబ్బంది నెలంతా కసరత్తు చేశారు. ఇందులో అర్హత ఉన్నవి 110గా తేల్చారు.

కమిటీ ద్వారా తనిఖీ

దరఖాస్తులను ప్రభుత్వం నియమించిన జిల్లాస్థాయి కమిటీ పరిశీలించింది. అదనపు కలెక్టర్ చైర్మన్ కాగా, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌తో పాటు జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో పని చేసే ఇద్దరు అర్చకులు, ఇప్పటికే డీడీఎన్ పథకం కింద పని చేస్తున్న గుడి అర్చకుడు ఒకరు సభ్యులుగా ఉన్న ఈ కమిటీ అర్హత సాధించిన దరఖాస్తుల తాలూకు గుళ్లను క్షేత్రస్థాయికి వెళ్లి తనిఖీ చేసింది. జీపీఎస్ లొకేషన్ ఫొటోలు తీసుకున్నారు. వాటి ప్రతిపాదనలు రాష్ట్ర అధికారులకు పంపించారు. డీడీఎన్ పథకంలోని ఆలయాల తుది జాబితా రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచే వెల్లడవుతుందని దేవాదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత తెలిపారు.

జోరుగా పైరవీలు

ధూప, దీప, నైవేద్యం పథకం కోసం జోరుగా పైరవీలు నడుస్తున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు తాము అనుకున్న ఆలయాలను ఈ పథకంలో ఎంపికచేయాలని దేవాదాయశాఖ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఆయా ప్రజాప్రతినిధులు లేఖలను దరఖాస్తులకు జతచేసి పంపించినట్టు సమాచారం. ప్రస్తుతం ఆయా గుళ్ల పూజారులు హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎలాగైనా తమ గుడిని డీడీఎన్ పథకంలో చేర్చాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు మాత్రం నిబంధనల మేరకే డీడీఎన్ పథకంలో ఆలయాలను ఎంపిక చేస్తామని చెబుతున్నారు. దరఖాస్తులు అధికంగా రావడంతో మరిన్ని ఆలయాలకు అవకాశం కల్పించాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు దేవాదాయశాఖ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

గౌరవ వేతనం ఇలా..

ఆదాయం తక్కువ ఉన్న ఆలయాల్లో నిత్యం దీపం వెలగాలని 2007లో ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ధూప, దీప, నైవేద్యం పథకం ప్రారంభమైంది. తొలుత ఒక్కో ఆలయానికి రూ.2500 కేటాయించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రూ.6వేలు, ఆ తర్వాత రూ.10వేలకు పెంచారు. ఇందులో పూజారుల గౌరవ వేతం రూ.6వేలు, పూజా సామగ్రికి రూ.4వేలు.

పరీక్షగా మారిన ఎంపిక

రాష్ట్రవ్యాప్తంగా 250 ఆలయాలకు ఈ పథకంలో ఎంపిక చేయనుండగా ఇందు కోసం దరఖాస్తులు భారీ సంఖ్యలో వచ్చాయి. ఆలయాలు తక్కువగా ఉండడం, దరఖాస్తులు ఎక్కువగా రావడంతో ఆలయాల ఎంపిక అధికారులకు పెద్ద పరీక్షగా మారింది. ఒక్కో ఉమ్మడి జిల్లాలో 20 ఆలయాల చొప్పున మాత్రమే ఈ పథకంలో ఎంపికయ్యే అవకాశం ఉంది. అర్బన్ నియోజకవర్గాలను మినహాయిస్తే జిల్లాలో 10 గ్రామీణ నియోజకవర్గాల్లో రెండేసి చొప్పున ఎంపిక కావచ్చునని తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో..

ధూప, దీప, నైవేద్యానికి నోచుకోని దేవాలయాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో మరో 180 వరకు ఉన్నట్టు దేవాదాయ శాఖ గుర్తించింది. ధూప, దీప, నైవేద్యం పథకం కింద తాజాగా దాఖలైన దరఖాస్తుల్లో అర్హమైనవిగా గుర్తించి 110 దేవాలయాలు వీటిలో ఉన్నా యి. డీడీఎన్ పథకం కింద వీటిలో ఎన్ని ఎంపికవతాయనేదాని మీద చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 450 గుళ్లలకు ధూప, దీప, నైవేద్యం పథకం వర్తిస్తోంది. గతంలో రెండు విడతలుగా వీటిని ఎంపిక చేశారు. ఈ గుళ్లలో నిత్య ధూప, దీప, నైవేద్యం జరుగుతోంది. కొత్త వాటి ఎంపికతో త్వరలోనే మరికొన్ని ఆలయాలకు డీడీఎన్ వర్తించనున్నది. తరతరాలుగా వస్తున్న ఆచారాలు, సంప్రదాయాలు కొనసాగాలంటే దేవాలయాలు సక్రమంగా నిర్వహించాలి. ఈ నేపథ్యంలో దేవాదాయశాఖ తీసుకున్న చర్యతో ఎంతోమందికి ఊరట నిచ్చే అంశం. గ్రామీణప్రాంతాల్లో ఆదాయం లేకున్నా చిన్న దేవాలయాలను అనువంశిక అర్చకులు, లేదా స్థానికంగా ఉన్న పూజారులు సొంత డబ్బుతోనే లేక దాతలు ఇచ్చే దానాలతో పూజలు నిర్వహిస్తున్నారు.

వినూత్న ఆవిష్కరణల వేదిక తేజస్

- ఈ మిషన్ సృష్టికర్త పదిహేనేళ్ల అనిరుధ్
- ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి
- ముగ్ధులైన నవీన్ నికోలస్, యోగితారాణా
- వరంగల్ జిల్లాలో అమలుకు అనుమతి



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేంనరేందర్‌కు తేజస్ మిషన్ ప్రతిని అందజేస్తున్న విద్యార్థి అనిరుధ్

హనుమకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పదిహేనేళ్ల యువ ప్రతిభావంతుడు గుండు అనిరుధ్ రూపకల్పన చేసిన తెలంగాణ జ్ఞాన అవిష్కరణ సంకల్పం (తేజస్) మిషన్ వరంగల్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుకు ఎంపికైంది. ప్రభుత్వ పాఠశాలలు వేదికగా విద్యార్థుల సర్వతోముఖ వికాసం లక్ష్యంగా రూపొందించిన ఈ మిషన్ పైలెట్ ప్రోగ్రామ్ వర్చువల్ టింకరింగ్ ల్యాబ్ (వీటీఎల్) ద్వారా సాంకేతికతతో కూడిన నూతన ఆవిష్కరణల కోసం ఉద్దేశించిది కావడం విశేషం. అనిరుధ్ రూపొందించిన ఈ ప్రాజెక్టును ఎంఎల్‌సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పాఠశాల విద్యా డైరెక్టర్ నవీన్ నికోలస్, ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణా దృష్టికి తీసుకువెళ్లారు. నికోలస్ ఈ ప్రాజెక్టుకు ముగ్ధుడయ్యారు. సాంకేతిక నిపుణుల బృందంతో ఈ మిషన్‌ను అధ్యయనం చేయించారు. ఇది అమలైతే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని భావించారు. తేజస్‌ను రాష్ట్రవ్యాప్తంగా ఆచరణలో పెట్టే ముందు వరంగల్ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు అనుమతిచ్చారు. సమగ్ర శిక్ష కార్యాలయం నుంచి ఈ మేరకు అధికారికంగా ప్రొసీడింగ్ విడుదలైంది. దీంతో వరంగల్ జిల్లాలో 800లకుపైగా ప్రభుత్వ పాఠశాలల్లో జేజస్ మిషన్ త్వరలో అమలులోకి రానున్నది.

చిన్నవయసులోనే..

అనిరుధ్ ప్రస్తుతం పెద్దపెండ్యాలలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 11వ తరగతి (సీబీఎస్) చదువుతున్నాడు. తండ్రి గుండు రమేష్ ఖిలా వరంగల్ మండలం స్తంభంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు, తల్లి స్రవంతి గృహిణి. పాఠశాల స్థాయిలో విద్యారంగంలో సరికొత్త ఆవిష్కరణలను తీసుకువచ్చే లక్ష్యంతో ఏడాదిపాటు శ్రమించి తెలంగాణ జ్ఞాన ఆవిష్కరణ సంకల్పం (తేజస్) మిషన్‌కు రూపకల్పన చేశాడు. మిషన్ ఇప్పటికే పలువురు విద్యావేత్తల ప్రశంసలు పొందింది.

ప్రాజెక్టు లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల తరగతి గదులను భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనే ఇన్నోవేషన్ హబ్‌లుగా తీర్చిదిద్దడం, విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం, ఆవిష్కరణాత్మకత, స్వతంత్ర ఆలోచానాపరులుగా ఎదగడానికి వారిలో 21 శతాబ్దపు నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, గ్రామీణ పాఠశాలల్లో స్థానిక సమస్యలపై విద్యార్థుల తమ సొంత ఆలోచనలతో నవీన పరిష్కారాలు కనుగోనేలా ప్రేరేపించడం, విద్యార్థులు 21వ శతాబ్దపు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ ముందుకు సాగేలా ప్రోత్సహించడం ఈ ప్రాజెక్టు లక్ష్యాలు.

వినూత్న ఆవిష్కరణలకు ప్రేరణ : అనిరుధ్

ఈ మిషన్ ద్వారా విద్య అనుభవాత్మకం, బోధనాత్మకం, ఆవిష్కరణాత్మకంగా మారుతుంది. విద్యార్థులు విజ్ఞానంతో ఆవిష్కరణల సామర్థ్యాన్ని అలవర్చుకుంటారు. వినూత్న ప్రాజెక్టు వికసిత్ భారత్-20247, తెలంగాణ రైజింగ్-2047 వంటి దృఢమైన లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర విద్యారంగాన్ని కొత్త దిశగా నడిపించేందుకు బలమైన పునాది వేస్తుంది. కేంద్రం రాష్ట్రంలో 900 పాఠశాలల్లోనే అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఏటీఎల్) ఏర్పాటు చేసింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా 30వేల ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఏటీఎల్ లేని మిగతా పాఠశాలల పరిస్థితి ఏమిటీ? ఈ లోటును పూడ్చడానికే ఈ తేజస్ మిషన్‌ను తీసుకువచ్చాను. అందుబాటులో ఉన్న వనరులను వాడుకోవడం ద్వారా అటల్ టింకరింగ్ మిషన్ ఎకోసిస్టమ్‌నే రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో అమలు చేయాలన్నదే ఈ మిషన్ లక్ష్యం.



డీఆర్ఎంకు వినతిపత్రం ఇస్తున్న దేవులపల్లి రాఘవేందర్

కాజీపేట రైల్వే స్టేషన్ తనిఖీ

కాజీపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్‌లో ఆదివారం సాయంత్రం డీఆర్ఎం ఆర్.గోపాల్‌కృష్ణన్ తనిఖీ చేశారు. క్రూలాబీ, రన్నింగ్ రూమ్‌లు తనిఖీ చేశారు. రైల్వే ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైల్వే కమ్యూనిటీ హాల్‌లో బ్యాడ్మింటన్, టెన్నిస్ కోర్టును ప్రారంభించారు. రైల్వే జనరల్ ఇన్స్టిట్యూట్ దేవులపల్లి రాఘవేందర్ రైల్వే ఇన్స్టిట్యూట్ అభివృద్ధి పనులపై వినతిపత్రాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు, కార్మిక, నాయకులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యులపై కేసులు నమోదు

నెక్కొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : నెక్కొండలో ఎలాంటి అర్హతలు లేని ముగ్గురు వ్యక్తులు ఆదర్శ వైద్యులమని చెప్పుకుంటూ వైద్య సేవలను అందిస్తున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ వి.నరేశ్‌కుమార్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఎలాంటి అర్హతలు లేకుండా ఆదర్శ వైద్యులమని చెప్పుకుంటూ రిజిష్టర్డ్ వైద్యుల వలే అల్లోపతి వైద్యం నిర్వహిస్తున్న ముగ్గురు నకిలీ వైద్యులను గత నెలలో నెక్కొండలో జరిగిన తనిఖీల్లో గుర్తించిన తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్యకుమార్, చైర్మన్ డాక్టర్ కె.మహేష్‌కుమార్‌ల ఫిర్యాదు మేరకు నెక్కొండ పోలీస్ స్టేషన్‌లో 2025 ఆగస్టు 2వ తేదీన కేసు నమోదు చేశారన్నారు. నెక్కొండలోని లావణ్య ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు రమేష్, రుద్ర ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహకుడు రవి, అమ్మ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వకుడు అశోక్‌లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం..

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- జేఎన్ఎస్‌లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ప్రారంభం
- 33 జిల్లాల నుంచి 1400 మంది అథ్లెట్లు హాజరు



స్టాటర్ పేల్చి పరుగు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని సింథటిక్‌ట్రాక్‌పై 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్, మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో పాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ... నగరంలో అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియంతో పాటు స్పోర్ట్స్ పాఠశాల కావాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకపోగా వెంటనే ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులకు స్పోర్ట్స్ పాఠశాలలో అడ్మిషన్లు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు కలిగిన క్రికెట్ స్టేడియం నగరంలో త్వరలో నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 15న జేఎన్ఎస్‌లో తాత్కలికంగా స్పోర్ట్స్ పాఠశాలలో 4వ తరగతిలో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించడంతో పాటు పాఠశాల నిర్వహణ కోసం కొంతమంది సిబ్బందిని కేటాయించడానికి కసరత్తులు చేపట్టామన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలతో పాటు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చన్నారు. జిల్లా క్రీడా అధికారి ప్రతీరోజు స్టేడియాన్ని సందర్శించి స్టేడియంలో పేరుకుపోయిన సమస్యలు, క్రీడాకారులకు కావాల్సిన వసతులను సమకూర్చడంతో పాటు ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకరావలని ఆదేశించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు చారిత్రాత్మక ఓరుగల్లు నగరంలోని సుప్రసిద్ధ దేవాలయాలు, కట్టడాలను తిలకించాలని ఎమ్మెల్యే నాయిని కోరారు.

విశిష్ట అతిథి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. పట్టుదల, క్రమశిక్షణతో క్రీడల్లో సాధన చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరవచ్చన్నారు. నేటి యువత స్మార్ట్ ఫోన్‌లకు అలవాటు పడి మైదానాలను మరిచిపోతున్నారని, వారిని మైదానాలకు పంపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉందన్నారు. తన చిన్నతనంలో మైదానంలో సాధన చేసిన సందర్భంలో కాళ్లకు షూస్ కూడా లేవన్నారు. ఎన్నో కష్టాలను ఎదుర్కొని అహర్నిశలు శ్రమించి క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాలో పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వతహాగా క్రీడాకారులు కావడం, క్రీడాకారుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి యంగ్ ఇండియా పేరుతో ప్రోత్సాహకాలు అదిస్తున్నారన్నారు. హైదరాబాద్ క్రికెటర్ సిరాజ్, అంతర్జాతీయ బాక్సర్ నిఖత్‌జరీన్, ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పారా ఒలంపియన్ జీవాంజి దీప్తీల ప్రతిభను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి వారికి నగదు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ఇళ్ల స్థాలాలు అందించారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో ఒలంపిక్స్ క్రీడలు నిర్వహించే స్థాయిలో సీఎం రేవంత్‌రెడ్డి క్రీడలను ప్రోత్సహిస్తున్నారన్నారు. నేడు కొంత మంది యువత సెల్‌ఫోన్‌లకు అలవాటు కావడంతో పాటు డ్రగ్స్, ఇతర చెడు వ్యసనాలకు బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కావాలని, దానికి యువత సహకారం ఎంతో ఉందన్నారు. స్వతహాగా హాకీ క్రీడాకారుడిని అయినప్పటికీ నేటికి నగరంలో హాకీ మైదానం అందుబాటులేక పోవడం బాధాకరంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో నగరంలో హాకీ కోర్టు ఏర్పాటుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకరించాలని ఎమ్మెల్యే నాగరాజు కోరారు.



పరుగు పందెంలో పోటీ పడుతున్న అథ్లెట్లు

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు జేఎన్ఎస్ వేదికగా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 33జిల్లాలతో పాటు 10స్పోర్ట్స్ పాఠశాలలకు చెందిన దాదాపు 1400మంది అథ్లెట్లు, 50మంది టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు పాల్గొన్నరన్నారు. అండర్-14, 16, 18, 20, మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో తొలిరోజు జేఎన్ఎస్‌లోని సింథటిక్‌ట్రాక్‌పై జంప్స్, త్రోస్, రన్స్‌లో క్రీడలు నిర్వహించమన్నారు. కాగా, జేఎఎన్ క్రీడా మైదానానికి సమీపంలోని పాత్‌ఫైండర్ పాఠశాలలో అథ్లెట్లకు బస, స్టేడియంలో భోజనాలను ఏర్పాటు చేశామన్నారు. జూనియర్స్ బాలబాలికల విభాగంలో ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అథ్లెట్లు సెప్టెంబర్ 9నుంచి 12 వరకు పాండిచ్చేరిలో నిర్వహించనున్న సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. అదేవిధంగా మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ విభాగంలో ఆగస్టు 20నుంచి 24 వరకు చెన్నైలో నిర్వహించనున్న అంతర్ రాష్ట్రాల అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని సారంగపాణి అన్నారు. కాగా, తొలి రోజు వివిధ జిల్లాల నుంచి వచ్చిన అథ్లెట్ల మధ్య నిర్వహించిన జంప్స్, త్రోస్, రన్స్‌లో పోటాపోటీగా గెలుపు లక్ష్యంగా చిరుతల్లా దూసుకుపోయారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో అశోక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమన్నారాయణ, దిమ్మిక నాగరాజు, పీడీలు మనోజ్ కుమార్, వాసు, రజినికాంత్, వివిధ జిల్లాలకు చెందిన అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

దాశరథి కవితా స్ఫూర్తిని తెలియజేయాలి

- తెలుగు భాషపై మమకారాన్ని పెంచాలి
- ప్రముఖ కవి దేశపతి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న దేశపతి శ్రీనివాస్

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ఆస్థాన కవిగా విశేష సేవలందించి అపూర్వ సాహిత్య సృజన చేసి తన కవితాస్త్రంతో నిజాం రాజును ఎదురించిన దాశరథి కవితాస్ఫూర్తి నేటి విద్యార్థుల్లో నింపాలని, తద్వారా తెలుగు భాషపై మమకారాన్ని పెంపొందింపజేయాలని శాసనమండలి సభ్యుడు, ప్రముఖ కవి దేశపతి శ్రీనివాస్ అన్నారు. హనుమకొండలోని సాయిబాబా ఆలయ ఆడిటోరియంలో రాధాకృష్ణ సాహితీ వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన పద్య పఠనా పోటీల బహుమతులు, దాశరథి శతజయంతి వేడుకల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. సాహితీ వేదిక అధ్యక్షుడు, రాష్ట్ర తెలుగుభాష ఉపాధ్యాయ సంఘం నాయకులు చక్రవర్తుల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ కలాలనే కత్తులుగా మలుచుకొని ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన మహాకవి దాశరథి అని, ఆయన కలం నుంచి జాలువారిన సినీ సాహిత్యం కూడా ఎంతో అద్భుతమని కొనియాడారు. ఆయన జీవితంలోని అపూర్వ ఘట్టాలు సాహిత్య సృజన, ధిక్కార స్వరం ఆయన సాహిత్య సొబగులు ఈ తరం విద్యార్థులకు నేర్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విద్యార్థుల్లో సాహిత్యం పట్ల ముఖ్యంగా పద్యాలపట్ల ఆసక్తి పెంచేందుకు పోటీలు నిర్వహిస్తూ కార్యక్రమాలు నిర్వహించిన రాధాకృష్ణ సాహితీ వేదిక నిర్వాహకులను అభినందించారు.

చక్రవర్తుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలుగు భాష ఉపాధ్యాయుడిగా విద్యార్థులలో భాష పట్ల అవగాహన, ధైర్యం, ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దాశరథి శతజయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో అత్యధిక పద్యాలు చదివిన పర్వతగిరి విద్యార్థిని డి.దేవి ప్రథమ, వరంగల్ క్రిష్టాకాలనీకి చెందిన గురుసూర్యచంద్‌కు ద్వితీయ, వర్ధన్నపేట ఇల్లంద కేజీబీవీకి చెందిన ఇ.శరణ్యకు తృతీయ బహుమతిగా, వారికి చదువులకు అవసరమయ్యేలా నగదు బహుమతులు అందజేశామన్నారు. గీసుగొండకు చెందిన అక్షిత, నెక్కొండకు చెందిన అక్షిత, దుగ్గొండికి చెందిన నాగశ్రీలకు ప్రత్యేక ప్రశంస కింద ప్రత్యేక బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయుల సంఘం వరంగల్ అధ్యక్షులు డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్, డాక్టర్ మడత భాస్కర్, గండు రవి, పరిపూర్ణాచారి, ఎన్‌వి.శ్రీదేవి, కె.కృష్ణమూర్తి, కక్కెర్ల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ హితాన్ని కోరుకునేదే సాహిత్యం


- ఎమ్మెల్సీ మధుసూదనాచారి
- 'మనసు- మనిషి' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

హనుమకొండ కల్చరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సమాజ హితాన్ని కోరుకునేదే సాహిత్యమని, అలాంటి సాహిత్య సృజనచేసే వారి సంఖ్య పెరిగినప్పుడే సమాజంలో చైతన్యం వస్తుందని తెలంగాణ తొలి శాసనసభాపతి, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఉదయం మిత్రమండలి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెచ్ఎం, బాల సాహిత్య రచయిత మెండు ఉమామహేశ్వర్ కలం నుంచి జాలువారిన 'మనసు- మనషి' పుస్తకావిష్కరణ సభ ఆదివారం హనుమకొండ కిషన్‌పురాలోని వాగ్దేవి ఆడిటోరియంలో జరిగింది. ఉదయం మిత్రమం డలి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాత్రికే యుడు దాసరి కృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం సిరికొండ మధుసూదనాచారి మాట్లాడారు. కసి, కృషి ఉంటే మనిషి ఉత్తమ ఫలితాలు సాధించగలుగుతారన్నారు. ఎన్నో ప్రతికూలతలను చిన్ననాటి నుంచి ధైర్యంగా ఎదుర్కొని ఎదిగిన వ్యక్తి పుస్తక రచయిత మెండు ఉమామహేశ్వర్ తన అనుభవాల సారాన్ని మనసు- మనిషి పుస్తకంలో దర్శింపజేశాడన్నారు. ప్రస్తుత సమాజంలో మానవజాతి కలుషితమైపోయిందని, ఇది అణుబాంబు కన్నా ప్రమాదకరంగా మారిందన్నారు. మన జీవితాలు ఉదయం కల్తీతో ప్రారంభమై కల్తీతో ముగుస్తున్నాయన్నారు. మనుషులను నాలుగు రకాలుగా తాను విభజించానని.. వారే క్రియేటర్స్, ఇమిటేటర్స్ స్పెక్టేటర్స్, ఫ్రస్టేటర్స్ అన్నారు. అద్భుతాలు సృష్టించే వారంతా అతి సాధారణ కుటుంబాల నుంచే వచ్చారన్నారు.

ప్రధాన వక్తగా విచ్చేసిన సీనియర్ పాత్రికేయుడు శెంకేసి శంకర్‌రావు పుస్తక విశ్లేషణ చేస్తూ.. మనిషిని నియంత్రించే మనసు మన చేతిలో లేదని, అది మార్కెట్ శక్తుల నియంత్రణలోకి వెళ్లిందన్నారు. బహిర్గత శక్తులు మనుషులను మాయ చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మనసు- మనిషి పుస్తకంలో రచయిత మెండు ఉమామహేశ్వర్ అన్ని కోణాలను స్పర్శించారన్నారు. ఈ పుస్తకాన్ని ఇటీవల మరణించిన తన సోదరుడు ప్రముఖ జర్నలిస్టు మెండె శ్రీనివాస్‌కు అంకితం ఇవ్వడం సోదరుల మధ్య ఉన్న ఆప్యాయతకు నిదర్శనమన్నారు. ప్రపంచమంతా ఇప్పుడు ఇన్‌స్టా గ్రామం అయిపోయిందన్నారు. వ్యక్తిత్వ వికాసం అన్నది విలువల పునాది మీద నిర్మాణం కావాలన్నారు. ప్రస్తుత సమాజంలో చదువులు చదివిన వారు కూడా మనసు మీద నియంత్రణ కోల్పోయి అనేక ఆకృత్యాలకు పాల్పడుతున్నారన్నారు. మనిషి హార్డ్‌వేర్ అయితే మనసు సాఫ్ట్‌వేర్ అన్నారు. వ్యక్తిత్వ వికాసానికి ఈ పుస్తకం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టు జి.నాగేశ్వర్‌రావు, పీఆర్టీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మైమ్ కళాధర్, మిమిక్రీ ఆర్టిస్ట్ రాంపల్లి సదాశివ, ఆర్.లక్ష్మణ్ సుధాకర్, వేణుమాధవ్, వల్లాల వెంకటరమణ, మెండు రవీందర్, పాత్రికేయులు, మేధావులు పాల్గొన్నారు.



సమాజ హితం కోసం కృషి చేయాలి

వడ్డెపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): సమాజహితం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేసి పేరు ప్రతిష్ఠలు, పలువురి మన్ననలు అందుకోవాలని కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం అన్నారు. ఆదివారం హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ పాత గ్రామ పంచాయతీ ఎదురుగా ఉన్న ప్రైవేటు సమావేశ మందిరంలో బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ ఆధ్వర్యంలో సమాజ సేవకులకు అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. వివిధ రంగాల్లో సేవలందించిన వారికి విశిష్ట, ఉత్తమ, సేవారత్న పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ.. సేవే పరమావధిగా ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని పిలుపుని చ్చారు. కార్యక్రమంలో బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఫౌం డర్స్ పతంగి భాస్కర్, పొ న్నం రాజు, కొండల్‌రెడ్డి, కొన్‌రెడ్డి మల్లారెడ్డితో పా టు పద్మ, నళిని, రజిని, ప్రియ తదిత రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మడికొండ, కడిపికొండ సబ్‌స్టేషన్ పరిధిలోని కుమ్మరిగూడెం అగ్రికల్చరల్ సర్వీసెస్, అయోధ్యపూర్, కొత్తపల్లి, శాయంపేట అగ్రికల్చరల్ సర్వీసెస్‌లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. నక్కలగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని భవానినగర్ రోడ్డు నెంబర్-3, శ్రీనివాసకాలనీ, కళ్యాణి ఫంక్షన్‌హాల్ ఏరియాలో ఉదయం 10.30 నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరా జరగదన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్సీ జిల్లా కమిటీ ఎన్నిక

వడ్డెపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్సీ) హనుమకొండ జిల్లా కమిటీ ఎన్నిక ఆదివారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని జిల్లా కార్యాలయంలో జరిగిందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య తెలిపారు. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా బండి సదానందం, ఉపాధ్యక్షుడిగా పడాల మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా పల్లెవేణి మహేష్, కార్యదర్శిగా మోచెర్ల దేవదానంలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య మాట్లాడుతూ.. అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం జిల్లా కమిటీ కృషి చేయాలని పేర్కొన్నారు.


అధ్యక్షుడు సదానందం

రేవంత్‌రెడ్డి పాలన అట్టర్‌ఫ్లాప్

(5వ పేజీ తరువాయి)

ఎర్రబెల్లి పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలోనే రైతులకు కాళేశ్వరం, దేవాదుల ద్వారా గోదావరి జలాలు లభించాయన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే ఉపన్యాసాలు ఇవ్వడం తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాచాటుతుందని, సర్వేలన్నీ బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయన్నారు. కార్యకర్తలు సమన్వయంతో ముందుకు వెళ్లేలా ప్రణాళికను రూపొందించాలన్నారు. ప్రతీ కా ర్యకర్తకు అండగా ఉంటానని, ఎవరి బెదిరింపులకు బయపడొద్దన్నారు. అక్రమ కేసులు బనాయిస్తే స్టేషన్ ముందు కుర్చుంటానన్నారు. ఐనవోలు లో బీఆర్ఎస్‌లో చేరేవారిని ఒక నాయకుడు బెదిరిస్తున్నాడని, ఎన్నిరోజు లు భయపెట్టిస్తాడో చూస్తానని, ఆయనకు తానే అన్నంపెట్టానన్నది మరిచిపోవద్దన్నారు. వర్ధన్నపేట, పాలకుర్తి రెండు నియోజకవర్గాలను తానే చూసుకుంటున్నానని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.చందర్‌రావు, మండల ఎన్నికల ఇన్‌చార్జి గుజ్జ గోపాల్‌రావు, ఐనవోలు ఎన్నికల ఇన్‌చార్జిలు రాధికరెడ్డి, పొలేపల్లి రామ్మూర్తి, జడ్పీ మాజీ కోఆప్షన్ ఉస్మాన్‌అలీ, నాయకులు పల్లకొండ సురేష్, లక్ష్మ ణ్, దేవదాస్, జయశంకర్, క్రాంతి, రాకేష్, వేణు, రాజేందర్, సదానందం, ఎల్లగౌడ్, టి.కుమార్, అశోక్, రఘువంశీ, నాగరాజు, కడుదూరి రాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐనవోలు, ఒంటిమామిడిపల్లి, లింగమోరిగూడెం, పంథిని, పున్నేలు గ్రామాల నుంచి కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన దామెర యాకయ్య, బుస్స సురేష్‌లతోపాటు సుమారు 100 మంది బీఆర్ఎస్ పార్టీలో చేరారు. దయాకర్‌రావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

చాకలి ఐలమ్మ విగ్రహానికి క్షీరాభిషేకం

కాజీపేట, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): కాజీపేట ఫాతిమా నగర్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి బీజేపీ నేతలు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం మాట్లాడుతూ.. మత మార్పిడులకు పాల్పడుతున్న వారికి పోలీసులు ఎలా అనుమతి ఇస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో కొత్త రవి, వెంకట్రావు, బాబురావు, ఎంఏ. హలీం తదితరులు పాల్గొన్నారు.


చాకలి ఐలమ్మ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా స్నేహితుల దినోత్సవం


హనుమకొండలో ఫ్రెండ్‌షిప్ డే సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దృశ్యం

హనుమకొండ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఫ్రెండ్‌షిప్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం నగరంలోని పలు కాలనీలలో కళాశాలలు, హాస్టల్స్, పార్కులు స్నేహితుల సందడితో కిటకిటలాడాయి. యువతీ యువకులు తమ స్నేహితులకు బాంధవ్య బంధాన్ని గుర్తు చేస్తూ ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకొని ఆనందాన్ని పంచుకున్నారు. కొందరు స్నేహితులు కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. నగరంలో ఫ్రెండ్ షిప్ డే వేడుకలు సందడి వాతావరణంలో జరుపుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు


పోచమ్మ తల్లికి వస్త్రాలను తీసుకొస్తున్న బైరి సోమయ్య


పోచమ్మ దేవాలయం వద్ద బోనాలతో భక్తులు

» అమ్మవారికి ప్రత్యేక పూజలు » తరలివచ్చిన మహిళలు

వడ్డెపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): డప్పుచప్పుళ్లు.. మేళతాళాలు.. శివసత్తుల పూనకాలతో హనుమకొండ జవహర్ కాలనీ మార్మోగింది. హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్ జవహర్‌కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బైరి సోమయ్య ఆధ్వర్యంలో పోచమ్మ బోనాల వేడుకలను శ్రావణ మాసం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సోమయ్య ఇంటి నుంచి ఊరేగింపుతో అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఆభరణాలు తరలించారు. పోచమ్మ గుడి పూజారి పున్నమాచారి అమ్మవారికి తొలి బోనాన్ని సమర్పించుకున్నారు. మహిళలు నెత్తిన బోనాలను ఎత్తుకొని డప్పుచప్పుళ్లతో పోచమ్మ దేవాలయానికి తరలివచ్చారు. తొలుత పోతరాజుకు నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం పోచమ్మ దేవాలయం చుట్టూ ఐదు ప్రదక్షణలు చేసి బోనాలతో అమ్మవారిని తనివి తీరా కొలిచారు. పసుపు, కుంకుమ, పప్పు, బెల్లం, నూతన వస్త్రాలు, బెల్లం శాకతో పాటు కొబ్బరి కాయలను సమర్పించుకున్నారు. గండ దీపం వెలిగించి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించుకున్నారు. పాడిపంటలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో తులతూగే విధంగా సల్లంగా దీవించమని పోచమ్మ తల్లిని వేడుకున్నారు.

ఈ కార్యక్రమంలో జవహర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బైరి సోమయ్య, ప్రధాన కార్యదర్శి యతిరాజుల సునిల్, ముఖ్య సలహాదారు బండి హరీష్‌ముదిరాజ్, ఉపాధ్యక్షురాలు తమ్మల శోభారాణి, కార్యదర్శి కొత్తపల్లి అమర్‌నాథ్, కోశాధికారి మట్టెపల్లి రణధీర్‌కుమార్, ప్రతినిధులు చెరుకు శ్రీనివాస్, కంటె సత్తయ్య, భిక్షపతి, పద్మ, సునిత,తదితరులు పోచమ్మ తల్లిని దర్శించుకొని కొలిచి మొక్కులు చెల్లించుకున్నారు.

రిటైర్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రిటైర్ అయిన ఉపాధ్యాయులకు రిటైర్‌మెంట్ బకాయిలును వెంటనే చెల్లించాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఆదివారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో పదవీ విరమణ పొందిన అడికె శోభారాణి సన్మాన సభకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో మానసిక ఆందోళన చెందుతున్నారని, తక్షణమే బెనిఫిట్స్ విడుదల చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో ప్రభుత్వం ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన శోభారాణిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నేతలు డి.కిరణ్‌కుమార్, సిహెచ్. రవీందర్ రాజు, పెండెం రాజు, రామ్‌కిషన్‌రాజు, రాధేశ్యామ్, తూపురాణి సీతారాం, ఎస్.జ్యోతి, రాజారాం, మధుకర్‌రెడ్డి, గుర్రం శ్రీనివాస్, లింగారావు, మల్లిక్, నరేశ్, నాగరాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి


శంకర్‌కు సినారె అవార్డును ఇస్తున్న సిధారెడ్డి తదితరులు

మంథని శంకర్‌కు సినారె అవార్డు

కేయూ క్యాంపస్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కేయూ తెలుగు విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ మంథని శంకర్‌కు మహాకవి సినారె అవార్డు లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన సినారె కళాపీఠం నేతృత్వంలో సినారే 94వ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శంకర్‌కు అవార్డును అందచేశారు. సభకు అధ్యక్షుడిగా డాక్టర్ నందిని సిధారెడ్డి వ్యవహరించగా కళాశాల పీఠం అధ్యక్షుడు మట్టినేని రాములు, డాక్టర్ కోరేటి రంగయ్య, మంతర్ శంకర్, ఎడిటర్ దేవదాసు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అవార్డు పొందిన శంకర్‌ను పలువురు కేయూ బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

మాదిగ జర్నలిస్టుల పోస్టర్ ఆవిష్కరణ

కాజీపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ రవీంద్రభారతిలో ఈనెల 12న జరిగే తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం రెండోవ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ తాటికొండ రాజయ్య ఫాతిమానగర్‌లో ఆదివారం ఆవిష్కరించారు. మాదిగ జర్నలిస్టులకు అండగా ఉంటామని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల నాగేందర్, మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్, మాదిగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ వీరేందర్‌లతో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం టి. రాజయ్య

కాజీపేట బ్రిడ్జిపై జర పైలం

» గుంతలతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కాజీపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట ఫాతిమానగర్ బ్రిడ్జిపై వాహనదారులు జర జాగ్రత్తగా వెళ్లాలి. కింద వెళ్లే రైళ్లు.. పక్కనే నిర్మాణంలో ఉన్న మరో బ్రిడ్జి లాంటి సీన్‌లు చూస్తూ ఏమరుపాటుగా వెళ్లారో.. మీ నడుములు విరిగినట్లే.. బ్రిడ్జిపై గుంతలు.. కొన్ని గుంతల్లో రాళ్లు ఉన్నాయి. బ్రిడ్జి పక్కనే విరిగిన పుట్‌పాత్.. కొన్ని నెలలుగా బ్రిడ్జిపై ఇదే సీను. పుట్‌పాత్ దెబ్బ తినడంతో నడిచివెళ్లే వారు కూడా తిప్పలు పడుతున్నారు. కొందరు వాహనదారులు స్పీడుగా వచ్చి గుంతల వద్దకు రాగానే సడన్ బ్రేక్ వేయడంతో వెనకాలే వచ్చే వాహనాలు ఢీకొని గాయపడుతున్నారు. హైదరాబాద్ నుంచి నిత్యం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మంత్రులు, జిల్లా అధికారులు ఈ బ్రిడ్జి మీదుగానే ప్రయాణిస్తుంటారు. అయినా ఈ గుంతలను పూడ్చేందుకు మాత్రం చొరవ చూపడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గుంతలు పూడ్చి ప్రమాదాల నుంచి రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.


బ్రిడ్జిపై ఉన్న గుంత


ఫాతిమానగర్ వద్ద బ్రిడ్జిపై ధ్వంసమైన ఫుట్‌పాత్

అవినీతిని అరికట్టాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భవన నిర్మాణ రంగంలో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉప్పలయ్య పాల్గొని మాట్లాడారు. కేవలం భవన నిర్మాణ కార్మికరంగంలో పనిచేస్తున్న అర్హులైన కార్మికులకు చెందాల్సిన భవన నిర్మాణ సంక్షేమబోర్డు నిధులు, పథకాలు పైరవీకారులు, ఏఎల్‌వోలు ఏకమై అర్హత లేని వారికి ఇప్పిస్తున్నారని ఆరోపించారు. భవన నిర్మాణ రంగంలో కొంతమంది నకిలీ సంఘాలను సృష్టించుకొని సభ్యత్వాలు లేకుండా లేబర్ కార్డులు చేయిస్తూ పర్సంటేజీలు మాట్లాడుకొని అవినీతికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైరవీకారులపై చర్యలు చేపట్టాలని ఉప్పలయ్య కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నన్స్‌పై అక్రమ కేసులను ఎత్తివేయాలి

వరంగల్ కేథలిక్ డయాస్ పాలనాధికారి బిషప్ విజయ్‌పాల్



నిరసన వ్యక్తం చేస్తున్న క్రైస్తవులు

కాజీపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నిస్వార్థంగా సేవ చేస్తున్న నన్స్‌పై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమైన చర్య అని వరంగల్ కేథలిక్ డయాస్ పాలనాధికారి బిషప్ బి.విజయపాల్ అన్నారు. ఛత్తీస్‌గడ్‌లో నన్స్‌పై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, నన్స్‌పై జరిగిన దాడి మత స్వేచ్ఛపై జరిగిన దాడేనని ఆయన అభివర్ణించారు. నన్స్‌పై అక్రమ కేసులను నిరసిస్తూ ఆదివారం ఫాతిమా కేథడ్రిల్ చర్చి నుంచి మదర్ థెరిస్సా విగ్రహం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిషప్ విజయ్‌పాల్, సీఆర్ఐ ప్రతినిధి సిస్టర్ కల్పన, ఫాతిమా చర్చి ప్రధాన కార్యదర్శి ఆర్. రాజ్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. నిస్వార్థంగా సేవ చేస్తున్న నన్స్‌పై బలవంతంగా మతమార్పిడులకు పాల్పడ్డారని, మానవ అక్రమ రవాణా చేస్తున్నారని నిరాధారమైన రోపణలతో అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నన్స్ చెప్పిన వివరాలను పట్టించుకోకుండా వారిని భయభ్రాంతులకు గురి చేసి కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. నన్స్ అరెస్టును ప్రజాస్వామికవాదులంతా తీవ్రంగా ఖండించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేయాలన్నారు. నన్స్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శనలో ఫాదర్ తాటికొండ జోసెఫ్, ఫాతిమా చర్చి కమిటీ ప్రధాన కార్యదర్శి టి డి టామి, కోశాధికారి ప్రకాశ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కిరణ్, జి. సుధీర్‌రెడ్డి, శౌరి, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజాజీనగర్ కాలనీ కమిటీ ఎన్నిక


నూతన కార్య వర్గ సభ్యులు ←

రాంనగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్‌లోని 52వ డివిజన్ రాజాజీనగర్ కాలనీ అభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బారాజు కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం కుమారస్వామి, ఉపాధ్యక్షుడిగా శ్రీరాంరెడ్డి, గోలి సురేందర్‌రెడ్డి, అచ్చ విద్యాసాగర్, చాడ జనార్దన్‌రెడ్డి, కోశాధికారిగా వడ్లకొండ రవీందర్, ముఖ్య సలహాదారుడిగా దేవేంద్రకుమార్, జాయింట్ సెక్రటరీలుగా గటికరాం బాబు, సాదుల బాలరాజు, బోయిని రాజేందర్‌రెడ్డి, బత్తిని సత్యనారాయణ, రేపూరి కృష్ణారెడ్డి, సలహాదారులుగా శ్రీనివాసరావు, సంజీవరావు, రమేశ్ వర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.


ఇళ్ల మధ్యే మురుగు.. పట్టించుకునే వారేరి?

» ఇందిరానగర్‌లో పొంగుతున్న డ్రెయినేజీలు
» చెరువులను తలపిస్తున్న అంతర్గత రోడ్లు
» ఇబ్బందుల్లో స్థానికులు, చోద్యం చూస్తున్న అధికారులు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ చౌరస్తాకు కూతవేటు దూరంలో ఉన్న 8వ డివిజన్ ఇందిరానగర్‌లోని ఎస్సీ హాస్టల్ పక్క కాలనీలో అంతర్గత రోడ్లపై మురుగునీరుతో పొంగి పొర్లుతున్నప్పటికీ పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. కాలనీలో అసంపూర్తిగా ఉన్న సైడ్‌డ్రైన్‌ల నిర్వహణ సరిగాలేక ఇటీవల కురిసిన వర్షాలతో వరదనీరు సమీపంలోని ఇళ్లలోకి చేరడంతో స్థానికులు నరకయాతన పడుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినా.. ఆ కాలనీలో ప్రజలు పరిస్థితి అధ్వానంగానే ఉంది. కొన్నిరోజులుగా డ్రైయినేజీలు నిండి రోడ్డుపైకి మురుగునీరు పారుతూ చెరువులను తలపించడంతో స్థానికులు త మ ఇళ్లలోకి వెళ్లలేని దుస్థితి నెలకొంది. అసలే ఇరుకురోడ్లు.. అపై చిన్న చిన్న సైడ్ డ్రైన్‌లు ఉండటంతో ఒక్కసారిగా వచ్చే మురుగునీరుతో డ్రైన్‌లు నిండి రోడ్లపైకి చేరడంతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

అలాగే 8, 9 రెండు డివిజన్లకు అనుసంధానంగా సమీపంలో ఉన్న పెద్ద సైడ్ డ్రైన్ మధ్యలో గతంలోనే మంచి నీటి సరఫరా చేసే పైపులను నిర్మించారు. దీంతో మంచి నీటి పైపులు సైడ్‌డ్రైన్‌కు అడ్డుగా ఉండటం.. చెత్త, చెదారం, ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు అడ్డుగా నిలిచి ఆ మురుగు సమీపంలోని కాలనీలోకి చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. స్థానికులు, వృద్ధులు, చిన్నారులు మురుగునీటిలో బయటకు వెళ్లలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం వేళల్లో చిన్నారులు స్కూల్‌లకు పంపించాలంటే విద్యార్థుల తల్లిదండ్రులు జంకుతున్నారు. మురుగు నీరు ఇళ్ల ముందు ప్రవహించడంతో దుర్గంధంతో పాటు ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ స్థానిక కార్పొరేటర్ గానీ, జీడబ్ల్యూఎంసీ అధికారులు, సిబ్బందిగానీ తమ గోడును పట్టించుకోక పోవడం ఏమిటనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందు ముందు పెద్దఎత్తున వర్షాలు కురిసే అవకాశాలు ఉన్న నేపథ్యంలో కాలనీలో సైడ్ డ్రైనేజీల నిర్మాణంతో పాటు తమ ఇళ్ల ముందు మురుగునీరు చేరకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు వేడుకుంటున్నారు.


రోగాల బారిన పడుతున్నాం..



ఇటీవల కురిసినవర్షాల కారణంగా ఇళ్ల ముందు రోడ్డుపైకి మురుగునీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. 9వ డివిజన్‌లోని పెద్ద సైడు కాలువలో మంచినీళ్ల పైపు అడ్డుగా ఉండటంతో పెద్ద మోరిలోని మురుగు నీరు ఉప్పొంగడంతో ఒక్కసారిగా ఇళ్ల ముందుకు మురుగు చేరి జలమయంగా మారుతోంది. ఇళ్ల ముందుకు చేరిన మురుగునీరు కారణంగా ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నాం. కార్పొరేటర్, జీడబ్ల్యూఎంసీ సిబ్బంది మురుగు నుంచి విముక్తి కల్పించాలి.

తమ్మె సూరమ్మ, స్థానికురాలు

దుర్గంధాన్ని భరించలేకపోతున్నాం..



ఇటీవల కురిసిన వర్షం కారణంగా ఇళ్ల మధ్యలో, వీధుల్లో మురుగు పారుతుండటంతో తీవ్ర దుర్గంధం బయటకు వెళ్లాలంటే భయం వేస్తోంది. మురుగు నీరు ప్రవాహం కారణంగా చిన్న పిల్లలు, వృద్ధులు పలు వ్యాధులు బారిన పడటంతో అస్పత్రి పాలు కావాల్సిన దుస్థితి నెలకొంది. మోకాలులోతు మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో అటుగా వెళ్లలేక నరకం చూస్తున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు మురుగు సమస్యకు పరిష్కారం చూపించాలి.

గూడూరు ప్రకాష్, ఇందిరానగర్


ఇందిరానగర్ ఎస్సీ హాస్టల్ పక్క కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



పర్యావరణానికి మేలు చేసే అడవి జామ!



చాలా మందికి పర్యావరణానికి మేలు కలిగించే ఏదో ఒక పని చేయాలని ఉంటుంది. అలాంటి వారు తమ చుట్టుపక్కల ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో అడవి జామ మొక్కను నాటితే చాలు. సీతాకోకచిలుకలు, రకరకాల పక్షులు దాని మీదకు చేరతాయి. దీని ఆకులు చిన్న చిన్న గాయాలు మాన్పటానికి ఔషధంలా కూడా ఉపయోగపడతాయి.

అడవి జామ ఆకులు పెద్దగా ఆకుపచ్చ రంగులో ఉంటాయి. ఈ ఆకులు రాలిపోయే ముందు ఎర్రగా అవుతాయి. ఈ మొక్క పువ్వులు పింక్ రంగులో పెద్దగా ఉంటాయి. సాధారణంగా వేసవిలో ఈ మొక్కకు కాయలు కాస్తాయి. ఈ కాయల్లో ఎక్కువ గింజలు ఉంటాయి. ఈ కాయలు పళ్లుగా మారిన తర్వాత వీటిలోపల ఉన్న గింజలను పక్షులు తింటాయి. కొన్నింటిని చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో పడేస్తాయి. వాటి నుంచి కూడా మొక్కలు వస్తాయి. ఇలా ఒక ప్రాంతంలో ఉన్న పర్యావరణ చక్రాన్ని నిరంతరం కాపాడటంలో అడవి జామ కీలకమైన పాత్ర పోషిస్తుంది. ఆదివాసి ప్రాంతాల్లో ఈ చెట్టు పువ్వులతో పచ్చడి చేసుకుంటారు. ఆకులను నూరి చిన్న చిన్న గాయాలపై పూస్తే అవి వెంటనే తగ్గిపోతాయి. ఆయుర్వేద మందుల్లో కూడా అడవి జామను వాడతారు.

● **డాక్టర్ శ్రీనాథ్,**
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్

పువ్వులతో అందం!



అమ్మాయిలు సున్నితం అని చెప్పడానికి వారిని పువ్వులతో పోల్చుతారు. పూలను సౌందర్య ఉత్పత్తుల తయారీలో వాడతారు. అయితే ఇంటి పెరట్లో పెంచుకునే పువ్వులు కూడా అనేక చర్మ సమస్యలను దూరం చేసి సొగసుకు సొబగులు అద్దుతాయి. ఆ సంగతులివీ..

● కేశాల సంరక్షణలో ముందుండే మందార పూలు చర్మ సంరక్షణకూ తోడ్పడతాయి. ఇందులోని విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు చర్మంపై మచ్చలను, పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తాయి. విటమిన్ సి చర్మం నిగారించేలా చేస్తుంది. మందారపూలను రుబ్బి ఫేస్‌ప్యాక్ వేసుకుంటే పలు చర్మ సమస్యలు దూరమవుతాయి.

● మల్లెపూలు సుగంధాలను వెదజల్లడంతో పాటు చర్మ ఆరోగ్యానికీ సహాయపడతాయి. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు మొటిమలు, మచ్చలను నివారిస్తాయి. ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షణ కల్పిస్తాయి. మల్లె పూలు చర్మంపై దురద, వాపు, మచ్చలు వంటి సమస్యలు దూరం చేస్తాయి. మల్లెపూలను రుబ్బి ఆ పేస్టులో కొంచెం కొబ్బరి నూనె కలిపి ఫేస్‌ప్యాక్ వేసుకుంటే చర్మం నిగారిస్తుంది.

● బంతి పూలలో యాంటీ సెప్టిక్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు పుష్కలం. ఇవి చర్మంపై గాయాలను మాన్పుతాయి. ముడతలు, వృద్ధాప్య ఛాయలను నివారించడంలోనూ బంతిపూలు ఉపయోగపడతాయి. బంతిపూలను మిక్సీలో వేసి మెత్తని పేస్టులా చేసుకుని ముఖానికి రాసుకోవాలి.



విభిన్నం

సహజసిద్ధమైన రంగులు... సంప్రదాయ డిజైన్లు... నవీనతకు సాక్ష్యాలు పుట్టపాక చేనేతలు. తెలియా రుమాల్... డబుల్ ఇక్కత్ పట్టు చీరలు... ఇక్కడి కళాకారుల చేతుల్లో రూపుదిద్దుకున్న వస్త్రాలు... వేటికవే ప్రత్యేకతను చాటే అపురూపాలు.

ఈ అరుదైన కళను విశ్వవ్యాప్తం చేసి... చేనేత పరిశ్రమకు పూర్వ వైభవం తేవడంలో విశేష కృషి చేస్తున్నారు గజం నర్మదానరేందర్. ఇందుకుగానూ ఆమెకు ఇటీవల కేంద్ర చేనేత, జౌళి శాఖ మార్కెటింగ్ విభాగంలో జాతీయ పురస్కారాన్ని ప్రకటించింది.

ఈ సందర్భంగా 'జియోగ్రాఫికల్ ఇండెక్స్' (జీఐ) కూడా పొందిన పుట్టపాక వస్త్రం విశేషాల సమాహారం 'నవ్య'కు ప్రత్యేకం.

ప్రకృతి రంగుల పుట్టపాక చీర



యాదాద్రి భువనగిరి జిల్లా... సంస్థాన్ నారాయణపురం మండలం... పుట్టపాక గ్రామం. ఇక్కడ వెయ్యి కుటుంబాలు చేనేత పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నాయి. ప్రాచీన కాలంనాటి తేలియా రుమాలుతో పాటు డబుల్ ఇక్కత్ పట్టు చీరలు ఈ ప్రాంతంలో తయారవుతున్నాయి. ఇక్కడ ప్రతి కార్మికుడూ ఒక అద్భుత కళాకారుడే. మగ్గంపై నేసే ప్రతి వస్త్రమూ దేనికదే ప్రత్యేకతను చాటుతుంది. సృజనాత్మక డిజైన్లను రూపొందించడంలో ఇక్కడి కార్మికులు దిట్టలు. ప్రస్తుతం చీరలతోపాటు దుపట్టాలు, డ్రెస్ మెటీరియల్స్ ఇక్కడ తయారు చేస్తున్నారు.

ఆరు నెలల శ్రమ...

తేలియా రుమాల్ చీర తయారీకి నాణ్యమైన పత్తి నుంచి తీసిన నూలు ఉపయోగిస్తారు. కరక్కాయ పొడి లాంటి ప్రకృతిసిద్ధమైన పదార్థాలతో ఆ నూలును శుద్ధి చేస్తారు. బంతి పూలు, దానిమ్మ పండ్లు, కొత్తిమీర, ఉల్లిగడ్డ పొట్టు, వివిధ మొక్కల ఆకులు, వేర్లు, వనమూలికలతో రంగులు తయారు చేస్తారు. సహజసిద్ధమైన రంగులను మల్బరీ పట్టు దారానికి అద్ది... తేలియా రుమాల్‌తో పట్టుచీర రూపొందిస్తారు. డబుల్ ఇక్కత్ పద్ధతిలో డిజైన్లు, కొన్ని చిహ్నాలను ఎంపిక చేసుకుని గ్రాఫ్ తయారు చేస్తారు. డిజైన్లు గడుల్లో ఇమిడి, ఏడు గజాల చీర పొడవునా రావడానికి... 135 పాయలతో చిటికి తయారు చేస్తారు. అంగుళానికి 72 పోగులు వచ్చేలా చూస్తారు. ఎంతో శ్రద్ధగా, ఓపిగ్గా చేయాల్సిన ప్రక్రియ ఇది. ఒక చీర రూపొందించడానికి ఆరు నెలల సమయం పడుతుంది. వైవిధ్యమైన తేలియా రుమాల్‌కు భౌగోళిక సూచీ (జీఐ: జియోగ్రాఫికల్ ఇండెక్స్) కూడా లభించడం మరో విశేషం.

దేశవిదేశీ ప్రతినిధుల అధ్యయనం...

హైదరాబాద్ నగరానికి దగ్గరలో ఉన్న పుట్టపాక చేనేత కళను అధ్యయనం చేసేందుకు దేశవిదేశీ ప్రతినిధులు వస్తుంటారు. నిఫ్ట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు, ఫ్యాషన్ డిజైనర్లు వీరిలో ఉన్నారు. పుట్టపాకలో మగ్గంపై నేసిన వస్త్రాన్ని... అపురూప కళాఖండాలను భద్రపరిచే లండన్ మ్యూజియంలో ప్రదర్శనకు ఉంచారు. అమెరికా అధ్యక్షుడి భవనం వైట్‌హౌస్‌లో ఇక్కడ తయారు చేసిన వస్త్రాన్ని అలంకరణకు ఉపయోగిస్తున్నారు. దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో జరిగే ఎగ్జిబిషన్లలో ఈ చేనేతలు ప్రదర్శిస్తుంటారు. అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీర తయారు చేసిన ఘనత ఇక్కడి కళాకారులది. గ్రామానికి చెందిన గజం గోవర్ధన్, గజం సత్యనారాయణ పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. పుట్టపాక నుంచి ఇప్పటివరకు 30మంది కళాకారులకు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి.

మరో ఇద్దరికి...

ఇటీవలే పుట్టపాకకు చెందిన ఇద్దరు కళాకారులు కేంద్ర చేనేత, జౌళి శాఖ ప్రకటించిన జాతీయ అవార్డులకు ఎంపికయ్యారు. ఇక్కత్ వస్త్రాల తయారీలో నూతన పద్ధతులు అవలంబించి, కొనుగోలుదారులను ఆకట్టుకొంటున్న గజం నర్మదానరేందర్‌కు చేనేత మార్కెటింగ్ విభాగంలో అవార్డు దక్కింది. అదేవిధంగా సహజసిద్ధమైన రంగులతో తేలియా రుమాల్, డబుల్ ఇక్కత్ డాబీబోన్ చీర, డబుల్ ఇక్కత్ డాబీ బోన్ దుప్పటి తయారు చేసిన గూడ పవన్ యంగ్ వీవర్ విభాగంలో జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆరు నెలల పాటు శ్రమించి... 6.25 మీటర్ల పొడవు, 46 ఇంచుల వెడల్పుతో పవన్ తయారు చేసిన ఈ చీరలో... తేలియా రుమాల్‌కు సంబంధించి 16 ఆకృతులు ఉన్నాయి. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7న ఢిల్లీలో నిర్వహించనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకోనున్నారు.

- యాదాద్రి, ఆంధ్రజ్యోతి

ఉపాధి కల్పిస్తూ... కళను కాపాడుతూ...




చేనేత కళను కాపాడుతూ, నేతన్నలకు ఏడాది పొడవునా ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నాను. అందులో భాగంగా మహిళల అభిరుచులకు తగ్గట్టు సంప్రదాయ డిజైన్లను నవీకరిస్తూ, విభిన్న శ్రేణుల చీరలు రూపొందిస్తున్నాం. తేలియా రుమాల్ వస్త్రాలను అంతర్జాతీయ వేదికలపైకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా మార్కెటింగ్ చేయడంతో లక్ష రూపాయల పెట్టుబడితో ప్రారంభించిన మా వ్యాపారం ఇప్పుడు కోట్లల్లో టర్నోవర్ జరుగుతోంది. మా వద్ద రూ.10 వేల నుంచి రూ.75 వేల ధర పలికే చీరలు ఉన్నాయి. సీజన్, ఆర్డర్లను బట్టి చీరలు తయారు చేస్తాం. ప్రస్తుతం 300 మగ్గాలపై పని జరుగుతోంది. ఈ వృత్తిపై ఆధారపడిన చేనేత కుటుంబాలన్నీ ఆర్థికంగా నిలదొక్కుకొనేందుకు అవసరమైన పని కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. నా సేవలు గుర్తించి, కేంద్ర ప్రభుత్వం జాతీయ అవార్డుకు ఎంపిక చేయడం గర్వంగా ఉంది. ఇది నా ఒక్కదాని ఘనత కాదు. నాకు చేయూత అందించిన నా భర్త, చేనేత రంగం గురువులు, కళాకారులు అందరిదీనని భావిస్తున్నాను.

- గజం నర్మదానరేందర్

మార్పు కోసమే ఈ స్టార్టప్...





అగ్ని ప్రమాదాలకు కారణమౌతున్న వ్యర్థాల నిర్వహణ, పంట దిగుబడి పెంచడం, మహిళలకు ఉపాధి కల్పన...

వీటన్నిటికీ ఒక స్టార్టప్‌తో పరిష్కారం చూపించారు మేఘా సక్సేనా.

వైద్య వృత్తిని వదిలేసి పల్లె బాట పట్టిన ఆమె... ఇది తాను కోరుకుంటున్న మార్పు దిశగా ఒక చిన్న అడుగు మాత్రమేనంటున్నారు.

"మా ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని దేవభూమి అని పిలుస్తారు. దాదాపు 71 శాతం అడవులున్న రాష్ట్రం మాది. ఈ అడవుల్లో పదహారు శాతానికి పైగా పైన్ చెట్లు ఉన్నాయి. పైన్ చెట్ల ఆకులు సూది మొనల్లా ఉంటాయి. అందుకే వాటిని 'పైన్ నీడిల్స్' అంటారు. అవి ఎండిపోయి, నేల మీద పడి, అక్కడే పేరుకుపోతాయి. అడవుల్లో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు చాలా వేగంగా వ్యాపించడానికి అవి ప్రధాన కారణం. రాష్ట్రంలో గత పాతికేళ్ళగా... సంభవించిన అగ్ని ప్రమాదాల్లో లక్షన్నర ఎకరాలకు పైగా అడవులు దగ్ధమైపోయాయి. ఇది పర్యావరణానికి, వృక్ష జాతుల వైవిధ్యానికి, ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రమాదకరం. ఆ ప్రాంతంలో పుట్టి పెరిగిన నాలాంటివారందరికీ ఈ సమస్య తీవ్రత తెలుసు. కానీ దీనికి పరిష్కారం ఎలా? అనేదే ప్రశ్న.

నా వంతుగా...

'డాక్టర్' అని పిలిపించుకోవాలని, పేదలకు సేవ చేయాలని నా ఆశయం. దానికోసం ఎంతో కృష్టపడ్డాను. ఎంబీబీఎస్ పూర్తి చేశాక... అల్మోరాలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిగా పని చేశాను. గ్రామాల్లో వైద్య శిబిరాలు కూడా నిర్వహించాను. గ్రామస్తుల ఇబ్బందులు మరింత స్పష్టంగా తెలుసుకొనే అవకాశం వాటిద్వారా కలిగింది. పంట దిగుబడిని పెంచడం కోసం ఎరువులు, పురుగుల మందులు కొనే స్తోమత చాలామంది రైతులకు లేదు. అలాగే సంప్రదాయికమైన సాగు పద్ధతులనే వారు పాటిస్తూ ఉంటారు. ఇక... మహిళలకు సరైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఆర్థిక స్వావలంబనకు దూరంగా ఉన్నారు. 'వారికి నా వంతుగా ఏదైనా చెయ్యగలనా?' అని ఆలోచిస్తున్న సమయంలో... కొవిడ్ వచ్చింది. అప్పుడు నేను గర్భవతిని కావడంతో విధులకు సెలవు తీసుకున్నాను. ఆ తీరిక సమయంలో... పైన్ ఆకులు, వాటి ప్రయోజనాల గురించి అధ్యయనం చేశాను. వాటితో పౌల్ట్రీలు, చేపల పెంపకానికి ఆహార సప్లిమెంట్లను, వ్యవసాయం కోసం బయో ఫెర్టిలైజర్స్‌ను తయారు చేయవచ్చని తెలిసింది. మరిన్ని వివరాల కోసం కొందరు నిపుణులను సంప్రతించాను. వారి ప్రోత్సాహంతో... ఉద్యోగం వదిలేసి, 2021లో 'ఎకోఛార్' అనే స్టార్టప్ ప్రారంభించాను.

ఫలితాలు నిర్ధారించాక...

మా ఉత్పత్తుల్లో బయోఛార్, ఉడ్ వెనిగార్ ప్రధానమైనవి. ఎండిపోయిన పైన్ ఆకులను ప్రత్యేకమైన పద్ధతుల్లో, నిర్దిష్టమైన ఉష్ణోగ్రత దగ్గర కాల్చితే బొగ్గు తయారవుతుంది. ఈ ప్రక్రియలో పర్యావరణానికి ఎలాంటి ముప్పు ఉండదు. ఆ బొగ్గును ఉపయోగించడం వల్ల నేల సారవంతం అవుతుంది. రసాయనాలు, పురుగు మందుల వాడకం వల్ల నేలలో విషపూరితమైన అవశేషాలు మిగిలిపోతాయి. ఈ బొగ్గు వినియోగం వల్ల ఆ సమస్య ఉండదు. దిగుబడి ఎక్కువగా వస్తుంది. అలాగే పైన్ ఆకులతో తయారు చేసే ఉడ్ వెనిగార్ ద్వారా దిగుబడి పెరుగుతుంది. మొదట్లో ప్రయోగాత్మకంగా వినియోగించి... ఫలితాలను నిర్ధారించుకున్నాక ఉత్పత్తిని ప్రారంభించాం. స్థానిక రైతులకు వీటివల్ల ఖర్చు తగ్గడం, భూసారం పెరగడం లాంటి ప్రయోజనాలు కలుగుతున్నాయి. హరియాణా, గుజరాత్, పంజాబ్ తదితర రాష్ట్రాల్లో కూడా వీటికి ఆదరణ లభిస్తోంది.

సేకరణ పూర్తిగా మహిళలద్వారానే...

పైన్ ఆకుల సేకరణ పూర్తిగా మహిళలే చేస్తారు. దీనికోసం పలు గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేశాం. అడవుల్లో పైన్ ఆకులు సేకరించి... మా కేంద్రాలకు తీసుకువస్తే... దానికి ప్రతిఫలాన్ని మేము అందిస్తున్నాం. మా ఉత్పత్తుల విక్రయాల ద్వారా వచ్చే మొత్తంలో ఎక్కువ భాగం వారికోసమే వినియోగిస్తున్నాం. ఇప్పుడు అనేక ప్రాంతాల్లో ఇదివరకటిలా నేల మీద ఎండిన పైన్ ఆకులు కనిపించడం బాగా తగ్గిపోయింది. ఈ విధంగా... పర్యావరణానికి, రైతులకు, మహిళలకు ఒక పరిష్కారాన్ని చూపించడం ఎంతో సంతోషంగా ఉంది. విద్య, వైద్యం, మహిళా సాధికారత, అందరికీ సమాన అవకాశాలు... ఇలా ఎన్నో అంశాల్లో పని చేయాలనేది నా కోరిక. ఇవన్నీ సాధ్యం కావాలంటే సమాజంలో మార్పు రావాలి. నా స్టార్టప్... ఆ దిశగా నేను వేసిన ఒక చిన్న అడుగు.

పిల్లల చేతి రాత అందంగా...



కొంతమంది పిల్లల చేతిరాత అంత అందంగా ఉండదు. అక్షరాలను ఒక క్రమంలో కాకుండా ఎగుడు దిగుడుగా, కొన్నింటిని పెద్దగా మరికొన్నింటిని చిన్నగా రాస్తుంటారు. ఎంత బాగా చదివినప్పటికీ చేతి రాత సరిగా లేకపోతే పరీక్షల్లో మార్కులు కూడా తగ్గుతుంటాయి. అలాకాకుండా పిల్లల చేతిరాత చక్కగా ఉండాలంటే తల్లిదండ్రులు ఏ జాగ్రత్తలు పాటించాలో తెలుసుకుందాం...

● ముందుగా పిల్లలు పెన్సిల్‌ను ఎలా పట్టుకుంటున్నారో పరిశీలించాలి. చూపుడు వేలు, మధ్యవేలు, బొటనవేలు మధ్య పెన్సిల్ సరిగా అమరేలా చూడాలి. ఈ మూడు వేళ్లతో పెన్సిల్‌ను గట్టిగా పట్టుకోవడం నేర్పించాలి. చాలామంది పిల్లలు పెన్సిల్‌ను చూపుడు వేలు, బొటనవేలుతో మాత్రమే పట్టుకుంటూ ఉంటారు. దీనివల్ల సరైన గ్రిప్ దొరకక చేతిరాత సరిగా రాదు.

● పిల్లలకు అక్షరాలను సరళరేఖ వెంబడి ఒకే రీతిలో రాయడం నేర్పించాలి. రూల్డ్ నోట్‌బుక్స్‌లో రాస్తూ ఉంటే కొద్ది రోజుల తరవాత తెల్ల కాగితం మీద కూడా చక్కగా రాయడం వస్తుంది.

● అరచేతులు, వేళ్ల వేగంగా కదిలిస్తూ చేసే పనులను పిల్లలకు చెప్పి చేయించాలి. మట్టితో బొమ్మలు చేయడం, సూదిలో దారం ఎక్కించడం, సొంతంగా ఆహారాన్ని తినడం, బొమ్మలతో పజిల్స్ పూర్తిచేయడం లాంటివి చేయిస్తూ ఉంటే ఏకాగ్రత కుదురుతుంది. చేసే పనికి తగ్గట్టు వేళ్లను కదిలించడం పిల్లలకు అలవాటవుతుంది. క్రమంగా చేతిరాత మెరుగవుతుంది.

● పిల్లల చేత అక్షరాలను సరైన క్రమంలో దిద్దించాలి. తరవాత వాటిని వరుసలో రాయమని చెప్పాలి. ఇలా రోజూ చేస్తూ ఉంటే అక్షరాలు రాసే విధానం పిల్లలకు అర్థమవుతుంది. వాటిని అందంగా ఎలా రాయాలో తెలుస్తుంది. క్రమంగా పదాలు, వాక్యాలు రాయడాన్ని పిల్లలకు నేర్పించాలి.

● వాక్యాలు రాసేటప్పుడు పదాల మధ్య చిన్న ఖాళీ ఉంచాలని పిల్లలకు చెప్పాలి. పదాలు రాసేటప్పుడు అక్షరాల సైజు ఒకేలా ఉండేలా సాధన చేయించాలి. రాయడానికి కష్టంగా ఉన్న పదాలను విడిగా పలుమార్లు రాయిస్తే పిల్లలు సులువుగా వాక్యాలు రాయగల్గుతారు. చేతిరాత కూడా పొందికగా మారుతుంది.

బూట్లు శుభ్రంగా ఇలా...



వర్షాకాలంలో తరచూ బురద అంటుకోవడం వల్ల బూట్లు మురికిగా మారుతూ ఉంటాయి. వాటిని శుభ్రం చేయడం కష్టంగా అనిపిస్తుంటుంది. ముఖ్యంగా తెల్లటి బూట్లకు అంటిన మరకలు త్వరగా వదలవు. చిన్న చిట్కాలు పాటించి బూట్లను ఎలా మెరిపించాలో తెలుసుకుందాం...

● వాతావరణంలో తేమ కారణంగా ఒక్కోసారి బూట్ల మీద ఫంగస్ చేరుతూ ఉంటుంది. అలాంటప్పుడు బూట్లకు నిమ్మరసం రాయాలి. పది నిమిషాల తరవాత టిష్యూ పేపర్ లేదా పలుచని వస్త్రంతో తుడిస్తే మురికి పూర్తిగా వదిలిపోతుంది. వెనిగర్‌లో ముంచిన దూదితో బూట్లను తుడిచినా మంచి ఫలితం కనిపిస్తుంది.

● ఒక గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా, కొన్ని నీళ్ల చుక్కలు వేసి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని బూట్లకు అంటిన మరకల మీద రాయాలి. అయిదు నిమిషాల తరవాత తడి గుడ్డతో తుడిచేస్తే సరిపోతుంది.

● ఒక గిన్నెలో రెండు చెంచాల లిక్విడ్ డిటర్జెంట్ వేసి రెండు చెంచాల వేడినీళ్లు పోసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని బూట్లకు పట్టించాలి. అయిదు నిమిషాల తరవాత మెత్తని బ్రష్‌తో రుద్ది తడి స్పాంజ్‌తో శుభ్రంగా తుడిచేస్తే బూట్లు కొత్తవాటిలా మెరుస్తాయి.

● లెదర్ బూట్ల మీద కొద్దిగా బాడీ లోషన్ రాయాలి. అయిదు నిమిషాల తరవాత పలుచన్ని వస్త్రంతో తుడిచేస్తే మురికి మొత్తం వదిలిపోతుంది.

● కాన్వాస్ బూట్ల మీద పాత టూత్‌బ్రష్‌తో మెల్లగా రుద్దితే చాలావరకు మురికి తొలగిపోతుంది. తరవాత తడిగుడ్డను అద్దుతూ తుడిస్తే బూట్లు పూర్తిగా శుభ్రమవుతాయి.

● తెల్లటి బూట్లు మారికిగా మారినప్పుడు వాటి మీద తెల్లని టూత్‌పేస్ట్ రాయలి. రెండు నిమిషాల తరవాత వాటిపై కొన్ని నీళ్ల చుక్కలు చల్లాలి. వెంటనే పాత టూత్‌బ్రష్‌తో రుద్ది పొడిగుడ్డ లేదా స్పాంజ్‌తో తుడిచేస్తే మరకలన్నీ తొలగిపోతాయి.

దిక్సూచి



క్యాట్ 2025

దేశంలోని ప్రీమియర్ మేనేజ్‌మెంట్ సంస్థల్లో అడ్మిషన్‌కు ఉద్దేశించిన 'కామన్ అడ్మిషన్ టెస్ట్'(క్యాట్) నోటిఫికేషన్ వెలువడింది. ఈ ఎంట్రెన్స్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎమ్) మాత్రమే కాకుండా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ-ఢిల్లీ, కోల్‌కతా), ఐఐటీల్లోని ఎంబీఏ కోర్సులు, టాప్ బిజినెస్ స్కూల్స్‌లో అడ్మిషన్ల కోసం కూడా ఉపయోగపడుతుంది. దేశ వ్యాప్తంగా 170 నగరాల్లో ఈ ఎంట్రెన్స్‌ను నిర్వహించనున్నారు. మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ ఎంట్రెన్స్‌కు గత సంవత్సరం 2.93 లక్షల మంది హాజరయ్యారు.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ పాసైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు 45 శాతం చాలు.

పరీక్ష విధానం: గత సంవత్సరం ప్రశ్నపత్రం ఇలా ఉంది. మొత్తం మార్కులు 204. మొత్తం ప్రశ్నలు 68. ఇందులో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 48, నాన్ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు 20. ప్రతీ విభాగానికి 40 నిమిషాల చొప్పున మొత్తం సమయం రెండు గంటలు ఉంటుంది. ఎంసీక్యూలకు మాత్రం నెగెటివ్ మార్కులు ఉంటాయి. నాన్ ఎంసిక్యూలకు నెగెటివ్ మార్కులు లేవు.

- వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్ - 24 ప్రశ్నలు
- డేటా ఇంట్రప్రిటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్ - 22 ప్రశ్నలు
- క్వాంటిటేటివ్ ఎబిలిటీ - 22 ప్రశ్నలు

ఈ సంవత్సరం కూడా పెద్దగా మార్పులు లేకుండా ఇలాగే ఉండే అవకాశం ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులు సిద్ధం అయితే మంచిది.

ప్రిపరేషన్ టిప్స్: భారతదేశంలో అత్యంత పోటీ ఉన్న పరీక్షల్లో 'క్యాట్ ఎంట్రెన్స్ ఒకటి. వంద పర్సంటైల్ ఉన్నవారికి కూడా అహ్మదాబాద్‌లోని ఐఐఎంలో సీటు వస్తుందన్న గ్యారంటీ లేదు. సీటు సాధించడంలో పర్సంటైల్‌తోపాటు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అయితే పరీక్షలో మంచి మార్కులు వస్తేనే ఆ దశకు చేరుకోగలుగుతారు. అందుకోసం కొన్ని మెలకువలను పాటించాలి.

టైమ్ మేనేజ్‌మెంట్: క్యాట్ ప్రిపరేషన్‌లో ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం ఇది. ప్రతీ సెక్షన్ సమాధానాలను 40 నిమిషాల్లో పూర్తిచేయాలి. అందుకోసం ప్రిపరేషన్ సమయంలో స్పీడ్, ఆక్యురసీపై బాగా దృష్టిపెట్టాలి.

షార్ట్‌కట్ టెక్నిక్: నిర్ణీత సమయంలో సమాధానాలు గుర్తించాలంటే షార్ట్‌కట్ పద్ధతులు అనుసరించాల్సిందే. ప్రిపరేషన్ సమయంలో మెంటార్లు చెప్పే మెలకువలను బాగా గుర్తుంచుకుని పాటించాలి. ముఖ్యమైన వాటిని ఒక దగ్గర రాసుకుని తరచుగా రివ్యూ చేసుకుంటూ ఉండాలి.

గత ప్రశ్నపత్రాలు సాల్వ్ చేయడం: గత సంవత్సరాల ప్రశ్న పత్రాలను సాల్వ్ చేయడం ద్వారా డిఫికల్టీ లెవెల్ బాగా అర్థం అవుతుంది. అలాగే మాక్‌టెస్టులు రాయడం వల్ల నిర్ణీత సమయంలో సాల్వ్ చేయగలుగుతున్నారా లేదా అనేది చెక్ చేసుకోగలుగుతారు. అలాగే తమ బలాలు, బలహీనతలు తెలుస్తాయి.

- క్యాట్‌లో మరో ముఖ్యమైన విషయం ఏమంటే చాయిస్ ఆఫ్ క్వశ్చన్స్. అటెంప్ట్ చేయకముందే దానిని పూర్తి చేయగలం అనే నమ్మకం ఉన్నప్పుడు మాత్రమే దానిని సాల్వ్ చేయడానికి ప్రయత్నించాలి.
- వొకాబులరీ, రీడింగ్ స్కిల్స్ మెరుగు పరుచుకోవడానికి పుస్తకాలు, దినపత్రికలు, అందులోని ఎడిటోరియల్స్, జర్నల్స్ క్రమం తప్పకుండా చదవాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 13
పరీక్ష తేదీ: 2025 నవంబర్ 30
ఫలితాలు: 2026 జనవరి మొదటి వారం
వెబ్‌సైట్: https://iimcat.ac.in

ఐబీపీఎస్‌లో 10,277 క్లర్క్ పోస్టులు

క్లర్క్ పోస్టుల భర్తీకి 'ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్'(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో క్లర్క్ పోస్టులను భర్తీ చేస్తారు. మొత్తం 10,277 పోస్టులు ఉన్నాయి. ఇందులో తెలంగాణలో 261, ఆంధ్రప్రదేశ్‌లో 367 ఖాళీలు ఉన్నాయి. ఆసక్తి, అర్హతలు గల అభ్యర్థులు ఐబీపీఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. కంప్యూటర్‌లో సర్టిఫికెట్/ డిప్లొమా/ డిగ్రీ సర్టిఫికెట్ లేదా స్కూలు, కాలేజీలో కంప్యూటర్ సబ్జెక్ట్ అయినా ఉండాలి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షల ద్వారా ఎంపిక జరుగుతుంది. స్థానిక భాషలో రాయడం, చదవడం వచ్చి ఉండాలి.

పరీక్ష విధానం: ప్రిలిమినరీ ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుంది. 60 నిమిషాల వ్యవధిలో వంద ప్రశ్నలకు సమాధానాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. వీటికి వంద మార్కులు ఉంటాయి.

ఇంగ్లిష	30 ప్రశ్నలు	30 మార్కులు	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు

ఇందులో అర్హత సాధించిన వారికి మెయిన్ పరీక్షకు పిలుస్తారు. ఇది కూడా ఆబ్జెక్టివ్ పరీక్షనే. ఇక్కడ 200 మార్కులు 155 ప్రశ్నలు ఉంటాయి. వీటికి రెండు గంటల్లో సమాధానాలు గుర్తించాలి.

జనరల్/ ఫైనాన్షియల్ అవేర్‌నెస్	40 ప్రశ్నలు	50 మార్కులు	20 నిమిసాలు
జనరల్ ఇంగ్లిష్	40 ప్రశ్నలు	40 మార్కులు	35 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	40 ప్రశ్నలు	60 మార్కులు	35 నిమిషాలు
క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్	35 ప్రశ్నలు	50 మార్కులు	30 నిమిషాలు

వయస్సు: అభ్యర్థుల వయస్సు 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1997 ఆగస్ట్ 2 నుంచి 2005 ఆగస్ట్1 లోపు జన్మించి ఉండాలి(రెండు తేదీలను కలుపుకొని). ఎస్సీ/ఎస్టీలకు ఐదు సంవత్సరాలు, ఓబీసీలకు మూడు సంవత్సరాలు, దివ్యాంగులకు పది సంవత్సరాలు, వితంతువులు/ విడాకులు పొందిన మహిళలు 35 సంవత్సరాల వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మాజీ మిలిటరీ ఉద్యోగులకు నిబంధనలు అనుసరించి సడలింపు ఉంటుంది.

ఖాళీలు ఉన్న బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

దరఖాస్తు ఫీజు: రూ.850/-. ఎస్సీ/ ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ ఈఎస్ఎమ్/డీఈఎస్ఎమ్ అభ్యర్థులకు రూ.175/-.
ప్రిలిమినరీ పరీక్ష: 2025 అక్టోబర్
మెయిన్స్ పరీక్ష: 2025 నవంబర్
చివరి తేదీ: 2025 ఆగస్ట్ 21
వెబ్‌సైట్: ibps.in

జాబ్ కార్నర్

పదో తరగతితో ఐబీలో..

మొత్తం ఖాళీలు 4,987

కేంద్ర హోం మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ)లో దేశవ్యాప్తంగా 4987 సెక్యూరిటీ అసిస్టెంట్/ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇందులో తెలంగాణకు 117 పోస్టులు, ఆంధ్రప్రదేశ్‌కు 115 పోస్టులు ఉన్నాయి.

అర్హత: పదో తరగతి పాసై ఉండాలి. దరఖాస్తు చేసిన రాష్ట్రానికి సంబంధించిన నివాస ధృవీకరణ పత్రం తప్పనిసరిగా ఉండాలి. స్థానిక భాష రాయడం, మాట్లాడడం, చదవడం వచ్చి ఉండాలి. ఇంటెలిజెన్స్ ఫీల్డ్ అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

వయస్సు: 2025 ఆగస్టు 17 నాటికి 18-27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు వయో పరిమితిలో మూడేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం:

టైర్-1: వంద మార్కులకు ఆబ్జెక్టివ్ టెస్ట్ ఉంటుంది. 60 నిమిషాల్లో సమాధానాలు గుర్తించాలి. ఇందులో జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, న్యూమరికల్/అనలిటికల్, లాజికల్ ఎబిలిటీ అండ్ రీజనింగ్, ఇంగ్లిష్ నుంచి ప్రశ్నలు వస్తాయి. నెగెటివ్ మార్కింగ్ ఉంది.

టైర్-2: యాభై మార్కులకు భాషా అనువాదం డిస్క్రిప్టివ్ టెస్ట్ ఉంటుంది. వ్యవధి ఒక గంట. ఇది క్వాలిఫైయింగ్ టెస్ట్ మాత్రమే.

టైర్-3: ఇంటర్వ్యూ యాభై మార్కులకు ఉంటుంది.

చివరి తేదీ: ఆగస్టు 17
వెబ్‌సైట్: www.mha.gov.in/en

ఎయిమ్స్ & ఇతర సంస్థల్లో..

అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)తోపాటు, ఇతర జాతీయ వైద్య సంస్థల్లో నర్సింగ్ పోస్టుల భర్తీ జరగనుంది. ఎయిమ్స్, జిప్మర్, ఈఎస్ఐసీల్లోని ఖాళీలను ఈ నోటిఫికేషన్ ద్వారా నింపనున్నారు.

అర్హత: బీఎస్సీ నర్సింగ్ / పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎంతోపాటు, కనీసం 50 పడకల ఆస్పత్రిలో రెండేళ్ల పని అనుభవం.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 30 సంవత్సరాల లోపు ఉండాలి. రిజర్వేషన్‌లను బట్టి సడలింపు ఉంటుంది.

చివరి తేదీ: 2025 ఆగస్ట్ 11
పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్14న స్టేజ్-1 పరీక్ష, 2025 సెప్టెంబర్ 27 స్టేజ్-2 పరీక్ష.
వెబ్‌సైట్: www.aiimsexams.ac.in

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నాకు గొప్ప పేరు తెచ్చిన చిత్రమిది

- సత్యదేవ్



'కింగ్‌డమ్' సినిమా మొదటి ఆట చూసినప్పటి నుంచి ప్రేక్షకులు, స్నేహితులు ఫోన్లు చేసి అభినందిస్తున్నారు. నటుడిగా నాకు గొప్ప పేరు తెచ్చిన చిత్రమిది' అని సత్యదేవ్ అన్నారు. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించిన చిత్రమిది. ప్రేక్షకాదరణతో కొనసాగుతోన్న సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన సత్యదేవ్ మీడియాతో మాట్లాడారు. 'శివ పాత్ర కోసం దర్శకుడు గౌతమ్ మొదట నా పేరే రాసుకున్నారట. కథ నచ్చి వెంటనే ఓకే చెప్పాను. యాక్షన్ సీక్వెన్స్ ప్రేక్షకులకు కనెక్ట్ అవ్వాలంటే దాని వెనుక బలమైన ఎమోషన్ ఉండాలని నేను నమ్ముతాను. 'కింగ్‌డమ్'లో అలాంటి ఎమోషన్ ఉంది కాబట్టే నా యాక్షన్ సీన్స్‌కి అంత మంచి స్పందన వస్తోంది. ప్రీ క్లయిమాక్స్ ఎపిసోడ్ కోసం చాలా కష్టపడ్డాం. ఇప్పుడు ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన చూశాక..ఆ కష్టమంతా మరచిపోయాను' అని సత్యదేవ్ చెప్పారు.

వేతన పెంపు లేకుంటే షూటింగ్స్ బంద్

- ఫిల్మ్ ఫెడరేషన్ నిర్ణయం

వేతనాలు పెంచేవరకూ 24 కార్మిక సంఘాలు షూటింగ్స్‌లో పాల్గొనకూడదని టాలీవుడ్ ఫిల్మ్ ఫెడరేషన్ నిర్ణయం తీసుకుంది. ఫిల్మ్ ఛాంబర్, ఫిల్మ్ ఫెడరేషన్‌కు మధ్య జరుగుతున్న చర్చలు విఫలం కావడంతో ఫెడరేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. వేతనాల పెంపు డిమాండ్‌పై చర్చించేందుకు ఆదివారం ఫిల్మ్ ఫెడరేషన్ సర్వసభ్యసమావేశం నిర్వహించింది. ఇందులో తీసుకున్న కీలక నిర్ణయాలను ఫెడరేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. నేటి (ఆగస్టు 04) నుంచి 30 శాతం వేతనాలు పెంచుతామని హామీ పత్రం ఇచ్చిన నిర్మాతల షూటింగ్స్‌కు మాత్రమే వెళ్లాలి, వేతనాల పెంపు అమలు చేయని సినిమాల షూటింగ్స్‌కు వెళ్లకూడదని తీర్మానించింది. పెంచిన వేతనాలను ఏ రోజుకారోజే చెల్లించే విధానం అమలు చేయాలనీ, ఫెడరేషన్ ద్వారా యూనియన్లకు తెలియజేసిన తర్వాతనే షూటింగ్స్‌లో పాల్గొనాలని 24 కార్మిక సంఘాలకు తెలిపింది.

కనీస వేతనాల కంటే ఎక్కువే ఇస్తున్నాం

ఫెడరేషన్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఫిల్మ్ ఛాంబర్ స్పందించింది. 'ఫెడరేషన్ పక్షపాతంతో 30 శాతం వేతనాల పెంపును డిమాండ్ చేస్తోంది. ప్రస్తుత చట్టాల ప్రకారం నైపుణ్యం ఉన్నవారికి, లేనివారికి కనీస వేతనాల కంటే ఎక్కువే ఇస్తున్నాం. ఈ సమ్మె నిర్ణయం నిర్మాణంలో ఉన్న చిత్రాలకు భారీ నష్టాన్ని కలిగిస్తుంది. ఫెడరేషన్‌తో కలసి పనిచేస్తున్న మనం ఈ నిర్ణయాన్ని ఖండిస్తున్నాం. ఈ సమస్యకు స్థిరమైన పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్చిస్తాం. అంతవరకూ నిర్మాతలు ఎలాంటి స్వతంత్ర చర్యలు గానీ సంఘాలతో ప్రత్యేక ఒప్పందాలు గానీ చేసుకోకుండా ఛాంబర్ మార్గదర్శకాలను అనుసరించాలని కోరుతున్నాం. శాశ్వత పరిష్కారం కోసం, మెరుగైన భవిష్యత్తు కోసం ఐక్యతతో ఉండాలి. మరిన్ని వివరాలు త్వరలోనే ప్రకటిస్తాం' అని ఫిల్మ్ ఛాంబర్ పేర్కొంది.

ఈ సినిమాను పవన్ చూడాలి

- నిర్మాత అల్లు అరవింద్



'మా కుటుంబంలో, సన్నిహితులు, పరిచయం ఉన్నవారందరిలో సనాతన ధర్మం గురించి పవన్ కల్యాణ్‌కు తెలిసినంతగా మరెవరికీ తెలియదు. ఆయన సనాతన ధర్మం గురించి ప్రసంగిస్తే అందరూ ముగ్ధులవుతారు. 'మహావతార్ నరసింహ' సినిమాని ఆయన చూడాలని, దాని గురించి మాట్లాడాలని కోరుకుంటున్నా' అని అన్నారు నిర్మాత అల్లు అరవింద్. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ సంస్థ నిర్మించిన 'మహావతార్ నరసింహ' సినిమా ఇటీవలె విడుదలై మంచి ప్రేక్షకాదరణతో థియేటర్లలో ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సక్సెస్ మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ 'భారతదేశమంతటా ప్రేక్షకులు ఈ సినిమాకు జేజేలు పలుకుతున్నారు. హైదరాబాద్‌లోని ఏఎంబీలో 200 మంది స్వాములు ఈ చిత్రాన్ని చూడటం నాకు చాలా ఆనందంగా అనిపించింది' అని అన్నారు.

నవ్వుల పండగ



కన్నడనాట ఇటీవలె విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న చిత్రం 'సు ఫ్రమ్ సో'. తాజాగా ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. ఈనెల 8న మైత్రీ మూవీమేకర్స్ విడుదల చేస్తోంది. జేపీ తుమినాడ్ కథానాయకుడిగా నటించి దర్శకత్వం వహించారు. షనీల్ గౌతమ్, సంధ్య అరకెరె ప్రధాన పాత్రలు పోషించారు. రాజ్.బి.శెట్టి, శశిధర్ శెట్టి బరోడా, రవిరాయ్ కలస నిర్మించారు. ఆసక్తికరమైన కథ, కథనంతో నిండిన ఈ చిత్రం ప్రేక్షకులకు నవ్వుల పండగను అందిస్తుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేశారు.

యువతా నీ గమ్యం ఎటు వైపు?



హీరో కృష్ణసాయి కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'డేంజర్'. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 'ఓ యువతా నీ గమ్యం ఎటు వైపు? అంటూ సందేశాత్మకంగా సాగే గీతాన్ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా కృష్ణసాయి మాట్లాడుతూ 'తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపు మేరకు మా బాధ్యతగా డ్రగ్స్‌పై ఓ చైతన్యవంతమైన గీతాన్ని రూపొందించాం. మా ప్రయత్నాన్ని గవర్నర్లు, పోలీస్ అధికారులు ప్రశంసించారు. ఈ సినిమా ప్రజలను ప్రభావితం చేస్తుంది. యువతలో మార్పు తీసుకొస్తుందనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

కొరియోగ్రాఫర్ కృష్ణపై పోక్సో కేసు

టాలీవుడ్‌లో మరో లైంగిక ఆరోపణల కేసు నమోదైంది. మైనర్ బాలికపై లైంగిక దాడి చేశాడన్న ఆరోపణలపై కొరియోగ్రాఫర్ కృష్ణ మాస్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ హబీబుల్లాఖాన్ తెలిపిన వివరాల ప్రకారం ఓ పెళ్లయిన మహిళతో కృష్ణ మాస్టర్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనీ, ఈ క్రమంలో ఆమె కూతురిపై కూడా కృష్ణ లైంగిక దాడి చేశాడంటూ సదరు మహిళ జూలై 9న ఫిర్యాదు చేశారు. దీంతో గచ్చిబౌలి పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరు పరచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

ముగింపును మార్చడం నన్ను బాధించింది

- ధనుష్



ధనుష్ కథానాయకుడిగా ఆనంద్.ఎల్.రాయ్ తెరకెక్కించిన 'రాంఝనా' 2013లో విడుదలై సంచలన విజయం సాధించింది. ఇందులోని పాటలు, భావోద్వేగాలు అందరినీ ఆకట్టుకోగా, ముగింపు చాలా మందిని కంటతడి పెట్టించింది. ఇటీవలె ఈ సినిమాను తమిళనాడులో రీ రిలీజ్ చేశారు. అయితే, ఏఐ సాయంతో ఇందులోని క్లైమాక్స్‌ను నిర్మాతలు మార్చారు. 2013లో విడుదలైన ఒరిజినల్ వెర్షన్ ముగింపులో తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరిన హీరో చికిత్స తీసుకుంటూ చనిపోతాడు. అయితే, కొత్తగా విడుదల చేసిన వెర్షన్‌లో హీరో కోలుకున్నట్టు చూపించారు. దీనిపై నెట్టింట భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వెర్షన్ చూసిన ఫ్యాన్స్ కొందరు ఆనందం వ్యక్తం చేస్తుండగా, దీనిపై ధనుష్, ఆనంద్.ఎల్.రాయ్‌తో పాటు మరికొందరు అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈ సినిమా ముగింపును మార్చడం నన్ను కలచి వేసింది. క్లైమాక్స్ మార్పు, సినిమా ఆత్మను దెబ్బతీసింది. నేను వద్దంటున్నా ఈ రీ రిలీజ్‌కు ముందుకెళ్లారు. 12 ఏళ్ల క్రితం నేను చేసిన సినిమా ఇది కాదు. ఇలా ఏఐతో సినిమా కంటెంట్‌ను మార్చడం కళతో పాటు కళాకారులకు తీవ్ర ఆందోళన కలిగించే విషయం. ఇలాంటి పనులు కథ చెప్పే విధానానికీ, సినిమా వారసత్వానికీ ప్రమాదకరం. భవిష్యత్తులో ఇలాంటివి మరోసారి జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నాను' అని ధనుష్ ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇలా కృత్రిమ మేధ సాయంతో సినిమా కంటెంట్‌ను మార్చే ప్రయత్నం అర్థరహితమైంది. 12 ఏళ్లుగా ఈ సినిమాను తమ హృదయాల్లో పదిలంగా దాచుకున్న అభిమానుల నమ్మకాన్ని వమ్ము చేయడమే' అని ఆనంద్.ఎల్.రాయ్ విమర్శించారు.

అలరించే కామెడీ థ్రిల్లర్



ప్రవీణ్ హీరోగా తెరకెక్కిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్ జే శివ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటించారు. లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 8న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో హీరో సుధీర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ 'ప్రవీణ్ ఈ సినిమాతో హీరోగా మారుతున్నందుకు సంతోషంగా ఉంది. 'బకాసుర రెస్టారెంట్' ఘన విజయం అందుకోవాలి' అని ఆకాంక్షించారు. ప్రవీణ్ మాట్లాడుతూ 'నా మీద నమ్మకంతో హీరోగా పెట్టి సినిమా తీసిన మా దర్శక నిర్మాతలకు నా ధన్యవాదాలు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది' అని చెప్పారు. దర్శకుడు ఎస్‌జే శివ మాట్లాడుతూ 'ఈ సినిమా ఆద్యంతం ప్రేక్షకులకు నవ్వులు పంచుతుంది' అని అన్నారు.

స్పోర్ట్స్

రసపట్టులో..


ప్రసిద్ధ్ కృష్ణ (3/109)

విజయానికి

35 రన్స్ దూరంలో ఇంగ్లండ్ | **4 వికెట్ల వేటలో భారత్**

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 339/6

రూట్, బ్రూక్ శతక మోత

ఆఖరి టెస్టు

లండన్: ఓవల్ టెస్టులో హైటెన్షన్.. నాలుగో రోజే ముగుస్తుందనుకున్న మ్యాచ్ ఆఖర్లో వర్షం ఇచ్చిన ట్విస్ట్‌కు ఐదో రోజుకు చేరింది. అయితే హ్యారీ బ్రూక్ (111), జో రూట్ (105) అద్భుత శతకాలతో ఆఖరి మ్యాచ్‌నే కాదు, సిరీస్ కూడా కోల్పోయినట్టే అనుకున్న వేళ.. భారత జట్టు అనూహ్యంగా పుంజుకుంది. చివరి సెషన్‌లో కేవలం 57 పరుగుల కోసం బరిలోకి దిగిన ఆతిథ్య జట్టును భారత పేసర్లు వణికించారు. ప్రసిద్ధ్ కృష్ణ వరుస ఓవర్లలో రెండు వికెట్లు తీసి భారత్ విజయంపై ఆశలు రేపాడు. అయితే వర్షం రావడంతో గంటన్నర ముందుగానే ఆటను ముగించారు. విజయానికి ఇంగ్లండ్ 35 పరుగుల దూరంలో ఉండగా.. వోక్స్ బరిలోకి దిగితే భారత్‌కు మరో 4 వికెట్లు కావాల్సిందే. ప్రస్తుతం ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 339/6 స్కోరుతో ఉండగా.. క్రీజులో జేమీ స్మిత్ (2), ఒవర్టన్ (0) ఉన్నారు. ప్రసిద్ధ్‌కు మూడు, సిరాజ్‌కు రెండు వికెట్లు దక్కాయి. సోమవారం తొలి గంట ఆట ఇరు జట్లలో విజయం ఎవరిదో తేల్చనుంది.

పోటీ సమంగా..: ఓవర్‌నైట్ స్కోరు 50/1తో నాలుగో రోజు ఇంగ్లండ్ భారీ ఛేదనను ఆరంభించింది. అయితే ఈ సెషన్‌లో ఇరుజట్ల నుంచి పోటాపోటీ ప్రదర్శన ఎదురైంది. ముఖ్యంగా పేసర్ సిరాజ్ అలుపెరుగని ఎనిమిది ఓవర్ల స్పెల్‌తో డకెట్, పోప్‌లను ఇబ్బందిపెట్టాడు. అయితే జోరుమీదున్న డకెట్‌ను తొలి గంటలోనే ప్రసిద్ధ్ అవుట్ చేశాడు. అటు పోప్ మాత్రం ప్రసిద్ధ్ ఓవర్‌లో మూడు ఫోర్లు రాబట్టాడు. కానీ తర్వాతి ఓవర్‌లోనే అతడిని సిరాజ్ అవుట్ చేశాడు. ఇక బ్రూక్ నిలదొక్కుకునేందుకు కాస్త సమయం తీసుకున్నా.. ఆకాశ్ ఓవర్‌లో 4,6తో టచ్‌లోకి వచ్చాడు. తర్వాతి ఓవర్‌లోనే 6,4,4తో 16 రన్స్ పిండుకున్నాడు. ఈ సెషన్‌లో ఇంగ్లండ్ రెండు వికెట్లు కోల్పోయినా 114 పరుగులు రాబట్టింది.

బ్రూక్ భళా: రెండో సెషన్‌లో ఇంగ్లండ్ తమ బాజ్‌బాల్ గేమ్‌ను బయటికి తీసింది. విజయానికి 210 పరుగుల దూరంలో ఉండగా.. బ్రూక్ ఒక్కసారిగా బ్యాట్‌కు పనిజెప్పాడు. దీంతో సెషన్ ముగిసేసరికి అతను అద్భుత శతకం పూర్తిచేసుకోగా.. అటు రూట్ 98 రన్స్‌తో బ్రేక్‌కు వెళ్లాడు. దీంతో.. ఇంగ్లండ్ విజయానికి కేవలం 57 పరుగుల దూరంలో నిలిచి భారత్‌లో ఓటమి భయాన్ని పెంచింది. కాగా.. ఆరంభ ఓవర్‌లోనే బ్రూక్ రెండు ఫోర్లతో తన ఉద్దేశాన్ని చాటాడు. అటు భారత పేసర్లు తీవ్రంగా అలసిపోయినట్టు కనిపించారు. ఈ క్రమంలో 39 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసిన బ్రూక్, ఆ తర్వాత కూడా చెలరేగి 91 బంతుల్లో కెరీర్‌లో పదో శతకం అందుకున్నాడు. అయితే ఆ వెంటనే ఆకాశ్ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లు బాది మిడాఫ్‌లో సిరాజ్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. అప్పటికే రూట్‌తో కలిసి అతను నాలుగో వికెట్‌కు 195 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడం విశేషం. ఈ సెషన్ ముగియగానే వర్షం రావడంతో ఆఖరి సెషన్ పది నిమిషాలు ఆలస్యంగా ఆరంభమైంది.

బౌలర్లు పుంజుకుని..: చివరి సెషన్‌లో పట్టు వీడని భారత బౌలర్లు మ్యాచ్‌ను ఆసక్తికరంగా మార్చారు. ఈ సెషన్ ఆరంభంలోనే రూట్ శతకాన్ని పూర్తి చేయగా.. మరో ఎండ్‌లో బెథెల్ (5) నిర్లక్ష్యపు షాట్‌తో భారత్‌కు చాన్స్ ఇచ్చాడు. బెథెల్‌ను ప్రసిద్ధ్ బౌల్డ్ చేశాడు. అటు బంతి కూడా చక్కగా మూవ్ కావడంతో బౌలర్లకు పట్టు దొరికింది. సిరాజ్ కూడా వికెట్లను లక్ష్యంగా చేసుకుని బంతులు విసరడంతో ఇంగ్లండ్‌కు పరుగులు రావడమే గగనమైంది. 39వ టెస్టు సెంచరీ పూర్తి చేసుకున్న రూట్ వికెట్‌ను కూడా ప్రసిద్ధ్ తీయడంతో భారత్‌కు మ్యాచ్‌పై పట్టు లభించింది. ఆట ఆగే సమయానికి చివరి ఆరు ఓవర్లలో ఇంగ్లండ్ 8 పరుగులే చేసి 2 వికెట్లు కోల్పోయింది.


హ్యారీ బ్రూక్ (111)


జో రూట్ (105)

1 ఓ టెస్టు సిరీస్‌లో 9 మంది బ్యాటర్లు 400+ స్కోరు నమోదు చేయడం ఇదే తొలిసారి. అలాగే వీరి నుంచి రికార్డు స్థాయిలో 21 శతకాలు రావడం విశేషం.

1 భారత్‌తో జరిగిన సిరీస్‌ల్లో ఎక్కువ సార్లు (3) 500+ పరుగులు చేసిన బ్యాటర్‌గా జో రూట్. అలాగే ఒకే జట్టు (భారత్)పై ఎక్కువ (13) సెంచరీలు బాదిన రెండో బ్యాటర్‌గా గవాస్కర్ (విండీస్‌పై)తో రూట్ సమంగా నిలిచాడు. బ్రాడ్‌మన్ (ఇంగ్లండ్‌పై 19) టాప్‌లో ఉన్నాడు. ఓవరాల్‌గా స్వదేశంలో ఎక్కువ (24) సెంచరీలు సాధించిన ప్లేయర్‌గానూ రూట్ రికార్డులకెక్కాడు. అంతేకాదు.. ఛేజింగ్‌లో ఎక్కువ (13) 50+ స్కోర్లలోనూ గేల్, చందర్‌పాల్, గ్రేమ్ స్మిత్‌తో సమంగా నిలిచాడు.

సిరాజ్ నియంత్రణ కోల్పోయి..

ఐదో టెస్టు నాలుగో రోజు ఆటలో హ్యారీ బ్రూక్ మెరుపు శతకం అత్యంత కీలకంగా నిలిచింది. అయితే అతను 19 పరుగుల వద్దే వెనుదిరగాల్సింది. ప్రసిద్ధ్ ఓవర్‌లో బ్రూక్ భారీ షాట్ ఆడగా గాల్లోకి లేచిన బంతిని ఫైన్ లెగ్‌లో సిరాజ్ అందుకున్నాడు. కానీ నియంత్రణ కోల్పోయిన సిరాజ్ బౌండరీ లైన్‌ను తాకడంతో అది కాస్తా సిక్స్‌గా మారింది. ఇక అదే ఓవర్‌లో రెండు ఫోర్లు బాదిన బ్రూక్ మరో 91 పరుగులు సాధించి సెంచరీ పూర్తి చేయడమే కాదు.. రూట్‌తో కలిసి భారీగా పరుగులు జత చేసి భారత్‌పై తీవ్ర ఒత్తిడి పెంచాడు. బ్రూక్ ముందే అవుటై ఉంటే ఈ టెస్టులో గిల్ సేన పరిస్థితి మరింత మెరుగ్గా ఉండేది .





స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 224;
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 247;
భారత్ రెండో ఇన్నింగ్స్: 396;

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (బి) సిరాజ్ 14, డకెట్ (సి) రాహుల్ (బి) ప్రసిద్ధ్ 54, పోప్ (ఎల్బీ) సిరాజ్ 27, రూట్ (సి) జురెల్ (బి) ప్రసిద్ధ్ 105, బ్రూక్ (సి) సిరాజ్ (బి) ఆకాశ్ 111, బెథెల్ (బి) ప్రసిద్ధ్ 5, స్మిత్ (బ్యాటింగ్) 2, ఒవర్టన్ (బ్యాటింగ్) 0, ఎక్స్‌ట్రాలు: 21; **మొత్తం: 76.2 ఓవర్లలో 339/6;** **వికెట్ల పతనం:** 1-50, 2-82, 3-106, 4-301, 5-332, 6-337; **బౌలింగ్:** ఆకాశ్ దీప్ 20-4-85-1, ప్రసిద్ధ్ కృష్ణ 22.2-3-109-3, సిరాజ్ 26-5-95-2, వాషింగ్టన్ సుందర్ 4-0-19-0, జడేజా 4-0-22-0.

అనిరుధ్ జోడీకి 'లెక్సింగ్టన్' ట్రోఫీ



లెక్సింగ్టన్(యూఎస్): హైదరాబాద్ టెన్నిస్ ఆటగాడు అనిరుధ్ చంద్రశేఖర్ అంతర్జాతీయ వేదికపై మెరిశాడు. సహచరుడు రామ్‌కుమార్‌తో కలిసి యూఎస్‌లో జరిగిన లెక్సింగ్టన్ చాలెంజర్ టోర్నీ డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో అనిరుధ్/రామ్ జోడీ 6-4, 6-4తో తైపీ జంట యు హిషియు-హా హువాంగ్‌పై గెలిచింది.

భారత జోడీలకు రన్నరప్ టైటిళ్లు



న్యూఢిల్లీ: బ్రెజిల్‌లో జరిగిన ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ టోర్నీలో భారత జోడీలు రన్నరప్ టైటిళ్లతో సరిపెట్టుకున్నాయి. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో భారత ద్వయం మానుష్ షా/దియా చితాలే 4-11, 11-8, 11-5, 5-11, 2-11తో జపాన్ జంట సతోషి/హానాకా చేతిలో ఓటమి పాలైంది. పురుషుల డబుల్స్ టైటిల్‌పోరులో భారత జోడీ మానుష్/మానవ్ 3-11, 11-7, 7-11, 15-13, 5-11తో జర్మనీకి చెందిన బెనెడిక్ట్/డాంగ్ చేతిలో పరాజయం పాలైంది. ఇక మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో మనికా బాత్రా 7-11, 6-11, 7-11తో హషిమోటో (జపాన్) చేతిలో ఓడింది.

శ్రీశంకర్ వరుసగా మూడోసారి..

న్యూఢిల్లీ: భారత లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ వరుసగా మూడో అంతర్జాతీయ టైటిల్ సాధించాడు. కజకిస్థాన్‌లోని అల్మాటీలో జరిగిన కొసనోవ్ మెమోరియల్ అథ్లెటిక్స్ మీట్‌లో శ్రీశంకర్ 7.94 మీటర్లు లంఘించి విజేతగా నిలిచాడు. ఇటీవలే ఇండియన్ ఓపెన్, పోర్చుగల్ మీట్‌లో శ్రీశంకర్ గెలిచాడు.

భావన, యాత్రికి పతకాలు ఖరారు

బ్యాంకాక్: ఆసియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ అండర్-22 మహిళల విభాగంలో భారత్‌కు చెందిన భావనా శర్మ, యాత్రి పటేల్ సెమీస్‌కు చేరారు. దాంతో భారత్‌కు కనీసం రెండు కాంస్య పతకాలు ఖరారయ్యాయి. ఆదివారం జరిగిన 48 కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో భావన.. వియత్నాం బాక్సర్ చి ఎన్‌గోని చిత్తు చేసింది. 57 కిలోల కేటగిరీలో యాత్రి.. శ్రీలంకకు చెందిన కీర్తనపై విజయం సాధించింది.

అరె ఓ సాంబా..

బ్రెజిల్ మహిళలదే కోపా అమెరికా కప్



క్విటో (ఈక్వెడార్): కోపా అమెరికా కప్ మహిళల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌ను బ్రెజిల్ జట్టు తొమ్మిదోసారి కైవసం చేసుకుంది. ఆదివారం కొలంబియాతో జరిగిన ఫైనల్లో బ్రెజిల్ షూటౌట్‌లో 5-4తో విజయం సాధించింది.

హంగేరియన్ ఎఫ్1 విజేత నోరిస్



బుడాపెస్ట్: మెక్‌లారెన్ ఎఫ్1 డ్రైవర్ ల్యాండో నోరిస్ హంగేరియన్ గ్రాండ్ ప్రీ టైటిల్‌ను సొంతం చేసుకొన్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్ రేస్‌లో మెక్‌లారెన్‌కే చెందిన ఆస్కార్ పియాస్ట్రిని నోరిస్ ఓడించాడు. మెర్సిడెస్ డ్రైవర్ జార్జ్ రస్సెల్‌కు మూడోస్థానం దక్కింది.

చివరి బంతికి హోల్డర్ బౌండరీ


పాకిస్థాన్‌తో రెండో టీ20లో వెస్టిండీస్ ఉత్కంఠ గెలుపు

లాడర్‌హిల్ (ఫ్లోరిడా): పొట్టి క్రికెట్ ఫ్యాన్స్‌లో ఎందుకంత క్రేజో నిరూపించింది వెస్టిండీస్-పాకిస్థాన్ రెండో టీ20. శనివారం రాత్రి జరిగిన ఉత్కంఠ పోరులో ఆఖరి బంతికి విజయం అందుకున్న విండీస్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. బౌలింగ్‌లో తొలుత నాలుగు వికెట్లతో పాకిస్థాన్‌ను కట్టడి చేసిన ఆల్‌రౌండర్ జాసన్ హోల్డర్ (4/19, 16 నాటౌట్)..చివరి బంతికి బౌండరీ బాది విండీస్‌ను విజయ పథాన నిలిపాడు. మ్యాచ్‌లో తొలుత పాక్ 20 ఓవర్లలో 133/9 స్కోరుకు పరిమితమైంది. హసన్ నవాజ్ (40) టాప్ స్కోరర్. మోటీ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో విండీస్ 20 ఓవర్లలో 135/8 స్కోరు చేసి నెగ్గింది. మోటీ (28), హోప్ (21) పర్లేదనిపించారు. ఆఖరి ఓవర్లో 8 రన్స్ కావాల్సిన వేళ..అఫ్రీది రెండో బంతికి షెఫర్డ్‌ను అవుట్ చేశాడు. హోల్డర్‌తోపాటు కొత్త బ్యాటర్ షామర్ జోసెఫ్ తుదుపరి మూడు బంతుల్లో మూడు పరుగులే చేశారు. మరుసటి బంతిని అఫ్రీది వైడ్‌గా వేయడంతో.. చివరి బంతికి విండీస్ మూడు రన్స్ చేయాలి. ఈ దశలో ఒత్తిడిని అదిమిపట్టిన హోల్డర్ బంతిని బౌండరీకి తరలించి జట్టుకు అద్భుత విజయాన్ని అందించాడు.

డబ్ల్యూసీఎల్‌పై పీసీబీ నిషేధం

లాహోర్: వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్)లో పాక్ ఆటగాళ్లు పాల్గొనకుండా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిషేధం విధించింది. అంతేకాకుండా డబ్ల్యూసీఎల్ నిర్వాహకులు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని పీసీబీ ఆరోపించింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత వెటరన్ జట్టు.. లీగ్ దశలో, సెమీస్‌లో పాక్‌తో మ్యాచ్‌లను బహిష్కరించింది. అయితే, ఆడేందుకు నిరాకరించినా భారత్‌కు నిర్వాహకులు పాయింట్లు కేటాయించడాన్ని పీసీబీ తప్పుబట్టింది. భవిష్యత్‌లో ఈ టోర్నీలో పాక్ ప్లేయర్లు ఆడకుండా మొత్తంగా నిషేధం విధించింది.

బిజినెస్

ఆటుపోట్లు తప్పవు!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం కనిపిస్తోంది. అమెరికా సుంకాల ప్రభావం తక్కువే అయినప్పటికీ మారుతున్న అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలు ఇన్వెస్టర్లను కలవరపెడుతున్నాయి. పైగా అమెరికాలో నిరుద్యోగ డేటా, ద్రవ్యోల్బణం వంటివి ప్రతికూలంగా మారాయి. బెంచ్ మార్క్ సూచీలు స్వల్ప, మధ్య కాలంలో బలహీనతను సూచిస్తున్నాయి. మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

హ్యుండయ్ మోటార్స్: తాజా గరిష్ఠం తర్వాత ఈ షేరు పుల్‌బ్యాక్ అయ్యింది. 20 రోజుల మూవింగ్ యావరేజెస్ వద్ద మద్దతు తీసుకున్నాయి. తాజా ఆర్థిక ఫలితాలు, డివిడెండ్‌తో ఇన్వెస్టర్లు ఆసక్తిని కనబరుస్తున్నారు. మూమెంటమ్ బాగుంది. గత శుక్రవారం రూ.2,181 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,150 శ్రేణిలో ప్రవేశించి రూ.2,280 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.2,120 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జిందాల్ స్టెయిన్‌లెస్ స్టీల్: మార్చిలో ట్రెండ్ రివర్సల్ అయిన తర్వాత ఈ షేరు ప్రస్తుతం ఎగువ స్థాయిలో సైడ్‌వేస్‌లో చలిస్తోంది. నష్టాల మార్కెట్లోనూ బలం ప్రదర్శిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. మీడియం, షార్ట్‌టర్మ్ మూమెంటమ్ మెరుగ్గా ఉంది. గత శుక్రవారం రూ.706 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.680 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.770/800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.650 స్థాయిని కచ్చితమైన స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.

ఇమామీ: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. డెలివరీ పరిమాణం పెరుగుతోంది. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ మెరుగవుతోంది. గత శుక్రవారం రూ.619 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.600 ఎగువ స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.680 టార్గెట్ ధరతో కొనుగోలు చేయవచ్చు. రూ.585 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అంబుజా సిమెంట్: ఆరు నెలలుగా ఈ షేరు అప్‌ట్రెండ్‌లో పయనిస్తోంది. హయ్యర్ హై.. హయ్యర్ లో ఫామ్ చేస్తోంది. ప్రస్తుతం కీలక స్థాయి వద్ద ఉంది. గత శుక్రవారం రూ.607 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.570/580 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.640/680 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.550 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టీవీఎస్ మోటార్స్: మంచి అప్‌ట్రెండ్ తర్వాత ఈ షేరు కన్సాలిడేట్ అవుతోంది. అనిశ్చితి తొలగిపోయింది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ బాగుంది. గత శుక్రవారం రూ.2,858 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.2,825 వద్ద పొజిషన్ తీసుకుని రూ.2,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. రూ.2,800 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



25,900 పైన బుల్లిష్

(ఆగస్టు 4-8 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

గత వారం నిఫ్టీ: 24,565 (-272)

నిఫ్టీ గత వారం 25,889-24,535 పాయింట్ల మధ్యన కదలాడి 272 పాయింట్ల నష్టంతో 24,565 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,900 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,769, 24,834, 24,970, 25,189 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,900 బ్రేక్‌డౌన్ స్థాయి: 24,200
నిరోధ స్థాయిలు: 24,775, 24,875, 24,975
(24,675 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు:24,350, 24,250, 24,150
(24,450 దిగువన బేరిష్)

నిఫ్టీ

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4వ తేదీ			
హైదరాబాద్	435	విజయవాడ	475
వరంగల్	437	గోదావరి	470
చిత్తూరు	513	విశాఖపట్నం	470
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	104
కరీంనగర్	90	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	92
కర్నూలు	90	నెల్లూరు	97
విశాఖపట్నం	92	అనంతపురం	97
గోదావరి	99		

'ఐటీ'లో కొలువుల్లేవ్..!

7 త్రైమాసికాలుగా ఇదే పరిస్థితి ● రిక్రూట్‌మెంట్ సంస్థ క్వెస్ కార్ప్ వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ (ఐటీ) సంస్థల్లో నియామకాలు పూర్తిగా నిలిచిపోయాయి. గడచిన 6-7 త్రైమాసికాలుగా పలు ఐటీ కంపెనీలు నియామకాలను దాదాపు పక్కనబెట్టినట్లు రిక్రూట్‌మెంట్ సేవలందించే క్వెస్ కార్ప్ సంస్థ వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరుతో ముగిసే ద్వితీయ త్రైమాసికంలోనూ ఇదే పరిస్థితి కొనసాగనుందని తెలిపింది. ప్రస్తుతం ఐటీ నిపుణుల డిమాండ్‌లో దాదాపు 73 శాతం గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు (జీసీసీ), నాన్ ఐటీ కంపెనీల నుంచే వస్తోంది తప్ప.. ఐటీ కంపెనీల నుంచి పెద్దగా లేదని క్వెస్ కార్ప్ సీఈఓ,ఈడీ గురుప్రసాద్ శ్రీనివాసన్ చెప్పారు. సేవలపై ఎక్కువగా ఆధారపడిన ఐటీ కంపెనీలైతే గత ఆరేడు త్రైమాసికాలుగా నియామకాలను పూర్తిగా నిలిపివేసాయని ఆయన తెలిపారు. కొన్ని ఐటీ సేవల కంపెనీలైతే ఉన్న ఉద్యోగులకే ఇక సెలవు అని చెబుతున్నాయి. జీసీసీలు, నాన్ ఐటీ కంపెనీలు కూడా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో నైపుణ్యాలు ఉన్న ఉద్యోగులనే ఎక్కువగా నియమించుకుంటున్నాయని శ్రీనివాసన్ తెలిపారు.

ఇతర ప్రధానాంశాలు

- నియామకాలు పెంచిన తయారీ, బీఎఫ్ఎస్ఐ కంపెనీలు
- కన్స్యూమర్ రిటైల్, టెలికాం కన్స్యూమర్ రంగాల్లోనూ పెరిగిన నియామకాలు
- టెలికాం, ఫార్మా, రిటైల్ రంగాల్లో స్వల్పంగా తగ్గిన నియామకాలు
- వృత్తి నిపుణులకు మరింత డిమాండ్
- ఫార్మా, రిటైల్, ఆటో, తయారీ కంపెనీలను వెంటాడుతున్న టారిఫ్‌ల భయం

డిసెంబరు నాటికి 35 షోరూమ్‌లు: విన్‌ఫాస్ట్

చెన్నై: వియత్నాంకు చెందిన ఎలక్ట్రిక్ కార్ల సంస్థ విన్‌ఫాస్ట్ అనుబంధ సంస్థ విన్‌ఫాస్ట్ ఆటో ఇండియా సంవత్సరాంతం నాటికి కొత్తగా 35 షోరూమ్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఆదివారం నాడు చెన్నైలో దేశంలోనే అతిపెద్ద రిటైల్ అవుట్‌లెట్‌ను కంపెనీ ప్రారంభించింది. ఈ సందర్భంగా విన్‌ఫాస్ట్ ఏషియా సీఈఓ ఫామ్ సన్ చౌ మాట్లాడుతూ.. ఈ ఏడాది చివరి నాటికల్లా భారత్‌లోని 27 నగరాల్లో 35 షోరూమ్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. కాగా విన్‌ఫాస్ట్ ఇప్పటికే గుజరాత్, సూరత్‌లో తొలి షోరూమ్‌ను ఏర్పాటు చేసిందని ఆయన పేర్కొన్నారు.

హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ వేతనం రూ.94.6 కోట్లు



న్యూఢిల్లీ: దేశీయ ఐటీ సంస్థ హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ విజయ్ కుమార్ వేతనం విషయంలో ప్రస్తుతం దేశంలోని టెక్ దిగ్గజాల సారథుల కన్నా ఎంతో ముందున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఆయన వేతనం రూ.94.6 కోట్లు (1.085 కోట్ల డాలర్లు). దేశీయ ఐటీ దిగ్గజ సంస్థ టీసీఎస్ సీఈఓ కృతివాసన్ (రూ.26.52 కోట్లు), ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ (రూ.80.62 కోట్లు) ఆయన కన్నా ఎంతో వెనుకబడి ఉన్నారు. అంతేకాదు... 2025-26 ఆర్థిక సంవత్సరానికి విజయ్ కుమార్ వేతనం 71% మేర పెంచేందుకు (అంటే రూ.154 కోట్లు లేదా 1.86 కోట్ల డాలర్లు) హెచ్‌సీఎల్ టెక్ డైరెక్టర్ల బోర్డు ఇప్పటికే ఆమోదం తెలిపింది. మరోవైపు విప్రో సీఈఓ శ్రీనివాస్ పల్లియా (రూ.53.64 కోట్లు), టెక్ మహీంద్రా సీఈఓ మోహిత్ జోషి (రూ.53.9 కోట్లు) కూడా విజయ్ కన్నా ఎంతో వెనుకబడి ఉన్నారు.

విజయ్ వేతనంలో మూల వేతనం 19.6 లక్షల డాలర్లు కాగా పనితీరు ఆధారిత బోనస్‌గా 17.3 లక్షల డాలర్లున్నట్టు హెచ్‌సీఎల్ టెక్ వార్షిక నివేదికలో తెలిపింది. 2016లో విజయ్ కుమార్ హెచ్‌సీఎల్ టెక్ పగ్గాలు చేపట్టారు. ఈయన సంస్థ బాధ్యతలు చేపట్టిన సమయంలో రూ.1,15,000 కోట్లుగా ఉన్న హెచ్‌సీఎల్ టెక్ మార్కెట్ విలువ 2025 మార్చి 31 నాటికి ఏకంగా రూ.4,32,000 కోట్లకు పెరిగింది. అంటే 2016 నుంచి 3.8 రెట్ల వృద్ధి నమోదైందన్న మాట. ఇదే సమయంలో మిగతా నాలుగు అగ్రగామి ఐటీ సర్వీసెస్ దిగ్గజ సంస్థల వృద్ధి 2.5 రెట్లు మాత్రమే ఉంది.

టెక్ వ్యూ: 24,500 వద్ద నిలదొక్కుకోవడం కీలకం


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారంలో కూడా నిఫ్టీ మైనర్ రికవరీతో ప్రారంభమైనా కీలక స్థాయి 25,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమై వారం మొత్తానికి 270 పాయింట్ల నష్టంతో 24,565 వద్ద ముగిసింది. గత ఐదు వారాలుగా నిరంతర డౌన్‌ట్రెండ్‌లో ఉన్న మార్కెట్ గరిష్ఠ స్థాయి 25,670 నుంచి 1,000 పాయింట్ల మేరకు నష్టపోయింది. మిడ్‌క్యాప్-100 సూచీ 1,370 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 625 పాయింట్లు నష్టపోయాయి. అలాగే నాలుగు నెలల వరుస ర్యాలీ అనంతరం జూలై నెలలో నిఫ్టీ 750 పాయింట్ల మేరకు నష్టపోయి ఇటీవల ఏర్పడిన బాటమ్ 24,500 సమీపంలోకి వచ్చింది.

బుల్లిష్ స్థాయిలు: భద్రత కోసం నిఫ్టీ 24,500 వద్ద తప్పనిసరిగా నిలదొక్కుకోవాలి. ఇప్పుడు రికవరీ బాట పట్టినట్టయితే మైనర్ నిరోధం 24,700 పైన నిలదొక్కుకున్నప్పుడే మైనర్ అప్‌ట్రెండ్‌కు ఆస్కారం ఉంటుంది. ప్రధాన నిరోధం 25,000. ఇదే స్వల్పకాలిక నిరోధ స్థాయి. గత రెండు మాసాలుగా ఇక్కడే ప్రధాన కన్సాలిడేషన్ చోటు చేసుకుంటోంది.

బేరిష్ స్థాయిలు: బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం 24,500-24,450 స్థాయిలో నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది. ఇన్వెస్టర్లు అప్రమత్తం కావాలి. ప్రధాన మద్దతు స్థాయిలు 24250, 24000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 910 పాయింట్లు నష్టపోయి 55,600 సమీపంలో ముగిసింది. ప్రధాన బాటమ్ 55,500 చేరువవుతోంది. సానుకూలత కోసం ఇక్కడ కన్సాలిడేట్ కావాలి. అలాగే ట్రెండ్‌లో సానుకూలత కోసం ప్రధాన నిరోధం 56,100 వద్ద నిలదొక్కుకోవాలి.

పాటర్న్: నిఫ్టీ 100 డీఎంఏకి చేరువవుతోంది. అలాగే 24,500 సమీపంలో "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" సమీపంలోకి వస్తోంది. సానుకూలత కోసం ఇక్కడ బౌన్స్‌బ్యాక్ తప్పనిసరి. గతంలో ఇక్కడే నాలుగు మేజర్ బాటమ్‌లు ఏర్పడ్డాయి. ఈ కీలక స్థాయిలో నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం:	24,640, 24,700
మద్దతు:	24,450, 24,390

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

వస్తున్నాయ్.. 'భారత్' సహకార ట్యాక్సీలు



న్యూఢిల్లీ: సహకార రంగంలోని కొన్ని సహకార సంఘాల కన్సార్షియం ఈ ఏడాది చివరి నాటికి "భారత్" బ్రాండ్‌తో దేశంలో సహకార ట్యాక్సీ సర్వీసును ప్రవేశపెట్టబోతోంది. ప్రస్తుతం దేశంలో నడుస్తున్న ఓలా, ఉబర్ వంటి ట్యాక్సీ సర్వీసులకు సవాలు విసిరేందుకు సహకార సంఘం సంసిద్ధం అవుతోంది. ఈ ప్రయత్నంలో భాగంగా ఇప్పటికే రూ.300 కోట్ల అధీకృత మూలధనంతో ఢిల్లీ, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్రల్లో 200 మంది డ్రైవర్లను నియమించుకుంది. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ), ఇఫ్కో, గుజరాత్ సహకార పాల మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) సహా ఎనిమిది సంఘాలు ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. డ్రైవర్లకు మెరుగైన రాబడులు అందించడంతో పాటు ప్రయాణికులకు సరసమైన ధరల్లో ట్యాక్సీ సర్వీసును అందుబాటులోకి తేవడం దీని లక్ష్యమని ఎన్‌సీడీసీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ రోహిత్ గుప్తా అన్నారు. ప్రభుత్వ వాటా ఏదీ లేకుండా పూర్తిగా సహకార సంఘాల నిధులతోనే ఈ సర్వీస్ నడుస్తుందని ఆయన చెప్పారు. క్రిషక్ భారతి కో ఆపరేటివ్ లిమిటెడ్ (క్రిభ్‌కో), నాబార్డ్, జాతీయ పాడిపరిశ్రమాభివృద్ధి బోర్డు (ఎన్‌డీడీబీ), నేషనల్ కో ఆపరేటివ్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ దీనిలో ఇతర వ్యవస్థాపక సభ్యులు. ఈ నెట్‌వర్క్‌ను మరింతగా విస్తరించేందుకు ఇతర సహకార సంస్థలతో కూడా చర్చలు జరుపుతున్నట్టు గుప్తా చెప్పారు. టెక్నాలజీ భాగస్వామిని త్వరలో ఖరారు చేస్తామని గుప్తా తెలిపారు.

అవయవ దానంలో తెలంగాణ టాప్

- గత ఏడాది 188 మంది నుంచి అవయవాల సేకరణ
- జీవన్‌దాన్‌కు అవార్డు అందజేసిన కేంద్ర మంత్రి నడ్డా

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): అవయవ దానంలో దేశంలోనే తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. 2024లో ప్రతి పది లక్షల జనాభాకు దేశంలో సగటున 0.8 అవయవ దానాలు జరిగితే, రాష్ట్రంలో 4.88 జరిగాయని కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ వెల్లడించింది. అవయవ దానంలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు గానూ తెలంగాణకు నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యు ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆర్గనైజేషన్ (నోట్టో) అవార్డు ప్రకటించింది. జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలంగాణ జీవన్‌దాన్ ప్రతినిధులకు ఈ అవార్డును అందజేశారు. అవయవ దానంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలవడం పట్ల రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు. బ్రెయిన్ డెత్ కేసుల్లో అవయవాలు వృథా పోకుండా, దానం చేయాలని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశ్రీ కింద అవయవ మార్పిడి చికిత్సను ఉచితంగా అందిస్తున్నామన్నారు. 2024లో 188 మంది బ్రెయిన్ డెత్ డోనర్ల నుంచి 725 అవయవాలను సేకరించామని, వాటిని అవసరమైన వారికి అమర్చి వారి ప్రాణాలు కాపాడగలిగామని మంత్రి వెల్లడించారు.

నికర, మిగులు జలాల గురించి తెలుసుకోండి!

- నారా లోకేశ్‌కు మంత్రి పొన్నం హితవు

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బనకచర్లకు వరద నీరు తీసుకుపోతుంటే.. ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొడుతున్నారంటూ మాట్లాడుతున్న ఏపీ మంత్రి నారా లోకేశ్... ముందుగా నికర, మిగులు, వరద జలాల గురించి తెలుసుకోవాలని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ హితవు పలికారు. గోదావరి నీటి లభ్యతలో తెలంగాణకు కేటాయించిన 968 టీఎంసీలు, ఏపీకి కేటాయించిన 531 టీఎంసీల నికర, మిగులు జలాలు తీసుకున్న తర్వాత.. వరద జలాల గురించి ఆలోచించాలని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాజెక్టుల ద్వారా నీటి వినియోగం పూర్తయిన తర్వాత వరద జలాలు లెక్కలోకి వస్తాయని, అది తెలియకుండా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. నీటికి సంబంధించిన అంశాలపై ఇరు రాష్ట్రాలు ఘర్షణ వాతావరణం తెచ్చుకునే పరిస్థితి మంచిది కాదని చెప్పారు. తెలంగాణ నీటివాటా వినియోగం పూర్తి కాకముందే వరద జలాల పేరు మీద ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని మాట్లాడటం సరికాదన్నారు.

ఉప ఎన్నికలు వస్తే ఎదుర్కోవడానికి సిద్ధం

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికలు వస్తాయని, ఏదో జరుగుతుందని కార్యకర్తలు ఆగమాగం కావద్దని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఉప ఎన్నికలు వస్తే ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నానని, ఈ విషయాన్ని కార్యకర్తలు పట్టించుకోవద్దని చెప్పారు. స్థానిక ఎన్నికలపై దృష్టి సారించాలని సూచించారు. ఆదివారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన పార్టీ సమన్వయ కమిటీ సభ్యుల సమావేశంలో కడియం మాట్లాడారు. 42శాతం బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు చేస్తున్నాయన్నాని మండిపడ్డారు. శాసన సభలో బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ.. కేంద్రంలో మద్దతు ఇవ్వడం లేదన్నారు. పైపెచ్చు బీసీ రిజర్వేషన్ల విషయంలో ఆ పార్టీ ధర్నాలు చేయడం సిగ్గుచేటన్నారు. బీసీ రిజర్వేషన్ల చట్టం అమల్లోకి వస్తే బీజేపీ, బీఆర్ఎస్‌లకు బీసీల ఓట్లు పడవని ఆ పార్టీలు చిల్లర రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు.

బాన్సువాడ కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

- ఏనుగు రవీందర్‌రెడ్డి-పోచారం వర్గీయుల తోపులాట

నిజామాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఆదివారం బాన్సువాడలో పర్యటనలో ఉండగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులు తోపులాటకు దిగారు. చందూర్ మండల కేంద్రంలో సీతక్క పాల్గొన్న కార్యక్రమానికి ఏనుగు రవీందర్‌రెడ్డిని రాకుండా పోచారం వర్గీయులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ నాయకుడిని ప్రభుత్వ కార్యక్రమాలకు రాకుండా అడ్డుపడటం సరికాదని ఏనుగు వర్గీయులు భగ్గుమన్నారు. పోలీసులు ఇరువర్గాలను సముదాయించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరాక ఏనుగు వర్గీయులతో పొసగడం లేదు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వర్గ పోరుతో నష్టం జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.




తిరుమలలో జస్టిస్ వేణుగోపాల్; జస్టిస్ లక్ష్మణ్

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జిలు

తిరుమల, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ కె.లక్ష్మణ్, రాజస్థాన్ మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శంభాజీ ఎస్ షిండే వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

భిక్కనూరు క్యాంపస్‌లో విద్యార్థిని ఆత్మహత్య

భిక్కనూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. తోటి విద్యార్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లాలోని బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన దండు అశ్విని(24) భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో పీజీ తెలుగు రెండో సంవత్సరం చదువుతోంది. ఆదివారం సాయంత్రం ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతూ హాస్టల్ గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. గమనించిన తోటి విద్యార్థినులు తలుపులు తీయమని ఎంత బతిమాలినా ఎలాంటి స్పందన రాకపోవడంతో తోటి విద్యార్థులకు సమాచారం ఇచ్చారు. వారు చేరుకుని తలుపులు బద్దలు కొట్టగా అశ్విని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే హాస్టల్ సిబ్బంది సహాయంతో కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. అశ్వినికి తల్లిదండ్రులు సాయవ్వ-సాయిలు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. ఆమె మృతికి కారణాలు తెలియలేదు.

చంద్రబాబుపై వ్యాఖ్యల కేసులో కొడాలి నానికి నోటీసులు

గుడివాడ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ మంత్రి కొడాలి నానిపై మరో కేసు నమోదైంది. విచారణ కోసం ఆయనకు పోలీసులు నోటీసులు కూడా జారీచేశారు. చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారని, వ్యక్తిత్వాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ గత ఏడాది ఏపీలోని విశాఖకు చెందిన అంజనాప్రియ ఫిర్యాదు చేశారు. దీనిపై సెక్షన్లు 353 (20), 352, 351 (4), 196 (1) బీఎన్ఎస్ 467, ఐటీ యాక్టు కింద విశాఖపట్నం త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం వారు గుడివాడ వచ్చి కొడాలి నాని ఇంటికి వెళ్లి.. విచారణకు ఎప్పుడు పిలిస్తే అప్పుడు రావాలని, అందుబాటులో ఉండాలంటూ ఆయనకు 41ఏ సెక్షన్ కింద నోటీసులు అందజేశారు.

స్విచాఫ్.. నెట్‌వర్క్ బిజీ..!

"హలో.. హలో" అంటుండగానే కట్!.. తీవ్రంగా వేధిస్తున్న సెల్ సిగ్నల్స్ సమస్య

- మాట్లాడుతుండగా కాల్ డ్రాప్.. జంప్
- అడపాదడపా క్రాస్ కాలింగ్ సమస్యలు
- పట్టించుకోని నెట్‌వర్క్ కంపెనీలు
- ఆపరేటర్లకు జరిమానాలు విధించే చాన్స్
- అయినా.. పట్టించుకోని టెలికాం నియంత్రణ సంస్థ

స్నేహితుల దినోత్సవం నాడు మాదాపూర్‌లోని బంటీ కూకట్‌పల్లిలోని తన మిత్రుడు చంటికి శుభాకాంక్షలు చెప్పేందుకు ఫోన్ చేసినా ఎంతకీ కలవలేదు. నెట్‌వర్క్ రెస్పాన్స్ లేదు. బిజీనా? కాల్ వెయిటింగా? అనే సమాచారం లేకుండానే.. కాసేపటికి కాల్ కట్ అయిపోయింది. చాలా సార్లు ప్రయత్నిస్తే గానీ, చంటికి ఫోన్ కలవలేదు..!

ఓ పెళ్లికి హాజరైన ఓ పెద్దాయన.. అక్కడ తీసిన ఓ వీడియోను కుటుంబ వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేశారు. 5జీ మొబైల్ ఫోన్ అయినా.. ఆపరేటర్ డాటా ప్యాకేజీలో ఉన్నా.. ఆ వీడియో అప్‌లోడ్ అవ్వడానికి చాలా సమయం పట్టింది..!

ఇవి మొబైల్ ఫోన్ యూజర్లు ఎదుర్కొంటున్న నెట్‌వర్క్ కష్టాలకు చిన్నచిన్న ఉదాహరణలు మాత్రమే..! గతంలో వేర్వేరు ఆపరేటర్ల మధ్య కాల్ సమస్యలుండేవి.. ఇప్పుడు ఒకే ఆపరేటర్ పరిధిలోనూ ఆ ఇబ్బందులు తప్పడం లేదని సెల్ యూజర్లు వాపోతున్నారు.

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): టెలికాం రంగంలో గత 3 దశాబ్దాల్లో విప్లవాత్మక మార్పులు చూశాం..! పేజర్ల నుంచి సెల్‌ఫోన్ శకానికి చేరుకున్నాం. 2జీ.. 3జీ.. 4జీని అధిగమించి ఇప్పుడు ఐదోతరం 5జీ మొబైల్ నెట్‌వర్క్ వినియోగిస్తున్నాం..! 6జీ వైపు వడివడిగా ముందుకు సాగుతున్నా.. సెల్ ఆపరేటర్లు ఆదాయంపై ఉన్న శ్రద్ధ మౌలిక వసతులపై లేకపోవడంతో సగటు వినియోగదారుడు నెట్‌వర్క్ సమస్యలతో సతమతమవుతున్నాడు. పూర్తి స్థాయిలో 5జీ సేవలకవసరమయ్యే టవర్లు, చానళ్లను ఏర్పాటు చేసుకోని సెల్ ఆపరేటర్లు.. కనీసం 4జీ స్థాయి సేవలూ అందించలేకపోతున్నారు. హైదరాబాద్ నడిబొడ్డున కూడా సిగ్నల్స్ అందక పరిస్థితి తీవ్రతకు దర్పణం పడుతోంది. హైటెక్‌సిటీతోపాటు.. ఐటీ కారిడార్‌లోని మాదాపూర్, కొండాపూర్ ల్లోనే ఈ పరిస్థితి ఉంటే.. గ్రామాల్లో సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.



ఇవీ ప్రధాన సమస్యలు

సిగ్నల్ అందకపోవడంతోపాటు.. పలు నెట్‌వర్క్ సమస్యలు వినియోగదారులను పట్టిపీడిస్తున్నాయి. ఫోన్ మాట్లాడుతుండగా.. మధ్యలోనే కాల్ కట్.. లేదంటే.. కాల్ జంప్ అవుతుంది. మళ్లీ ప్రయత్నిస్తే.. క్రాస్ కాలింగ్ (ఇంకెవరికో కాల్ వెళ్లడం) జరుగుతోంది. లేదంటే.. ఉన్నఫళంగా కాల్ కట్‌అయ్యి.. ఇంకెవరో మాట్లాడే మాటలు వినిపిస్తుంటాయి. కాల్ డ్రాపింగ్ సమస్య తెలుగు రాష్ట్రాల్లో తీవ్రంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లోని వారికి కాల్ చేస్తే.. ఎంతకీ కలవకపోవడం మరో రకం సమస్య..! బహుళ అంతస్తులు, ఆకాశ హర్మ్యాల్లోని వారికి నెట్‌వర్క్ సమస్యలు మరీ తీవ్రంగా ఉన్నాయి.

కారణాలనేకం..!

ఏడాది కాలంగా నెట్‌వర్క్ సమస్యలు తీవ్రమవ్వడానికి పలు కారణాలున్నాయని టెలికాం రంగ నిపుణులంటున్నారు. డాటా, 5జీ సేవలు, కాల్ క్వాలిటీ, ఆఫర్లు, ఈ-సిమ్ సదుపాయం.. ఇలా వేర్వేరు కారణాలతో చాలా మంది ఒకటి కంటే ఎక్కువ నెట్‌వర్క్‌ల సిమ్‌కార్డులను వాడుతుండటంతో.. రాష్ట్ర జనాభా కంటే.. సెల్ వినియోగదారుల సంఖ్య ఎక్కువ. అధికారికంగా రాష్ట్రంలో 4.15 కోట్ల మంది సెల్ వినియోగదారులు ఉండగా.. ఇతర రాష్ట్రాల్లో సిమ్‌కార్డు తీసుకున్న, రాష్ట్రంలో.. ముఖ్యంగా హైదరాబాద్‌లోని వారి సంఖ్య లక్షల్లో ఉంటుందని అంచనా..! దీంతో.. నెట్‌వర్క్‌పై భారం పెరిగి.. సిగ్నల్ సమస్యలు వస్తుంటాయి. ఉదాహరణకు.. సెల్‌టవర్లు పలు రకాలు. వాటి సాంకేతిక ఫ్రీక్వెన్సీలను బట్టి 2/2/2, 4/4/4, 8/8/8.. అని పిలుస్తుంటారు. మొదటి రకం సెల్‌టవర్‌కు ఒకేసారి 2000 మంది యూజర్లు మాట్లాడుకునే సామర్థ్యం ఉంటుంది. ఆ సంఖ్యను దాటి ఒక్కరు కాల్ చేసినా.. సిగ్నల్ సమస్యలొస్తాయి. రెండో రకం సెల్‌టవర్ పరిధిలో ఏకకాలంలో 3 వేల మంది, మూడోరకం పరిధిలో 4వేల మంది మాట్లాడుకోవచ్చు. 3జీ నెట్‌వర్క్‌కు ముందు టవర్లలో ఎస్సెమ్మెస్, డాటా, కాలింగ్‌కు వేర్వేరు చానళ్లుండేవి. 3జీ నెట్‌వర్క్ నుంచి ఆ సమస్య లేకున్నా.. యూజర్ల పెరుగుదలతో ఇబ్బందులొస్తున్నాయని నిపుణుల మాట. రద్దీ ప్రాంతాల్లో ఆపరేటర్లు మరిన్ని టవర్లు ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఖర్చుకు వెనకాడుతున్నట్లు తెలుస్తోంది.

రెవెన్యూకు అనుగుణంగా?

వినియోగదారులు పెరుగుతున్నా.. దానికి తగ్గట్టు యావరేజ్ రెవెన్యూ పర్ యూజర్(ఏఆర్‌పీయూ) పెరగకపోవడంతోనే సెల్ ఆపరేటర్లు నిర్వహణను గాలికొదిలేసినట్లు తెలుస్తోంది. 2015-16కు ముందు ఏఆర్‌పీయూ అనేది నిర్దేశిత లక్ష్యానికంటే ఎక్కువగా ఉండేది. డాటా ప్లాన్లతో పోటీతో యూజర్లు పెరిగి, సిగ్నళ్ల సమస్యలు క్రమంగా పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. 2015-16లో సగటు ఏఆర్‌పీయూ రూ.300 ఉంటే క్రమంగా తగ్గుతూ.. ప్రస్తుతం రూ.174.46కు చేరినట్లు ట్రాయ్ గణాంకాలు చెబుతున్నాయి. 2015-16కు ముందు కాల్స్/డాటాకు వేర్వేరు ప్యాకేజీలుండేవి. ఉదాహరణకు బీఎస్ఎన్ఎల్‌లో నెలకు 2జీబీ డేటాకు నిర్దేశించిన ప్లాన్ కోసం రూ.444 చెల్లిస్తే 2016 తర్వాత పరిస్థితి మారింది. ఇప్పుడు రోజుకు 1.5 నుంచి 2జీబీ చొప్పున డాటా, అపరిమిత కాల్స్, 100 ఎస్సెమ్మెస్‌లతో ప్యాకేజీలకు నెలకు రూ.200 లోపే ఖర్చవుతోంది. పోటీని తట్టుకునేందుకు టారీఫ్‌లను తగ్గించిన కంపెనీలు.. కస్టమర్లు పెరిగాక.. అందుకనుగుణంగా వసతులను కల్పించడం లేదంటున్నారు. యూజర్లకు కాల్స్ కనెక్ట్ అవ్వకుంటే.. వైఫైతో వాట్సాప్ కాల్స్ చేసుకుంటారనే ధోరణిలో సెల్ ఆపరేటర్లు ఉన్నట్లు ఆరోపిస్తున్నారు.

జరిమానాలు వేయొచ్చు..

కాల్‌డ్రాప్స్ సమస్యలపై నెట్‌వర్క్ కంపెనీలకు జరిమానాలను విధించే అధికారం ప్రభుత్వాలకు ఉంటుంది. అయితే.. ఆ దిశలో చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. వినియోగదారులు కూడా కాల్ సమస్యలున్నప్పుడు సర్దుకుపోతున్నారే తప్ప.. సెల్ సంస్థలకు ఫిర్యాదు చేయడం లేదు. సెల్ సంస్థలు పట్టించుకోకుంటే.. ట్రాయ్‌కి ఫిర్యాదు చేయవచ్చు. అక్కడా సమస్యకు పరిష్కారం దొరకలేదనుకుంటే.. డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్(డీవోటీ)కి ఫిర్యాదు చేస్తే.. సెల్ సంస్థలు వినియోగదారుల ఇళ్లకు పరుగులు పెట్టి, సమస్యను పరిష్కరిస్తాయి. లేదంటే.. ఆయా సంస్థలకు జరిమానాలు తప్పవు.



శిల్పారామంలో చేనేత వారోత్సవాలను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

దేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత రంగం కీలకం

- అంతర్జాతీయ చేనేత హబ్‌గా రాష్ట్రం
- చేనేతలో సంస్కరణలకు కేంద్రం సిద్ధం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత, వస్త్ర పరిశ్రమ కీలకమైన భాగమని, దీని ద్వారా దాదాపు 5 కోట్ల మందికి ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఉపాధి లభిస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం శిల్పారామంలో జరిగిన చేనేత వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మేకిన్ ఇండియా కార్యక్రమం ద్వారా చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతో ఏటేటా అభివృద్ధి చెందుతూ.. ప్రస్తుతం దేశ జీడీపీలో 2.3 శాతంగా ఉందని తెలిపారు. 2023-24లో ఈ రంగం ద్వారా రూ. 3 లక్షల కోట్ల విలువైన ఎగుమతులు జరిగాయని, దీన్ని 2030 నాటికి రూ.9 లక్షల కోట్లకు పెంచాలనే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అందుకే ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం(పీఎల్ఐ),నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ (ఎన్‌హెచ్‌డీపీ) ద్వారా నేతన్నలకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తోందని, వారికి అంతర్జాతీయ మార్కెటింగ్ సదుపాయాలతో పాటు మౌలిక వసతుల కల్పిస్తోందని చెప్పారు. అలాగే రాయితీలతో కూడిన రుణాలు, జాతీయ, రాష్ట్రీయ పురస్కారాలు పొందిన నేతన్నలకు రూ.8 వేల నెలవారీ పెన్షన్ కూడా ఇస్తోందని గుర్తుచేశారు. రాష్ట్రానికి చెందిన 20 మంది చేనేత కార్మికులు.. తమ ప్రతిభను ఆస్ట్రేలియా, జర్మనీ, ఇటలీ, అమెరికా దేశాల్లో జరిగిన ఎక్స్‌పోలో ప్రదర్శించారని చెప్పారు. అంతర్జాతీయ చేనేత హబ్‌గా రూపుదిద్దుకుంటోందన్నారు. పోచంపల్లి, ఇక్కత్, గద్వాల్, నారాయణపేట కాటన్ చీరలు, సిద్దిపేట గొల్లభామ చీర, తేలియా రుమాల్, వరంగల్ తివాచీ వంటి చేనేత ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు(జీఐ ట్యాగ్) లభించిందని తెలిపారు. చేనేత రంగంలో అవసరమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని, సమగ్రమైన ప్రణాళిక తో వస్తే కేంద్రంతో మాట్లాడేందుకు తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. దేశ వ్యాప్తంగా ఏడు పీఎం మిత్ర టెక్స్‌టైల్ పార్క్‌లు ఖరారు చేస్తే.. అందులో ఒకటి రాష్ట్రానికి కేటాయించారన్నారు.

పథకం ప్రకారమే.. మోసాల 'సృష్టి'!

- నమ్రత ముఠాలోని ఏజెంట్ కృష్ణ అరెస్టు
- మూడోరోజూ నమ్రత విచారణ
- ఏజెంట్లతో ఆర్థిక లావాదేవీలపై నజర్
- చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాతో లింకులపై దృష్టి

హైదరాబాద్ సిటీ/అడ్డగుట్ట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పథకం ప్రకారమే డాక్టర్ నమ్రత మోసాల 'సృష్టి'కి తెరతీశారని గోపాలపురం పోలీసులు గుర్తించారు. ఐదు రోజుల పాటు ఆమెను కస్టడీకి తీసుకున్న పోలీసులు.. మూడోరోజు విచారణలో విస్తుబోయే అంశాలను గుర్తించినట్లు తెలిసింది. తొలిరోజు కస్టడీ సందర్భంగా.. "నాకేం తెలియదు".. "నేనెవరినీ మోసం చేయలేదు".. "నెనెలాంటి అక్రమాలకు పాల్పడలేదు".. అంటూ నమ్రత సమాధానాలివ్వగా.. పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డాటాను ఆమె ముందు పెట్టడంతో ఆదివారం పలు విషయాలను వెల్లడించినట్లు సమాచారం. సంతాన సాఫల్య దందాతో రూ.కోట్లలో కూడబెట్టిన నమ్రత.. తెలుగు రాష్ట్రాల్లోని ఖరీదైన ప్రాంతాల్లో ప్లాట్లు, స్థలాలు, ఫామ్‌హౌస్‌లను కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పుడు ఆమె నెట్‌వర్క్‌లోని మధ్యవర్తులపై దృష్టి సారించారు. ఇప్పటికే కల్యాణి, సంతోషి అనే దళారులను కస్టడీలోకి తీసుకుని విచారిస్తుండగా.. తాజాగా విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్న కృష్ణ అనే ఏజెంట్‌ను అరెస్టు చేశారు. మోసాల 'సృష్టి'లో కృష్ణ కీలక పాత్రపోషించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. విజయవాడలో టెస్ట్‌ట్యూబ్, సరోగసి వ్యవహారాల్లో కృష్ణ కీలకంగా వ్యవహరించినట్లు గుర్తించారు. అతణ్ని విచారించేందుకు గోపాలపురం పోలీసులు సిద్ధమవుతున్నారు. కర్ణాటక, ఒడిసా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోనూ నమ్రత ఏజెంట్లున్నారని, వారిని గుర్తించి, అదుపులోకి తీసుకోవాల్సి ఉందని పోలీసులు వివరించారు.

బలహీనతే బలంగా మోసాలు

పిల్లలు లేని దంపతుల బలహీనతను నమ్రత తనకు బలంగా మలచుకుని మోసాలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అక్రమార్జనతో బాగా సంపాదించాలనే ఉద్దేశంతో పిల్లలు లేని దంపతులకు సరోగసి కోసం ఒప్పించేవారని తెలుస్తోంది. సరోగసి తల్లి లేకుండానే.. ట్రాఫికింగ్ ద్వారా కొనుగోలు చేసిన చిన్నారులను దంపతులకు అప్పగించినట్లు సమాచారం. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, దళారులు అరెస్టయితే మరిన్ని వివరాలు తెలుస్తాయని పోలీసులు చెబుతున్నారు.

మా పిల్లలు సక్రమమేనా..?

సృష్టి ఫర్టిలిటీ సెంటర్ అక్రమాలు వెలుగులోకి రావడంతో.. డాక్టర్ నమ్రత సూచనలతో సరోగసి ద్వారా సంతానాన్ని పొందేందుకు సిద్ధమైన దంపతుల్లో ఇప్పుడు ఆందోళన నెలకొంది. అలాంటి వారు పోలీసులను ఆశ్రయిస్తున్నట్లు సమాచారం. త్వరలో తమ ఒడిలోకి చేరనున్న చిన్నారులు తమ సంతానమేనా? లేక అక్రమాల 'సృష్టి'కి నిదర్శనమా? అనే సందేహాలను వారు వ్యక్తం చేస్తున్నారు.

స్కానింగ్ కేంద్రాలపై పర్యవేక్షణేది?

(మొదటిపేజీ తరువాయి)

అమలు కావడంలేదనే విమర్శలున్నాయి. జిల్లా కలెక్టర్లు, వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో.. ఫర్టిలిటీ, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 4,180 కేంద్రాలు

తెలంగాణ వ్యాప్తంగా పీసీపీఎన్‌డీ చట్టం కింద అనుమతి పొందిన ఆస్పత్రులు, స్కానింగ్ కేంద్రాలు 4,180 వరకు ఉన్నాయి. వీటిపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలి. నెలకు సగటున 33% కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించాలి. అంటే.. ప్రతి కేంద్రాన్ని మూణ్నెల్లకోసారి తనిఖీ చేయాల్సి ఉన్నా..10% కేంద్రాల్లో కూడా తనిఖీలు జరగడం లేదని వైద్య ఆరోగ్యశాఖ తాజాగా నిర్వహించిన సమీక్షలో వెల్లడైంది. మే నెలలో 1,392 కేంద్రాల్లో తనిఖీలు చేయాలని టార్గెట్ విధిస్తే కేవలం 422 కేంద్రాల్లో ఇన్‌స్పెక్షన్లు మాత్రమే నమోదయ్యాయి. జూన్ నెలలో 533 కేంద్రాలను సందర్శించారని వైద్య ఆరోగ్య శాఖ తాజాగా సర్కారుకు అందజేసిన నివేదిక స్పష్టం చేస్తోంది.

గ్రేటర్ హైదరాబాద్‌లో 57% కేంద్రాలు

రాష్ట్రంలోని స్కానింగ్ కేంద్రాల్లో 57% గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో 908, రంగారెడ్డిలో 609, మేడ్చల్‌లో 872 కేంద్రాలున్నాయి. ఆ తర్వాత అత్యధిక కేంద్రాలున్న జాబితాలో హనుమకొండ (179), కరీంనగర్ (145), ఖమ్మం (104), సంగారెడ్డి (128), నిజామాబాద్ (126) జిల్లాలున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌లో 797 కేంద్రాలు తనిఖీ చేయాల్సి ఉన్నా.. 124 మాత్రమే చేస్తున్నారు. ములుగు, మెదక్, హనుమకొండ, నాగర్‌కర్నూల్, భూపాలపల్లి జిల్లాల్లోనే పీసీపీఎన్‌డీటీ తనిఖీలు లక్ష్యాలకనుగుణంగా కొనసాగుతున్నాయి.



సికింద్రాబాద్‌లోని న్యూలైఫ్ ఆస్పత్రిలో అనధికారికంగా అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని వాడుతున్నట్లు గుర్తించారు. ఆ ఆస్పత్రిపై కేసు నమోదు చేశారు. సైదాబాద్‌లో వివేక్ ఆస్పత్రిలో అనుమతుల్లేని రెండు అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాలను గుర్తించి, రూ.2 లక్షల జరిమానా విధించారు.


గత నెల 8న భువనగిరిలో గాయత్రి ఆస్పత్రిపై రాచకొండ పోలీసులు తనిఖీలు చేసి.. నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు గుర్తించారు. ఓ డాక్టర్‌తో పాటు ఇద్దరు మహిళలను అరెస్టు చేశారు. ఆ ఆస్పత్రిలో గర్భవిచ్ఛిత్తి జరుగుతున్నట్లు తేల్చారు. ఆడ శిశువుల పిండాలను సీజ్ చేసి, డీఎన్‌ఏ టెస్టుల కోసం పంపారు. ఆ ఆస్పత్రిపై పీసీపీఎన్‌డీటీ చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఫర్టిలిటీ, సరోగసి పేరుతో మోసం

ఫర్టిలిటీ, సరోగసి పేరుతో సంతాన సాఫల్య కేంద్రాల మోసాలు తీవ్రమవుతున్నాయని వైద్యవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సంతానం కోసం వచ్చే దంపతుల శరీర ఛాయ ఆధారంగా వారికి పుట్టబోయే బిడ్డలు కూడా అదే రంగులో ఉండేలా కొన్ని కేంద్రాలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఆ వర్గాలు పేర్కొన్నాయి. అందుకోసం నలుపు, ఎరుపు, బ్రౌన్ రంగుల వ్యక్తుల వీర్యకణాలను సేకరించి పెట్టుకుంటున్నాయని తెలిపాయి. సరోగసి ప్రసవాలు కూడా పెరుగుతున్నట్లు వివరిస్తున్నాయి. అధికారికంగా 50 వరకు సరోగసి అనుమతులు ఉంటుండగా.. అనధికారికంగా వీటి సంఖ్య వెయ్యికి పైగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆపరేషన్ సిందూర్‌తో సత్తా చాటిన భారత్

- దేశీయంగానే డ్రోన్లు, క్షిపణుల అభివృద్ధి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- ఆపరేషన్ సిందూర్‌లో భాగస్వామ్యమైన రక్షణ రంగ శాస్త్రవేత్తలకు సత్కారం



రక్షణ రంగ శాస్త్రవేత్తలను సన్మానిస్తున్న వెంకయ్యనాయుడు, తదితరులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌తో భారతదేశ శక్తి, సామర్థ్యాలు ప్రపంచానికి మరోమారు తెలిశాయని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. స్వదేశీ క్షిపణులు, డ్రోన్లు, శక్తిమంతమైన ఎలక్ట్రానిక్ వార్ఫేర్, శత్రుదుర్భేద్యమైన రక్షణ వ్యవస్థ వినియోగంతో భారత్ తన శక్తి, స్థాయిని చాటిందన్నారు. భారత్ ఆర్థికంగా కుదేలైన దేశమని ప్రచారం చేస్తున్న వారికీ భారత్ సత్తా అతి త్వరలోనే అర్థమవుతుందని అమెరికా అధ్యక్షుడిపై ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన 'ఆపరేషన్ సిందూర్‌లో భాగస్వామ్యం వహించిన సైనికులకు, శాస్త్రవేత్తలకు వందనం' అనే కార్యక్రమంలో వెంకయ్యనాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. అఖిల భారత శైక్షిక్ మహాసంఘ్(ఏబీఆర్ఎస్ఎమ్), వాయిస్ ఆఫ్ హైదరాబాదీ అకడమిషియన్స్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆపరేషన్ సిందూర్‌లో ప్రత్యక్ష, పరోక్ష పాత్ర పోషించిన రక్షణశాస్త్రవేత్తలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యుద్ధక్షేత్రంలో హీరోలు సైనికులైతే, శక్తిమంతమైన యుద్ధ వ్యవస్థలను అభివృద్ధి చేసి సైనికులకందించిన శాస్త్రవేత్తల పాత్ర కీలకమని ప్రశంసించారు. స్వాతంత్ర్య భారత్.. దేశ ప్రయోజనాలకు అనుగుణంగా వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తోందని, ఈ విషయంలో ఇతరుల జోక్యానికి చోటు లేదన్నారు. ఆపరేషన్ సిందూర్ ఇతివృత్తంగా మల్లేపల్లి మోహన్ స్వరపరిచిన శౌర్యగీతాన్ని ఆవిష్కరించిన వెంకయ్య.. గీత రచయిత అగరం వసంత్, ఆంగ్ల అనువాదకుడు వంగీపురం శ్రీనివాసాచార్యను అభినందించారు.

శాస్త్రవేత్తలకు సన్మానం

డీఆర్‌డీవో మిస్సైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్ ఉమ్మాలనేని రాజాబాబు, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యుడు డాక్టర్ జి. సతీష్‌రెడ్డి, తెలంగాణ, ఏపీ సబ్‌ఏరియా మేజర్ జనరల్ అజయ్ మిశ్రా, సెంటర్ ఫర్ హైఎనర్జీ సిస్టమ్స్ డైరెక్టర్ జగన్నాథ నాయక్, ఆకాశ్ మిస్సైల్ ప్రోగ్రాం మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రమౌళి, ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్ అజిత్ బి చౌదరి, అస్త్ర మిస్సైల్ సిస్టమ్ మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ పాట్రిక్ డిసిల్వా, అస్త్ర ప్రైమ్ ప్రాజెక్టు డైరెక్టర్ నరేంద్ర కాలె, అనంత్ టెక్నాలజీస్ సీఎండీ పావులూరి సుబ్బారావును సన్మానించారు. కాగా, స్వదేశీ ఆయుధాలను విస్తృతంగా వాడిన తొలి యుద్ధంగా ఆపరేషన్ సిందూర్ నిలుస్తుందని డీఆర్‌డీవో మిస్సైల్స్ అండ్ స్ట్రాటజిక్ సిస్టమ్స్ డైరెక్టర్ జనరల్ ఉమ్మాలనేని రాజాబాబు అన్నారు. సతీష్ రెడ్డి మార్గదర్శకత్వంలో యాంటీ డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేశామని సెంటర్ ఫర్ హైఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్ డైరెక్టర్ జగన్నాథ నాయక్ తెలిపారు. ఇక, ఎంతోమంది సమ్మిళిత కృషితో అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణిలో మొదటి స్వదేశీ సెన్సార్‌ను జగన్నాథ్ నాయక్ అమర్చారని, ఆ సెన్సార్ వల్లే నేడు ఆకాశ్ శక్తిమంతంగా పని చేస్తోందని ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్ అజిత్ బి చౌదరి పేర్కొన్నారు.

ఉద్దండాపూర్ భూనిర్వాసితులకు అండగా నిలిచాం: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఉద్దండాపూర్ రిజర్వాయర్ భూనిర్వాసితులకు అండగా నిలిచామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి వస్తే పరిహారం ఇచ్చి బాధితుల కన్నీళ్లు తుడుస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని ఆదివారం 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఏడాదిన్నర కాలంలో 250 కోట్ల రూపాయల పరిహారం మంజూరు చేశామన్నారు. గత నెలలో 25 కోట్లు విడుదల చేయగా, ఈ నెలలో మరో 175 కోట్ల రూపాయలు విడుదల చేశామని తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వాసితులతో సహపంక్తి భోజనం చేసి డిసెంబరు 9 లోపు పూర్తి పరిహారం అందిస్తామని తన మాటగా చెప్పాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి సూచించానన్నారు. తన ఆదేశాల మేరకు 6 వేల మందితో సహపంక్తి భోజన కార్యక్రమం ఏర్పాటు చేయడం సంతోషకరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

తెలంగాణ కుల సర్వే చూసి ముఖం చాటేసిన మోదీ

(మొదటిపేజీ తరువాయి)

నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో నిర్వహించిన రోడ్ షోలో, అంతకముందు నిజామాబాద్ జిల్లా అర్గుల్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లును ఆమోదించకుండా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మోకాలడ్డుతున్నారని ఆరోపించారు. శకుని పాత్ర పోషిస్తూ రాష్ట్రాభివృద్ధికి అడ్డం పడుతున్నారని విమర్శించారు. దేవుని పేరు చెప్పి ఓట్లను అడుక్కొని బీజేపీ ప్రజలను మభ్యపెడుతుందని దుయ్యబట్టారు. శ్రీరామునికి బీజేపీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. పదేళ్ల పాటు దోచుకున్న రాష్ట్ర సంపదను పంచుకునే విషయంలోనే కేటీఆర్, కవిత పంచాయితీ తెరపైకి వచ్చిందని మహేష్‌గౌడ్ అన్నారు. ఆ గొడవ తీర్చలేకే కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పనైపోయిందని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో 100 సీట్లు గెలిచి సోనియాగాంధీకి కానుక ఇస్తామని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలోనే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు రూ.లక్ష70వేల కోట్ల విదేశీ పెట్టుబడులు తెచ్చారని, ఆంగ్లం బాగా మాట్లాడగలిగే కేటీఆర్ పదేళ్లలో తెచ్చింది రూ.20 వేల కోట్లేనని ఎద్దేవా చేశారు. ఇక, అర్గుల్‌లో జరిగిన సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, జగదీశ్వర్ రెడ్డి బనకచర్ల విషయంలో అసత్యాలు చెబుతున్నారని ఆరోపించారు. సీఎంగా ఉన్నప్పుడు ఏపీకి వెళ్లి రాయలసీమను రతనాలసీమగా మారుస్తానన్నది కేసీఆర్ కాదా ? అని ప్రశ్నించారు. గోదావరి నీళ్లను కృష్ణానదిలో కలుపుతూ బనకచర్ల వరకు సొరంగం పెట్టి నీళ్లను తోడుకునేందుకు ఇచ్చిన జీవోలను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఢిల్లీలో ఫిర్యాదు చేసి ఆపించారని తెలిపారు. ఇక, సీఎం రేవంత్‌కు తనకు విభేదాలు ఉన్నాయనేది బీఆర్ఎస్ మీడియా చేస్తోన్న దుష్ప్రచారమేనని మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సీఎంతో తనది అన్నదమ్ముల అనుబంధం అని విడదీయరాని బంధం అని అన్నారు. సీఎం, పార్టీ అధిష్ఠానం అనుమతితోనే జనహిత పాదయాత్ర చేస్తున్నట్టు వెల్లడించారు. గత పదేళ్లు పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకునే బాధ్యత నాయకులదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో కొట్లాడేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి మంత్రి సీతక్క, మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, సంపత్‌కుమార్, బల్మూరి వెంకట్, సురేష్ షెట్కార్, లక్ష్మీకాంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంపై సిట్?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ ఆదివారం సాయంత్రం సచివాలయంలో భేటీ అయి చర్చించింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నిధుల ఖర్చు వ్యవహారంపై.. పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికలో పలు సిఫారసులు కూడా చేసింది. ఆ సిఫారసుల మేరకు నేరుగా చర్యలకు ఉపక్రమించాలా? లేక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలా? అనే అంశంపై క్యాబినెట్ భేటీలో చర్చించి ఒక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అప్పటి సీఎం కేసీఆర్, మంత్రులు హరీష్‌రావు, ఈటల పాత్రల గురించి వివరించిన కమిషన్.. అధికారుల ప్రమేయం, వారు నిర్వర్తించిన పాత్రల గురించి కూడా వివరించింది. ఈ నేపథ్యంలో కమిషన్ ప్రస్తావించిన అధికారులపై ఎలాంటి చర్యలకు ఉపక్రమించాలనేదానిపైనా కీలకంగా చర్చించనున్నట్టు తెలిసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన అప్పటి ఈఎన్‌సీ మురళీధర్, హరిరామ్.. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఇప్పటికే అరెస్టయ్యారు. అలాగే అప్పటి నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్‌కే జోషీ, సీఎంవో అదనపు కార్యదర్శిగా వ్యవహరించిన స్మితా సభర్వాల్‌తో పాటు మరికొంత మంది అధికారులపై తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి కూడా ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం.

ఇదే మొదటిసారి..

కాళేశ్వరం ఒక్క అంశంపైనే రాష్ట్ర మంత్రివర్గం సోమవారం ప్రత్యేకంగా సమావేశం కానుంది. తెలంగాణ ఏర్పాటయ్యాక ఇలా ఒకే అంశం ఎజెండాగా క్యాబినెట్ భేటీ కావడం ఇదే మొదటిసారి. ఈ వ్యవహారాన్ని సర్కారు ఎంత తీవ్రంగా పరిగణిస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఉమ్మడి ఏపీలోనూ ఒకే ఎజెండాపై క్యాబినెట్ భేటీ జరిగిన దాఖలాలు పెద్దగా లేవు. అలాగే ఇదే అంశంపై శాసనసభ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ఈ భేటీలో నిర్ణయిస్తే.. అలా ఒకే అంశంపై అసెంబ్లీ నిర్వహించడం కూడా తొలిసారి అవుతుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

నేడు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

- కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చించే అవకాశం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు రాష్ట్ర మంత్రివర్గం సమావేశం కానుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకతలపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై ఈ సమావేశంలో చర్చిస్తారు. తదుపరి కార్యాచరణను సిద్ధం చేస్తారు. మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో సమావేశమై క్యాబినెట్ నోట్ తయారీపై చర్చించారు. నివేదికపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీ సూచనలపై క్యాబినెట్ సమావేశంలో చర్చిస్తారు. బాధ్యులపై ఏసీబీతో అవినీతి నిరోధక చట్టం కింద విచారణ జరిపించాలా లేక సిట్ ఏర్పాటు చేయాలా అనే అంశాలను మంత్రివర్గం పరిశీలించే అవకాశం ఉంది.

బనకచర్లను అడ్డుకున్నాం

అన్ని వేదికలపై ఆ ప్రాజెక్టును వ్యతిరేకించాం.. నిస్సిగ్గుగా బీఆర్ఎస్ నేతల మాటలు

- నీళ్లు నింపితే కాళేశ్వరం కూలుతుంది: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రైతులకు లక్ష కోట్లు పంపిణీ చేశాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



రామగుండం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల, శ్రీధర్‌బాబు, పొన్నం, అడ్లూరి

గోదావరిఖని/రామడుగు/శంకరపట్నం, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తామంటున్న బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకున్నామని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. తమ ప్రభుత్వం బనకచర్లను అన్ని వేదికలపై తిరస్కరిస్తూ వస్తోందని, గోదావరి జలాల వాటా విషయంలో పోలవరాన్ని కూడా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. పెద్దపల్లి జిల్లాలో రామగుండం ఎత్తిపోతల పథకాన్ని అంతర్గాంలో నిర్వహించిన బహిరంగ సభా ప్రాగణం నుంచి ప్రారంభించారు. రూ.75 కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టు ద్వారా 13,300 ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ సభలో, అనంతరం కరీంనగర్ జిల్లా రామడుగు మండలం షానగర్, శంకరపట్నంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ సందర్భంగా ఉత్తమ్ మట్లాడారు. గోదావరి నీటి యాజమాన్య బోర్డు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్ర జల సంఘానికి ఫిర్యాదు చేసి బనకచర్లను అడ్డుకున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణ నీటి హక్కుల ఉల్లంఘన జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి, తాను అన్ని సందర్భాల్లో, అన్ని వేదికలపై నిక్కచ్చిగా చెబుతున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టును కేంద్ర జల సంఘం కూడా తిరస్కరించిందన్నారు. మిగులు జలాలపై తెలంగాణకు ఉన్న వాటా ముందుగా తేలాలని స్పష్టం చేశారు. బనకచర్లపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని, ఆ పార్టీ నాయకులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడి జేబులు నింపుకున్న బీఆర్ఎస్ నాయకులు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరంపై వేసిన కమిషన్ నివేదిక ప్రభుత్వం చేతిలో ఉందని, త్వరలో జరిగే మంత్రివర్గంలో నివేదికపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కాళేశ్వరం ద్వారా ఈ ప్రాంతంలో ఒక్క ఎకరాకైనా బీఆర్ఎస్ నీళ్లు ఇవ్వలేకపోయిందన్నారు. మేడిగడ్డ ఇప్పటికే కూలిపోయిందని, నీరు నింపితే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా కూలిపోయే ప్రమాదం ఉందని జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ హెచ్చరించిందని చెప్పారు. అదే జరిగితే భద్రాచలం రామాలయం, సమ్మక్క-సారలమ్మ గద్దెల వరకు మునిగిపోతాయన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ ఎండిపోయినా శ్రీపాద ప్రాజెక్టు ద్వారానే తెలంగాణ వరిసాగులో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ప్రాణహిత-చేవెళ్ల, ఇచ్చంపల్లి ప్రాజెక్టులు నిర్మిస్తామని చెప్పారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రేషన్ వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పును కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఉత్తమ్ అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డూ ఇవ్వలేదని, పాతవాటిలో సభ్యులను నమోదు చేయలేదని విమర్శించారు. సభలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రైతులకు రూ.లక్ష కోట్లు పంపిణీ చేసిన ఏకైక ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వమని మంత్రి తుమ్మల అన్నారు. శంకరపట్నంలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. పేద ప్రజలకు న్యాయం చేసేలా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. పేదలకు సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టామని చెప్పారు.

వరద కాలువకు నీటి విడుదల

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంపుహౌస్ నుంచి వరద కాలువకు అధికారులు ఆదివారం నీటిని విడుదల చేశారు. వరద కాలువలో మోటార్లు పెట్టుకుని పరిసర ప్రాంత రైతులు పొలాలు సాగు చేసుకుంటారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో వరద కాలువలో నీరు అడుగంటి, పొలాలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. దీంతో మంత్రి ఉత్తమ్ ఆదేశాలతో అధికారులు 3,150 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

వీళ్లకేం తక్కువని!?

(మొదటిపేజీ తరువాయి)

పింఛన్లు ఇస్తున్నారు. కానీ... ఒకే వ్యక్తికి రెండు పింఛన్లు ఇవ్వకూడదనే చట్టం మాత్రం లేదు. మాజీ ఎంపీగా, మాజీ ఎమ్మెల్యేగా పని చేసి రెండు పింఛన్లు తీసుకుంటున్న వారిలో ఏపీలో చాలామంది నేతలే ఉన్నారు. ఎమ్మెల్యేగా ఒక్కరోజు పని చేసి మాజీ అయినా జీవితాంతం రూ.30వేలు పింఛను వస్తుంది. పింఛను, జీతాలు పెంచుతూ ఆయా రాష్ట్రాలు సొంతంగా చట్టాలు చేసుకోవచ్చు. తెలంగాణలో మాజీ ఎమ్మెల్యేలకు రూ.50 వేలు పింఛను చెల్లిస్తున్నారు. ఇక... మాజీ ఎంపీలకు రూ.31 వేల పింఛను అందుతుంది. విచిత్రం ఏమిటంటే... ఒకే వ్యక్తి రెండు పదవులు చేసి మాజీ అయ్యాక అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు పింఛన్లు ఇచ్చేస్తున్నాయి. ఇలా డబుల్ పింఛను పడుతున్న సంగతి చాలామందికి తెలుసు. కొందరికి... ఆ చిన్న మొత్తాలు తమ ఖాతాల్లో పడుతున్న విషయం తెలియకపోవచ్చు. ఏదేమైనా... తెలిసిన వాళ్లు దీనిని వదులుకోవడంలేదు. మిగిలిన వాళ్లు తమకు తెలియకుండానే రెండు పింఛన్లు తీసుకుంటున్నారు. రెండు పింఛన్ల సంగతి పక్కన పెడితే... అసలు మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు పింఛన్లు ఇవ్వడం అవసరమా? అనే ప్రశ్నలూ తలెత్తుతున్నాయి. ఒకప్పుడు పూర్తిగా ప్రజా సేవకే అంకితమై, అత్యంత నిరాడంబర జీవితం సాగించే నేతలు కొందరు చట్ట సభల్లో అడుగు పెట్టేవారు. వారికి ఇతర వ్యాపకాలు, వ్యాపారాలూ ఉండేవి కావు. ఇలాంటి నేతలకు 'మాజీ' అయ్యాక పింఛను ఇవ్వడంలో అర్థముంది. కానీ... ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలిచేందుకు ఒక్కో నియోజకవర్గానికి కనీసం రూ.25 కోట్ల నుంచి రూ.30 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఎమ్మెల్యేగా గెలవగానే ప్రతి నెలా రూ.1.30 లక్షల జీతం అందుతుంది. మాజీలు అయ్యాక పింఛను తీసుకోవడం ఒక ఎత్తైతే... మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే హోదాలో ఒకే వ్యక్తి రెండు పింఛన్లు తీసుకోవడం మరో ఎత్తు. రెండేసి పింఛన్లు తీసుకుంటున్న నేతలు ఒక పేద కుటుంబాన్ని దత్తత తీసుకోవచ్చు లేదంటే.. ఆ మొత్తాన్ని ప్రజల కోసం వెచ్చించవచ్చు. ప్రస్తుతం... 'పీ4'పై చంద్రబాబు పిలుపునకు స్పందిస్తున్న ప్రజా ప్రతినిధుల సంఖ్య పెద్దగా కనిపించడంలేదు. ఆ విషయం పక్కనపెడితే... రెండు పింఛన్లు తీసుకుంటున్న వారు, నైతిక బాధ్యతగా ఒకదానిని వదులుకోవాలనే వాదనా వినిపిస్తోంది. ప్రభుత్వమైనా 'ఒక మాజీకి ఒకటే పింఛను' చట్టం తేవాలి.

ఓబీసీ ఓటు బ్యాంకుపై ఏఐసీసీ కన్ను

తెలంగాణ బీసీ రిజర్వేషన్ బిల్లులే అస్త్రాలుగా కేంద్రంపై ఒత్తిడి!.. పాలుపంచుకోనున్న రాహుల్, ఖర్గే

- రేపు వాయిదా తీర్మానాలిచ్చేందుకు సిద్ధం
- 6న ధర్నాలోనూ పాల్గొనేందుకు రెడీ
- తాము వచ్చాక రిజర్వేషన్లపై 50శాతం పరిమితిని ఎత్తేస్తామని ప్రకటన?
- రేపు ఢిల్లీకి రేవంత్.. 3రోజులపాటు మకాం!



హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు తోడు.. ఓబీసీ ఓటుబ్యాంకుపైనా కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి పెట్టిందా? ఈ విషయంలో తెలంగాణకు సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న రెండు బీసీ రిజర్వేషన్ బిల్లులనే అస్త్రాలుగా వాడేందుకు సిద్ధమైందా? అంటే.. ఈ ప్రశ్నలన్నింటికీ కాంగ్రెస్ పార్టీ వర్గాలు అవుననే సమాధానమే ఇస్తున్నాయి. బీసీ రిజర్వేషన్లపై మంగళ, బుధ, గురువారాల్లో (5, 6, 7 తేదీల్లో) ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, బీసీ ప్రజాప్రతినిధులు చేపట్టిన ఒత్తిడి కార్యాచరణలో ఏఐసీసీ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే కూడా పాలుపంచుకోనుండడమే ఇందుకు నిదర్శనమని పేర్కొంటున్నాయి. వాస్తవానికి ఓబీసీలను ఆకట్టుకునేందుకు దేశ వ్యాప్తంగా కులగణన, 'ఎవరు ఎంతో... వారికి అంత వాటా' అనే నినాదాలను గత ఎన్నికల ముందే కాంగ్రెస్ పార్టీ తెరపైకి తీసువచ్చింది. అయితే ఆ నినాదాన్ని ఆయా వర్గాలకు అర్థమయ్యే రీతిలో తీసుకెళ్లలేక పోయింది. ఈ నేపథ్యంలో.. ఇప్పుడు.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే, ఆ సర్వే ఆధారంగా బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుల ఆమోదం అంశాలను ముందుపెట్టి దేశవ్యాప్త ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే.. ఇటీవల ఏఐసీసీ కార్యాలయం ఇందిరాభవన్‌లో పార్టీ ఎంపీలకు ఈ బిల్లులపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. బీసీ బిల్లుల ఆమోదానికి సంబంధిఇంచి.. కేంద్రంపై ఒత్తిడి తెచ్చే కార్యాచరణలో సహకరించాల్సిందిగా పార్టీ ఎంపీలను ఆ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. 5,6,7 తేదీల్లో నిర్వహించే ఈ ఒత్తిడి కార్యాచరణలో పార్టీ ఎంపీలతో పాటు రాహుల్, ఖర్గే కూడా పాలు పంచుకుంటున్నారు. ఓబీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌ను కల్పించకుండా కేంద్రంలోని బీజేపీ అడ్డుకుంటోందన్న సంకేతాన్ని ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా పంపనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తాము అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి.. రిజర్వేషన్లపై ఉన్న 50శాతం పరిమితిని ఎత్తివేస్తామన్న హామీని ఓబీసీలకు రాహుల్ ఇవ్వనున్నట్లు ఆ వర్గాలు చెబుతున్నాయి.

ఉభయసభల్లో..

బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులనూ రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్రాన్ని కోరుతూ.. మంగళవారంనాడు పార్లమెంటు ఉభయ సభల్లోనూ కాంగ్రెస్ వాయిదా తీర్మానాలు ఇవ్వనుంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా రాహుల్, రాజ్యసభలో ఖర్గే వీటిని ఇవ్వనున్నారు. పార్టీ ఎంపీలతో కలిసి.. ఆ వాయిదా తీర్మానాలపై చర్చ కోసం పట్టుపట్టనున్నారు. చర్చకు అనుమతిస్తే.. బీసీ బిల్లులతో పాటు కులగణన, రిజర్వేషన్ల అమలుపై ఉన్న 50 శాతం పరిమితి ఎత్తివేత తదితర అంశాలపై పార్టీ విధానాన్ని రాహుల్, ఖర్గే స్పష్టం చేయనున్నట్లు చెబుతున్నారు. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాలోనూ వారిద్దరూ పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అలాగే ఈ అంశంపై ఈ నెల 7న రాష్ట్రపతిని కలవనున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, బీసీ ప్రతినిధుల బృందానికీ రాహుల్ నేతృత్వం వహించనున్నట్లు చెబుతున్నారు. ఒత్తిడి కార్యాచరణలో భాగంగా.. సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం ఉదయం ఢిల్లీకి వెళ్లనున్నారు. మంత్రులు, ప్రజాప్రతినిధులతో మూడు రోజులూ అక్కడే మకాం వేసి ఒత్తిడి కార్యాచరణను అమలు చేయనున్నారు. 7న రాష్ట్రపతిని కలిసిన తర్వాత.. ఆయన తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

ప్రత్యేక రైల్లో 1200 మంది..

జిల్లాకు పాతిక మంది చొప్పున కాంగ్రెస్ పార్టీ బీసీ నాయకులు, పార్టీ రాష్ట్ర నేతలు, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు.. అంతా కలిపి 1200 మంది దాకా ప్రతినిధులు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక రైల్లో ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరనున్న ఈ రైలు మంగళవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకోనుంది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఇదే రైల్లో నాగపూర్ వరకు ప్రయాణించనున్నారు.

ఆమె గురించి మాట్లాడటం వృథా అని కేసీఆర్‌కు చెప్పా..

- కేసీఆర్ బద్ధ శత్రువుల మాటలే ఆమె మాట్లాడుతున్నారు
- ఎమ్మెల్సీ కవితపై జగదీశ్‌రెడ్డి విసుర్లు



హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తనను ఉద్దేశించి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. తన ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి ఆమెకు ఉన్న జ్ఞానానికి జోహార్లు అంటూ ఎద్దేవా చేశారు. తాను పార్టీకి సైనికుడినని, ఈ మధ్యకాలంలో కేసీఆర్‌ను 50సార్లు కలిసినా బనకచర్ల, వ్యవసాయ సంబంధిత అంశాలపైనే చర్చించామన్నారు. కవిత ప్రస్తావన వచ్చినపుడు ఆమె గురించి మాట్లాడటం వృథా అని చెప్పానని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "నల్లగొండ జిల్లాలో 25 ఏళ్లలో జరిగిన ఉద్యమాలకు, గెలుపునకు నాదే బాధ్యత అయితే.. ప్రస్తుత ఓటమికి కూడా బాధ్యుడినే. కొందరు ఏదో చేస్తామని ఊహించుకుంటున్నారు. అది వారి భ్రమే. కేసీఆర్‌కు బద్ధశత్రువులుగా ఉన్నవాళ్లు, బీఆర్ఎస్‌ను ఖతం చేయాలని చూస్తున్నవాళ్లు అంటున్న మాటలనే ఆమె మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి రాలేదని, వచ్చి ఉంటే స్పందించేవాడినని చెప్పారు. కేసీఆర్ లేకపోతే ఎవరూ లేమన్న దాంట్లో ఎలాంటి సందేహం లేదన్నారు. తాను చావుతప్పి కన్నులొట్టబోయినట్టు గెలిచానని.. కానీ కొంతమంది గెలవనేలేదు కదా అని పరోక్షంగా కవితను విమర్శించారు.

నాపై అనుచిత వ్యాఖ్యల వెనుక పెద్ద నాయకుడు!

(మొదటిపేజీ తరువాయి)



చెప్పడం లేదని, ఆవేదనతో చెబుతున్నానని పేర్కొన్నారు. ఆ పెద్ద నాయకుడు తనపై చేస్తున్న కుట్రలు తిరిగి ఆయనకే తగులుతాయని వ్యాఖ్యానించారు. తన దగ్గర ఏం జరుగుతోందో తెలుసుకునేందుకు మనుషులను పెట్టారన్నారు. నల్లగొండ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని నాశనం చేసిన ఓ లిల్లీపుట్ నాయకుడు తన గురించి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఇటీవల జగదీశ్‌రెడ్డి ఓ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కవితను ఉద్దేశిస్తూ పలు వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్పందిస్తూ కవిత ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో సంచలనం రేపుతున్నాయి. మీడియా సమావేశంలో కవిత చేసిన వ్యాఖ్యలు ఆమె మాటల్లోనే.. "ఇగ ఏం జెప్పాలన్నా.. నా బాధ.. కొందరు నాపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే.. ఒక ఆడబిడ్డగా భావించి యావత్ తెలంగాణ బాధపడింది. అనేకమంది ఎక్కడికక్కడ స్పందించారు. ఏమైందో ఏమోగానీ.. బీఆర్ఎస్ పార్టీలోని అన్నదమ్ములు మాత్రం స్పందించలేదు. దీని వెనుక బీఆర్ఎస్‌కు చెందిన పెద్ద నాయకుడు ఒకరి హస్తం ఉంది. అందుకే పార్టీ నాయకులెవరూ స్పందించలేదని బలంగా నమ్ముతున్నాను. ఆ కుట్రలు చేసిన పెద్ద నాయకులు నా దగ్గర ఒక పది మందిని పెట్టి.. నా చుట్టూ జరిగే అంశాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ చావు తెలివితేటలు ప్రదర్శిస్తున్నారు. కానీ, బాగా పెద్దగా ఉన్న నాయకుడికి అర్థం కావాల్సింది ఏమంటే.. అక్కడేం జరుగుతుందో కూడా నాకు సమాచారం వస్తూనే ఉంటుంది. మీరు ఏ సమయంలో ఎవరిని కలిశారు. నామీద వ్యాఖ్యలు చేయడానికి ఎవరిని ప్రోత్సహించారు? మీరు ఎంత కిందకు దిగజారి ఒక ఆడబిడ్డ మీద అటువంటి వ్యాఖ్యలు చేయిస్తున్నారు.. అన్నీ నేను గమనిస్తూనే ఉన్నాను. ఇవాళ మీరు తాత్కాలికంగా శునకానందం పొందొచ్చు. కానీ దేవుడున్నాడు. కచ్చితంగా అది మీకు తిరిగికొట్టే సమయం వస్తుంది. ఇగ రెండోది.. ఒక లిల్లీపుట్ నాయకుడు. నల్గొండలో బీఆర్ఎస్‌ను నాశనం చేసిన ఆ లిల్లీపుట్ నాయకుడు.. ఆమెవరు, ఈమెవరు..? అని నా గురించి మాట్లాడుతున్నారంటే.. ఆయనకు ప్రోత్సాహం ఇస్తున్నదెవరో ప్రజలు ఆలోచించాలి. ఎన్నడూ ప్రజాఉద్యమాలు చేయలేదాయన.. కేసీఆరే లేకపోతే.. ఆయనెవరు? ఈ లిల్లీపుట్ నాయకుడు మాట్లాడగానే.. ఇంకో చిన్నపిల్లగాడు, నిన్నమొన్ననే మా పార్టీలోకి వచ్చిన వాళ్లు కూడా ఎలాపడితే అలా మాట్లాడుతున్నారు. చిన్న పిలగాడివి..చిన్న పిలగాడిలా ఉండుబాబూ.. (కవితపై వ్యాఖ్యలు చేసిన కార్తీక్‌రెడ్డిని ఉద్దేశిస్తూ..). పెద్దవాళ్ల విషయాల్లో తలదూర్చకు. నీ వెనకాల చాలా మంది ఉన్నారని అనుకుంటున్నావేమో? వాళ్ల సంగతికూడా ప్రజల్లోకి వస్తది. సీఎం రమేశ్ ఎందుకు వ్యాఖ్యలుచేశారో నాకు తెలియదు. ఆయన వ్యాఖ్యల వెనుక నేను కేసీఆర్‌కు రాసిన లేఖ లీక్ అవడానికి సంబంధం ఉందనుకుంటున్నాను. నాకు ఎవరి సపోర్ట్ లేదు. మ్యాచ్ ఫిక్సింగ్ నాకు రాదు.. ఆ అలవాటు వాళ్లకేఉంది. ఆవేదనతో చెబుతున్నా.. రాజకీయం చేయొచ్చుగానీ.. నీచంగా ఒక ఇంటి ఆడబిడ్డమీద ఇటువంటి మాటలు మీరే అనిపించడం ఏమిటి?" అని కవిత నిలదీశారు.

నిరాహార దీక్షకు ప్రభుత్వం అనుమతించాలి

బీసీ రిజర్వేషన్ల సాధన లక్ష్యంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సోమవారం నుంచి 72 గంటలపాటు నిరాహారదీక్ష కొనసాగిస్తానని కవిత తెలిపారు. కొంత సమయమే దీక్ష చేపట్టాలని ప్రభుత్వం సూచించిందని చెప్పారు. కానీ బీసీల్లోని 112 కులాలకు సంబంధించిన సమస్యలు చెప్పుకోవాలంటే.. రోజుకు 40 కులాల ప్రతినిధులు మాట్లాడాల్సి ఉంటుందని, ఇందుకు మూడు రోజుల సమయం పడుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం అంక్షల్లేకుండా అనుమతించాలని కోరారు.

సర్కారు నిర్ణయాలపై ఏం చేద్దాం..?

- కేసీఆర్‌తో బీఆర్ఎస్ ముఖ్య నేతల భేటీ
- కాళేశ్వరం కమిషన్ నివేదిక, ప్రభుత్వం ఎలా వ్యవహరిస్తుందన్న దానిపై చర్చ
- కవిత వ్యవహారం, బీసీ రిజర్వేషన్ల అంశంపైనా సమాలోచనలు..
- నేడు 'కన్నెపల్లి'కి బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్/గజ్వేల్/ మహదేవపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ హయాంలో కీలకంగా వ్యవహరించిన నేతలపై సర్కారు క్రిమినల్ చర్యలు చేపట్టే అవకాశముందన్న ప్రచారం నేపథ్యంలో ఆ పార్టీ అధినేత కేసీఆర్‌తో ముఖ్య నేతలు భేటీ అయ్యారు. ఆదివారం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను మాజీమంత్రులు తన్నీరు హరీశ్‌రావుతో పాటు పలువురు నేతలు కలిసినట్లు సమాచారం. కాళేశ్వరం కమిషన్ తన నివేదికలో పేర్కొన్న అంశాలేంటి? దాని ఆధారంగా రాష్ట్ర సర్కారు ఏవైనా చర్యలు తీసుకుంటే ఏం చేయాలన్న దానిపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. క్యాబినెట్ భేటీలో ఏం చర్చిస్తారు.. కాళేశ్వరం కమిటీ నివేదిక ఆధారంగా అధికారులు ఎటువంటి వివరాలను సిద్ధం చేశారు.. దాని ఆధారంగా క్యాబినెట్ ఎటువంటి నిర్ణయం తీసుకోనుందన్న దానిపై వారు సమాలోచన చేసినట్లు సమాచారం. కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌తో పాటు బాధ్యులందరిపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలని పీసీ ఘోష్ కమిషన్ సూచించినట్లయితే దాన్ని ఎదుర్కొనేందుకు ఏం చేయాలన్న దానిపై పార్టీ నేతలతో కేసీఆర్ చర్చలు జరిపినట్లు తెలిసింది. అయితే ప్రభుత్వం ఏం చేయబోతోంది.. దాన్ని ముందుగా పసిగట్టి అందుకు అనుగుణంగా న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలన్న దానిపై న్యాయ నిపుణుల సలహాలు తీసుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు శనివారం సమావేశమైన నేపథ్యంలో.. వారి ఆలోచనలేంటి? పార్టీ పరంగా ఏ నిర్ణయాలు తీసుకుందాం.. సుప్రీంకోర్టు మార్గదర్శకాల నేపథ్యంలో స్పీకర్ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారు? అంతవరకు వేచిచూసి తదుపరి నిర్ణయం తీసుకోవాలని కేసీఆర్ పార్టీ నేతలకు సూచించినట్లు తెలిసింది.

ఎమ్మెల్సీ కవిత వ్యవహారంపైనా చర్చ..

కేసీఆర్‌తో భేటీలో ఎమ్మెల్సీ కవిత అంశంపైనా పార్టీ నేతలు చర్చించినట్లు తెలిసింది. అలాగే బీసీ రిజర్వేషన్ల అంశంతో పాటు శ్రావణ మాసం కావడంతో ఫాంహౌస్‌లో చండీయాగం చేసే విషయమై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. భేటీలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కూడా పాల్గొన్నారు.

నేడు కాళేశ్వరానికి బీఆర్ఎస్ నేతల రాక!

భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కన్నెపల్లి పంపుహౌస్‌ను బీఆర్ఎస్ ముఖ్య నేతలు సోమవారం సందర్శించనున్నారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్టా మధు ఆధ్వర్యంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, వొడితెల సతీశ్‌బాబు, సుంకె రవిశంకర్, భూపాలపల్లి జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి పర్యటించనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన కన్నెపల్లి పంపుహౌస్‌ను సందర్శించి వారు స్థితిగతులను పరిశీలించనున్నట్టు తెలుస్తోంది. అనంతరం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి మీడియాతో మాట్లాడతారని సమాచారం.

ఈ నెల్లో 65 వేల టన్నుల యూరియా సరఫరా

» ఆర్‌ఎఫ్‌సీఎల్‌కు ఎరువులు, రసాయనాలశాఖ ఆదేశం

కోల్‌సిటీ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్)నుంచి ఆగస్టు నెలలో తెలంగాణకు 65 వేల టన్నుల యూరియా సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ (డీఓఎఫ్) ఆదేశించింది. జూన్‌లో 30 వేల టన్నులకు 14 వేల టన్నులు, జూలైలో 30 వేల టన్నులకు 16 వేల టన్నులు మాత్రమే సరఫరా చేశారు. మే, జూన్ నెలల్లో వార్షిక మరమ్మతులతో 40 రోజులు, గత నెలలో అమ్మోనియా పైపులైన్ లీకేజీతో 18 రోజులు ప్లాంట్ షట్‌డౌన్ కావడంతో 58 రోజుల్లో 2.5 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తికి విఘాత మేర్పడింది. ప్లాంట్ సరిగ్గా నడిచి ఉంటే గత రెండు నెలల్లో 65 వేల టన్నుల యూరియా రవాణాకు అవకాశముండేది. రాష్ట్రానికి గతేడాదితో పోలిస్తే 25 శాతం యూరియా మాత్రమే సరఫరా అయ్యింది. దీంతో తెలంగాణకు యూరియా కోటా తగ్గించారని, అవసరాలకు సరిపడా ఇవ్వాలని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మరోవైపు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అవసరానికి సరిపడా యూరియా సరఫరా చేయాలని తరచూ కేంద్రానికి లేఖలు రాయడంతోపాటు అధికారులను ఢిల్లీకి పంపుతున్నారు.

పోలీసు ఫిర్యాదుల అథారిటీ ఆఫీసు ప్రారంభం

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పోలీసు ఫిర్యాదుల అథారిటీ కార్యాలయాన్ని(ఎస్‌పీసీఏ) బీఆర్‌కే భవన్‌లోని 8వ అంతస్తులో ఆ సంస్థ చైర్మన్ జస్టిస్ బీ శివశంకర్ రావు ఆదివారం ప్రారంభించారు. డీఎస్పీ అంతకంటే ఎక్కువ హోదా కలిగిన పోలీసు అధికారుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ప్రకాశ్ సింగ్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వాజ్యంపై 2006లో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరించి ఎస్‌పీసీఏను నెలకొల్పారు. జస్టిస్ శివశంకర్ రావు మాట్లాడుతూ ఈ అథారిటీ స్వతంత్రంగా పనిచేస్తుందని, పోలీసు సిబ్బంది దుష్ప్రవర్తన లేదా వారి అధికారాలను దుర్వినియోగం చేస్తే పౌరులు కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

బీసీ రిజర్వేషన్లపై కేంద్రం పెద్దన్న పాత్ర పోషించాలి

» బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్

హైదరాబాద్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెద్దన్న పాత్ర పోషించాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ కోరారు. జనాభా ప్రాతిపదికన విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో.. బీసీలకు వాటా ఉండాలనే న్యాయసమ్మతమైన డిమాండుకు కేంద్రం సహకరించాలని ఆయన ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలన్న మోదీ సర్కార్ నిర్ణయం హర్షణీయమని, బడ్జెట్లో బీసీ సబ్ ప్లాన్ అమలుకు, ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడానికి కేంద్రం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ తలపెట్టిన మహాధర్నాకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు.

అదుపుతప్పి జనాలపైకి దూసుకెళ్లిన లారీ

» ఇద్దరి మృతి, ధ్వంసమైన వాహనాలు, దుకాణాలు

భువనగిరి టౌన్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో ఆదివారం ఓ లారీ బీభత్సం సృష్టించింది. స్థానిక జగదేవ్‌పూర్ చౌరస్తా వద్ద అదుపు తప్పిన లారీ పాదచారులు, రోడ్డు పక్కన నిలిపి ఉన్న వాహనాలు, దుకాణాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, ఐదుగురు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో జహీరాబాద్ జిల్లా కోహిర్ మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన చిలమామిడి రామకృష్ణ (35), అతని సోదరుడి కుమారుడు.. కారు డ్రైవర్ చిలమామిడి సాయికుమార్ (27) మృతిచెందారు. వీరు జీవనోపాధి కోసం కుటుంబాలతో మేడ్చల్ జిల్లా సూరారంలో నివాసం ఉంటున్నారు. ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు వచ్చి దుర్మరణం పాలయ్యారు. ప్రమాద సమయంలో దుకాణాలు మూసి ఉండటంతో పెను ప్రమాదం తప్పింది.

2నెలల్లో అందుబాటులోకి సనత్‌నగర్ టిమ్స్!



» వచ్చే నెల చివరికి నిర్మాణం పూర్తి

» సెప్టెంబరు నుంచి వైద్యసేవలు

» గుండె జబ్బులకు పెద్దాస్పత్రి ఇదే

» వివిధ అవయవమార్పిడి చికిత్సలు కూడా

» జీ+5 అంతస్తులతో నిర్మాణం.. 24 లిఫ్టులు

హైదరాబాద్ సిటీ/ఎర్రగడ్డ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ రాష్ట్ర ఛాతీ వ్యాధుల ఆస్పత్రి ఖాళీ స్థలంలో తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (సనత్‌నగర్ టిమ్స్) ఆస్పత్రి సిద్ధమవుతోంది. మరో రెండు నెలల్లో ఆస్పత్రిని అందుబాటులోకి తెచ్చి.. వైద్యసేవలు ప్రారంభించడంపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ ఆస్పత్రిని హార్ట్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతున్నారు. వెయ్యి పడకలతో కూడిన ఈ ఆస్పత్రిలో ఐదు వందల పడకలను కేవలం గుండె జబ్బుల చికిత్సల కోసమే కేటాయించనున్నారు. ప్రస్తుతం గుండె జబ్బులకు గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లోనే చికిత్స అందిస్తున్నారు. నిమ్స్‌లో ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్‌తో గుండె చికిత్సలు, అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. అయితే గుండె చికిత్సలకు సంబంధించి ఇప్పటిదాకా ప్రత్యేకంగా ప్రభుత్వ ఆస్పత్రి అంటూ ఏదీ లేకపోవడంతో సనత్‌నగర్ టిమ్స్ హార్ట్ హాస్పిటల్‌గా నిలవనుంది. ఆస్పత్రి నిర్మాణ పనులు ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేసి వైద్యశాఖకు అప్పగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సెప్టెంబరులో వార్డులు సిద్ధం చేసి.. పడకలు, వైద్యవిభాగాలు, ఆపరేషన్ థియేటర్లు, ఆధునిక పరికరాలు ఏర్పాటు చేసి.. అదేనెలలో వైద్యసేవలు అందుబాటులోకి తేనున్నారు. పది కొండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆస్పత్రి నిర్మాణం జరుగుతోంది. జీ ప్లస్ 5 అంతస్తులతో ఆస్పత్రిని నిర్మిస్తున్నారు. భవనంలో మూడు బ్లాకులు రోగులకు చికిత్స కోసమే ఉంటాయి. ఒక బ్లాక్‌ను ప్రత్యేకంగా రోగుల సహాయకులకు కేటాయిస్తారు. ఇంకో బ్లాకును అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌గా సిద్ధం చేస్తున్నారు. భవనంలో మొత్తంగా 24 లిఫ్టులు ఉంటాయి. రోగి వెంట వచ్చే సహాయకుల కోసం 230 పడకలు ఉంటాయి. టిమ్స్‌కు అనుబంధంగా మెడికల్, నర్సింగ్ కాలేజీల నిర్మాణం కూడా జరుగుతోంది. కాగా ఆస్పత్రిలో వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది నియామకంపై ఇప్పటికే వైద్యవిద్య శాఖ దృష్టి సారించింది.

శరవేగంగా పనులు

ఎర్రగడ్డ టిమ్స్ ఆస్పత్రి పనులు చివరి దశలో ఉన్నాయి. ఆగస్టు నెలాఖరుకు నిర్మాణ పనులు పూర్తి చేసే లక్ష్యంతో పనులు శరవేగంగా సాగుతున్నాయి. సెప్టెంబరులో నియామకాలు పూర్తి చేసి ఆ వెంటనే వైద్య సేవలను అందించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్రంలో గుండె జబ్బులు, అవయవ మార్పిడి కోసం పెద్ద ఆస్పత్రి ఇదేకానుంది.

- డాక్టర్ మహబూబ్‌ఖాన్, నోడల్ అధికారి

వృద్ధులకు వరంగా జెరియాట్రిక్ వార్డులు

65 ఏళ్లు పైబడిన వారికి చికిత్స అందించేందుకు బోధనాస్పత్రుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు

» మే చివరిలో మొదలైన సేవలు

» 2 నెలల్లో 2.59 లక్షల మందికి వైద్యం

» అందుబాటులో ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ చికిత్సలతోపాటు ఫిజియోథెరపీ, ఆర్థో, ఈఎన్‌టీ, మానసిక వైద్య సేవలు..

» టాప్‌లో సంగారెడ్డి జిల్లా.. వరంగల్‌లో అత్యల్ప స్పందన..

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో 65 ఏళ్లపైబడిన పెద్దల కోసం ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ వార్డులు వరంగా మారాయి. ఈ ఏడాది మేలో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లోని బోధనాస్పత్రుల్లో పదేసి పడకలతో ఈ వార్డులను ప్రారంభించారు. ఈ వార్డులు, వాటిలో అందుతున్న వైద్యసేవలకు మంచి స్పందన వస్తోందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. వీటిద్వారా రెండు నెలల్లోనే 2,59,880 మంది ఓపీ సేవలు, 32,313 మంది ఇన్‌పేషెంట్, 19,685 మంది ఫిజియోథెరపీ సేవలు పొందారని వైద్యారోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. వీటికితోడు ఆర్థో, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్, మానసిక వైద్యసేవలు పొందుతున్నవారు ఎక్కువగా ఉన్నారని స్పష్టమవుతోంది.

సంగారెడ్డి జిల్లాలో మంచి స్పందన

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో జెరియాట్రిక్ కేంద్రాలకు వస్తున్నవారి సంఖ్య పెరుగుతోంది. సంగారెడ్డి జిల్లాలో గత రెండు నెలల్లో కలిపి 30,578 మంది వైద్య సేవలు పొందారు. భద్రాద్రి కొత్తగూడెంలో 17,075 మంది, నల్గొండలో 17,342, నిజామాబాద్‌లో 13,214 మేర జెరియాట్రిక్ ఓపీ నమోదైంది.



కరీంనగర్ ప్రభుత్వాస్పత్రిలోని జెరియాట్రిక్ వార్డు

మరోవైపు పలు జిల్లాల్లో ఈ కేంద్రాలకు పెద్దగా స్పందన లేకపోవడంతో.. సేవలు మెరుగుపర్చుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ ఇటీవల వైద్యారోగ్యశాఖ సమీక్షలో ఉన్నతాధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్, నారాయణపేట్, గద్వాల, జనగామ, వరంగల్ జిల్లాల్లో జెరియాట్రిక్ కేంద్రాల్లో తక్కువ ఓపీ నమోదైంది. వరంగల్‌లో అత్యల్పంగా రెండు నెలలు కలిపి 376 మందే ఓపీకి వచ్చారు.

ఫిజియోథెరపీ కోసం వస్తున్న పెద్దలు

వృద్ధాప్యంలో మోకాళ్లు, ఇతర కీళ్ల నొప్పుల సమస్య ఎక్కువగా ఉంటుంది. వారికి ఫిజియోథెరపీతో ఉపశమనం ఉంటుంది. ప్రైవేటుగా అయితే ఫిజియోథెరపీకి ఒక్కో సెషన్‌కు రూ.500 నుంచి రూ.1000 వరకు ఖర్చవుతుంది. పైగా ఎక్కువసార్లు చేయించుకోవాల్సి ఉంటుంది. అదే జెరియాట్రిక్ కేంద్రాల్లో ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందుతండటం పెద్ద వయసు వారికి ప్రయోజనకరంగా మారింది. జెరియాట్రిక్ కేంద్రాలే కాదు.. రాష్ట్రంలో వృద్ధులకు సేవల కోసం వైద్యారోగ్యశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే ఏరియా ఆస్పత్రి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, బస్తీ దవాఖానాల్లో ప్రతీ గురువారం ప్రత్యేకంగా పెద్దల కోసం క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. బస్తీ, పల్లె దవాఖానాలకు రాలేని వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందించాలని కూడా వైద్యశాఖ ఆదేశించింది. సర్కారీ దవాఖానాల్లో ఓపీ, డయాగ్నొస్టిక్ కేంద్రాల వద్ద వృద్ధులకు క్యూ నుంచి మినహాయింపు ఇవ్వాలని సూచించింది.

ఉరుకులు పరుగుల జీవితంలో ఆసరా లేక..

ప్రస్తుతం అంతా ఉరుకుల, పరుగుల జీవితంగా మారింది. చాలా మంది పిల్లలు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులపై సరైన శ్రద్ధ పెట్టలేకపోతున్నారు. పైగా తల్లిదండ్రులు గ్రామాల్లో ఉండటం, పిల్లలు పట్టణాలకు వలస వెళ్లడం కూడా సమస్యగా మారుతోంది. కొందరు తల్లిదండ్రులు తమ సంతానం నుంచి సొమ్ము తీసుకుని ఖర్చు చేయడానికి ఇష్టపడటం లేదు. ఈ కారణాలన్నీ కలిసి పెద్ద వయసువారికి సరైన వైద్యం అందని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన జెరియాట్రిక్ కేంద్రాలకు వస్తున్న పెద్దల సంఖ్య పెరిగిందని వైద్య వర్గాలు చెబుతున్నాయి.

నెమ్మదించిన కృష్ణమ్మ పరవళ్లు

» శ్రీశైలం, సాగర్ గేట్ల మూసివేత

» కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

గద్వాల/నాగార్జునసాగర్/మహదేవపూర్ రూరల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): కృష్ణా ప్రాజెక్టులకు వరద క్రమంగా తగ్గుతోంది. దీంతో ఒక్కొక్కటిగా ప్రాజెక్టుల గేట్లను అధికారులు మూసివేస్తున్నారు. ఆదివారం ఆల్మట్టి, శ్రీశైలం, నాగార్జునసాగర్ గేట్లు మూసుకోగా, ఆయా ప్రాజెక్టుల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 1.19 లక్షల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా 66,297 క్యూసెక్కుల నీటిని విద్యుదుత్పత్తి ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 199.27 టీఎంసీల నిల్వ ఉంది. నాగార్జునసాగర్‌కు 47,592 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. విద్యుదుత్పత్తి, కాల్వలకు అంతేస్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 312 టీఎంసీలకు ప్రస్తుతం అందులో 300 టీఎంసీలున్నాయి. ఇటు కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. 1.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నట్లు అధికారులు చెప్పారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్ అందాలను తిలకించేందుకు ఆదివారం భారీగా పర్యాటకులు తరలివచ్చారు. దీంతో సాగర్ పైలాన్ కాలనీ కొత్త వంతెన నుంచి ప్రధాన జలవిద్యుత్తు కేంద్రం వెళ్లే రహదారిలో, అలాగే బైపాస్ రోడ్డులో 3 కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ నిలిచింది. దీంతో పోలీసులు శ్రమించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అయితే ఉదయం 11 గంటలకే ప్రాజెక్టు గేట్లన్నీ మూసేయడంతో ఎక్కువ మంది లాంచీ ప్రయాణానికి ఆసక్తి చూపారు. జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండకు లాంచీలో వెళ్లారు. సాధారణ రోజుల్లో ఒకటి లేదా రెండు లాంచీ ట్రిప్పులు నడుస్తుండగా, ఆదివారం ఆరు ట్రిప్పులు నడిపారు. బుద్ధవనానికి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చినట్లు బుద్ధవనం అధికారులు తెలిపారు.

8 లేన్లతో ఎలివేటెడ్ కారిడార్

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించాలని భావిస్తున్నారు. ఆ నమూనా ప్రకారం కింది భాగంలో సర్వీస్ రోడ్డు ఉంటుంది. మధ్యలో ఎన్‌హెచ్-65 (విజయవాడ హైవే) మార్గం అనుసంధానమవుతుంది. దానిపైన మెట్రో రైలు మార్గం ఉంటుంది. ఈ మేరకు ఎలివేటెడ్ కారిడార్‌ను మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని విజ్ఞప్తి చేయనుంది. ఇందుకోసం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ నెల 6న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలవనున్నారు. ఆదివారం ఆయన ఎల్బీనగర్ పనామా చౌరస్తా నుంచి హయత్‌నగర్ రేడియో స్టేషన్ వరకు విజయవాడ జాతీయ రహదారిని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ రాంరెడ్డితో కలిసి పరిశీలించారు. ఎలివేటెడ్ కారిడార్ కోసం వెంటనే డీపీఆర్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. హైవే నుంచి ప్రధాన చౌరస్తాలు, కాలనీలకు వెళ్లే చోట్ల యూటర్న్‌లను ఏర్పాటు చేస్తూ డబుల్ డెక్కర్ రోడ్డును వచ్చే ఏడాది జూన్‌లోపు నిర్మిస్తామన్నారు. విజయవాడ హైవేపై 17చోట్ల ప్రమాద స్థలాలను గుర్తించామని, ఆ ప్రాంతాల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తామని తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు 2 గంటల్లో చేరుకునేలా మరో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రోడ్డును నిర్మించనున్నామని, ఇదే విషయంపై ఏపీ సీఎం చంద్రబాబు కూడా కేంద్రానికి విజ్ఞప్తి చేశారని తెలిపారు. రెండు నెలల్లోనే ఈ పనులు మొదలవుతాయన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పాలనపై ఎంతో నమ్మకం ఏర్పడిందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో 90% సీట్లతో కాంగ్రెస్ అభ్యర్థులు తప్పక గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాగా, హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్-65) మార్గంలో ఎల్బీనగర్ నుంచి ఔటర్ రింగు రోడ్డు వరకు ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోంది. అందుకే ఎన్‌హెచ్ఏఐ ఈ రోడ్డును విస్తరించడంతో పాటు అవసరమైన చోట్ల విజయవాడ వరకు ఫ్లై ఓవర్లు నిర్మిస్తోంది. ఈ క్రమంలోనే 2021లో చింతలకుంట నుంచి మల్కాపూర్ వరకు దాదాపు 25కి.మీ. మేర రోడ్డు విస్తరణకు రూ.541కోట్లు మంజూరు చేసింది. హయత్‌నగర్, వనస్థలిపురంతో పాటు మరో ఒకటి, రెండు చోట్ల అండర్‌పాస్‌లను నిర్మించాలని నిర్ణయించారు. అయితే, అండర్‌పాస్‌లకు స్థానికులు అంగీకరించలేదు. ఫలితంగా ఈ కొద్ది దూరం మినహా మిగతా చోట్ల దాదాపు 80% పనులు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఎల్బీనగర్ చింతలకుంట నుంచి హయత్‌నగర్ వరకు డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. కాగా, మెట్రో రైలు రెండో దశ అనుమతుల బాధ్యతను కూడా సీఎం రేవంత్ తనపై పెట్టారని వెంకట్ రెడ్డి చెప్పారు. త్వరలో రేవంత్‌తో కలిసి ప్రధాని మోదీ, కేంద్రమంత్రి గడ్కరీని కలుస్తామన్నారు.



విజయవాడ హైవేను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

బీజేపీ రాష్ట్ర కమిటీలో ప్రక్షాళన?

కొత్త వారికి పదవులు దక్కే అవకాశం

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కమిటీలో భారీ ప్రక్షాళన జరగనుందా? ఇప్పటిదాకా కమిటీలో కొనసాగిన వారిలో చాలామందికి కొత్త కమిటీలో అవకాశం కష్టమేనా? నామ్‌కే వాస్తేగా కమిటీలో ఉన్న నాయకులకు షాక్ తప్పదా? అంటే బీజేపీ వర్గాల్లో అవుననే సమాధానమే వస్తుంది. నూతన కమిటీలోని దాదాపు 70 శాతం పదవులను కొత్త వాళ్లకే కేటాయించబోతున్నారని ఆ పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. గత కమిటీల్లో క్రియాశీలకంగా పని చేసిన వారిని మాత్రమే కొనసాగించాలని అధినాయకత్వం అనుకుంటున్నట్టు తెలిసింది. గత ఐదేళ్లలో కొందరు కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, అధికార ప్రతినిధులు కనీసం పార్టీ కార్యాలయం ముఖం కూడా చూడలేదనే ఆరోపణలున్నాయి. అలాంటి వారికి ఈసారి పదవులు లభించే అవకాశం లేదని అంటున్నారు. గత కమిటీలో 16 మంది అధికార ప్రతినిధులు ఉండగా, వీరిలో పలువురు కేవలం హోదా కోసమే కొనసాగినట్లు విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అధికార ప్రతినిధుల సంఖ్య తగ్గింపు అంశంపై ముఖ్యనేతల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు, గత కమిటీలో ప్రాతినిధ్యం లేని జిల్లాలకు కొత్త కమిటీలో ప్రాధాన్యం ఇచ్చే అవకాశముందని చెబుతున్నారు. కీలకమైన ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ అధికంగా ఉందని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. పార్టీ నియమావళి ప్రకారం, సంస్థాగత ప్రధాన కార్యదర్శితో పాటు నలుగురు ప్రధాన కార్యదర్శులు ఉంటారు. కాగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఈనెల 6న పెద్దపల్లి, మంచిర్యాల, సిర్పూర్-కొమ్రంభీం, 7న భువనగిరి, జనగాం జిల్లాల్లో పర్యటిస్తారు.

పల్లెల వద్దకే పాలన!

» సీఎం రేవంత్ ఆదేశంతో క్షేత్రస్థాయికి కలెక్టర్లు

» ఇందిరమ్మ ఇళ్ల నుంచి మధ్యాహ్న భోజనం వరకు.. సంక్షేమ, అభివృద్ధి పథకాల పరిశీలన

» జిల్లాల కలెక్టర్లతో వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు.

» నిరంతరం పర్యవేక్షిస్తున్న సీఎంవో అధికారులు

» జిల్లాల సమస్యలు, అభివృద్ధిపై సీఎంకు నివేదికలు

హైదరాబాద్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్తున్నారు. ప్రధానంగా పాఠశాలలు, వసతి గృహాలు, ఆస్పత్రులను తనిఖీ చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వాటికి ఉచిత ఇసుక సరఫరా, రేషన్ కార్డుల పంపిణీ ఇలా ప్రతి అంశాన్నీ పర్యవేక్షిస్తున్నారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సీఎం గత నెల 21న వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించిన సంగతి తెలిసిందే. ఏ రోజు ఏం చేశారో మరుసటి రోజు తనకు నివేదిక ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను జాగ్రత్తగా పర్యవేక్షించాలని నిర్దేశించారు. ఈ నేపథ్యంలో ఇందిరమ్మ ఇళ్ల నుంచి మధ్యాహ్న భోజన పథకం వరకు ప్రతి విషయాన్నీ కలెక్టర్లు పరిశీలిస్తున్నారు. పథకాల లబ్ధిదారులు, విద్యార్థులతో మాట్లాడుతున్నారు. జిల్లాలో సమస్యలను నియోజకవర్గాల వారీగా ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయి అధికారులకు చేరవేస్తున్నారు. దీన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో)లోని అధికారులకు ఒక్కొక్కరికీ ఉమ్మడి జిల్లాల వారీగా అప్పగించిన బాధ్యతల మేరకు ఆయా జిల్లాల అధికారులతో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. జిల్లాల వారీగా వచ్చిన ఆయా అంశాలు, సమస్యలు, విషయాలను సీఎంవో అధికారులు ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌కు నివేదిస్తున్నారు. వెరసి రాష్ట్రంలో పాలన పల్లెలకు చేరుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వ్యాధుల బెడద ఉన్న దృష్ట్యా తగు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా ప్రధాన ఆస్పత్రులు, సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్లు సందర్శిస్తున్నారు. మందుల లభ్యత ఎలా ఉందనే విషయాన్ని ఆరా తీస్తున్నారు. ఐటీడీఏ పరిధిలోని తండాలు, గిరిజన గూడేల్లో వైద్య శిబిరాలను ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. పాఠశాలలు, వసతి గృహాలను తనిఖీ చేస్తున్నారు. భోజనం నాణ్యత, వసతులను పరిశీలిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్నారు. ఎరువుల లభ్యత, దుకాణాల్లో ఉన్న నిల్వలు, రికార్డులను పరిశీలిస్తున్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా తిరుమలాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర(ఫైల్)



బొగత వద్ద పర్యాటకుల సందడి

వాజేడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నయాగరా బొగత జలపాతం ఆదివారం జనసంద్రమైంది. వారాంతపు సెలవు కావడంతో సందర్శకులు భారీగా తరలి వచ్చారు. జలపాతం పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, భద్రాచలం, ములుగు, జనగాం తదితర పట్టణాల నుంచి సందర్శకులు తరలివచ్చి జలపాతం అందాలను వీక్షించి మురిసిపోయారు. జలపాతం వద్ద ఉన్న ఈత కొలనులో జలకాలాడుతూ సందడి చేశారు. మొత్తం 3 వేల మందికి పైగా సందర్శకులు వచ్చారు. ఈ ఏడాది ఇంత భారీ స్థాయిలో పర్యాటకులు తరలిరావడం ఇదే ప్రథమం. పర్యాటకుల వాహనాలతో పార్కింగ్ ప్రదేశం నిండిపోయింది.

37 ఔషధాల ధరల తగ్గింపు

న్యూఢిల్లీ, ఆగస్టు 3: పలు వ్యాధులతో బాధపడుతున్న వారికి కేంద్రం ఊరట కల్పించింది. 37 నిత్యావసర ఔషధాల ధరలను తగ్గించింది. ఈ మేరకు జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ (ఎన్‌పీపీఏ) సీలింగ్ ధరలను జారీ చేసింది. వీటిలో ఇన్ఫెక్షన్లు, గుండె జబ్బులు, వాపుల నుంచి మధుమేహం, విటమిన్ లోపాల వరకు ఉపయోగించే మందులు ఉన్నాయి. వీటిలో పారాసిటమాల్, అటోర్వాస్టాటిన్, అమోక్సిసిలిన్, మెట్‌ఫార్మిన్ వంటి ఔషధాలున్నాయి. డాక్టర్ రెడ్డీస్ లాబొరెటరీస్ విక్రయించే ఎసిలోఫెనాక్, పారాసిమాల్, ట్రిప్సిన్ కైమోట్రిప్సిన్ కాంబినేషన్ టాబ్లెట్ ధర రూ.13గా నిర్ణయించారు. ఇదే కాంబినేషన్‌తో క్యాడిలా ఫార్మాసూటికల్స్ విక్రయించే టాబ్లెట్ ధరను రూ.15.01గా ఉంటుంది. గుండె సంబంధిత వ్యాధులున్న వారు వాడే అటోర్వాస్టాటిన్ 40 ఎంజీ+క్లోపిడొగ్రెల్ 75 ఎంజీ టాబ్లెట్ ధరను రూ.25.61గా నిర్ణయించారు. విటమిన్ డీ లోపానికి వాడే కోలికాల్సిఫెరాల్ చుక్కల మందు, చిన్నారులకు వాడే సెఫిక్సిమ్ ఓరల్ సస్పెన్షన్, డైక్లోఫెనాక్ ఇంజెక్షన్ (ఒక ఎంఎల్ రూ.31.77) వంటివి కూడా ధరలు తగ్గించిన వాటిలో ఉన్నాయి. టైప్ 2 డయాబెటీస్ నియంత్రణలో కీలకమైన ఎంపాగ్లిఫ్లోజిన్, సిటాగ్లిప్టిన్, మెట్‌ఫార్మిన్ హైడ్రోక్లోరైడ్ కాంబినేషన్స్ ఒక్కో టాబ్లెట్ ధరను రూ.16.50కి పరిమితం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar, Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.